


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం : fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-1-2025 గురువారం సంపుటి: 30 సంచిక: 348 పేజీలు: 8+16 వెల: 6.50


మళ్లీ కేజ్రీవాల్‌పై ఇడి విచారణ

స్వాతంత్ర్యంపై భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం: రాహుల్ 5

## తెలంగాణకు నలుగురు కొత్త జడ్జిలు






జస్టిస్ వై.రేణుక, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ మధుసూదన్‌రావు

### ఎపికి ఇద్దరు జడ్జిల నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి15:** తెలుగు రాష్ట్రాలకు మరోఆరుగురు కొత్తన్యాయమూర్తులను కేంద్రం కేటాయించింది. తెలంగాణకు నలుగురు న్యాయమూర్తులు, ఏపీకి ఇద్దరు న్యాయమూర్తులను కేంద్రం కేటాయించింది. జ్యూడిషియల్ ఆఫీసర్ల కోటాలో తెలంగాణలో నలుగురు జిల్లా జడ్జీలను తెలంగాణ హైకోర్టు జడ్జీలుగా, ఏపీలో ఇద్దరు జిల్లా జడ్జీలను ఏపీ హైకోర్టు జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ పేర్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని >>2



## హైకోర్టు కొత్త సిజెగా జస్టిస్ సుజయ్‌పాల్

### జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టు సిజెగా బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి15:** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు (ప్రధాన న్యాయమూర్తి)సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు >>2

కెటిఆర్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

## సుప్రీంలోనూ క్వాష్ పిటిషన్ కొట్టివేత

### 'ఫార్ములా' కేసులో నిందితులు ముగ్గురికి మళ్లీ ఎసిబి నోటీసులు!

### మలి విచారణలో ఒకరిద్దరు అరెస్టయ్యే అవకాశం



**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత కెటిఆర్ కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో హైకోర్టు వెల్లడించిన తీర్పును కొట్టి వేయాలని సుప్రీం కోర్టులో కెటిఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది, జ స్టిస్ ప్రసన్న వర్లతో కూడిన ధర్మాసనం డిస్మిస్ చేసింది. కెటిఆర్ పిటిషన్‌పై బుధవారం జరిగిన విచారణపై అంతకు ముందు హోరాహోరీగా వాదనలు జరిగాయి. మొదట కెటిఆర్ తరపున వాదించిన సుప్రీం కోర్టు న్యాయవాది సిద్దార్థ్ ధవే ఫార్ములా ఈ కార్ రేసులో కెటిఆర్‌ను అన్యాయంగా ఇరికించారని తెలిపారు. దీనికి సంబంధం చి ఎసిబి నమోదు చేసిన కేసులో ఎక్కడా కెటిఆర్ పేరు లేదని, ఆయన ఎక్కడా డబ్బులు తీసుకున్నట్లు కానీ వ్యక్తిగతంగా ప్రయోజనం పొందినట్లుగా లేదని ధవే తెలిపారు. దీనిపై ఎసిబి నమోదు చేసిన >>2

నేడు ఇడి విచారణకు హాజరుకానున్న కెటిఆర్ 2

# వచ్చేనెల స్థానిక ఎన్నికలు



బుధవారం న్యూఢిల్లీలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

### ఇక వ్యూహ రచనలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు

### ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో సమావేశమైన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, ఇతర మంత్రులు

### మంత్రివర్గ విస్తరణ సహా పలు కీలక అంశాలపై చర్చలు

### వచ్చే నెలలోనే రాహుల్ తెలంగాణ రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి15:** ఫిబ్రవరిలో స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు వ్యూహాలు రూపొందించుకోవాలని సూచించినట్లు సమాచారం. ఫిబ్రవరిలో తెలంగాణకు రాహుల్ గాంధీ రానున్నారని సమాచారం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర నేతలు ఢిల్లీలో సమా వే శమయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ >>2

## బిఆర్‌ఎస్ కాదు బి-ఆర్‌ఎస్‌ఎస్

### ఆ రెండు పార్టీల వైఖరి ఒకేరకంగా ఉంది

### ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి15:** తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ వైఖరి ఒకేరకంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ కాదు బి-ఆర్ఎస్ఎస్‌గా మారిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఢిల్లీలో >>2

పోలవరం ముంపుపై నిర్దేశిత సమయంలో ఐఐటితో అధ్యయనం 2

## జాతీయ పసుపు బోర్డు కార్యకలాపాలు మొదలు

### వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్రమంత్రి పీయూష్ గోయెల్

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, మేఘాలయతో సహా 20 రాష్ట్రాల్లో పసుపు పంట పండించే రైతుల కోసం ప్రధానమంత్రి మోడీ ఒక బహుమతిగా తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు కార్యకలాపాలను మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర మంత్రి వెంట నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు పంటను వ్యవసాయంలో బంగారంతో పోల్చుతామని, అలాంటి పంట సాగు కోసం ఈ బోర్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గత ఏడాది మూడు లక్షల హెక్టార్లలో పంట సాగు చేసి 11 లక్షల టన్నుల ఉత్పత్తి చేశారని చెప్పారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో వెరైటీ పసుపు పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా దేశవ్యాప్తంగా 30 వెరైటీలు సాగు చేస్తున్నాని వివరించారు. ఈ పసుపు వెరైటీలకు వాటికి జియో ట్యాగ్ కూడా ఉందని పేర్కొన్నారు. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో >>2

## మే 2 నుంచి 'సెట్'లు



### తెలంగాణలో ప్రవేశ పరీక్షల షెడ్యూలు ఖరారు

### తొలుత ఇంజినీరింగ్ ఇఎపి సెట్, తర్వాత ఇ-సెట్, ఎడ్‌సెట్, లాసెట్‌లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి15:** తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పరీక్షల సీజన్ మొదలైంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిర్వహించే వివిధ రకాల ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి బుధవారం విడుదల చేసింది. ఈఏపీసెట్, ఎడ్‌సెట్, లాసెట్ సహా అన్ని రకాల ప్రవేశ పరీక్షల తేదీలను ప్రకటించింది.ఇంటర్ విద్యార్థులకు ఎంతో కీలకమైన ఈఏపీసెట్ ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు వివిధ తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 29,30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు, మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. మే 12న ఈసెట్‌ను, ఎడ్‌సెట్‌ను జూన్ 1న నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది. వీటితో పాటు జూన్ 6న లాసెట్, పీజీ లా సెట్ ఒకేరోజు నిర్వహిస్తున్నారు. జూన్ 8, 9 తేదీలల్లో ఐసెట్, జూన్ 16 నుంచి మొదలుకుని 19 వరకు పీజీఈసెట్ పరీక్షలు జరగనున్నాయి.

ఏప్రిల్ 29,30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోసం మే 2 నుంచి 5వ తేదీ వరకు ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎప్‌సెట్ జరగనుంది. ఎప్‌సెట్ పరీక్షలు జేఎన్‌టీయూహెచ్ నిర్వహించనుండగా ప్రొఫెసర్ డీన్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. డిప్లొమా విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మా కోర్సుల్లో రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ఈసెట్ మే 12న జరగనుంది. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించే ఈసెట్ కన్వీనర్ గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ వ్యవహిస్తారు. బీఈడీ ప్రవేశాల కోసం జూన్ 1న ఎడ్‌సెట్ జరగనుంది. కాకతీయ యూనివర్సిటీ నిర్వహించే ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కేయూ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి ఉన్నారు. ఎల్‌ఎల్‌బీ ప్రవేశాల కోసం లాసెట్ ఎల్‌ఎల్‌ఎం కోసం పీజీఎల్‌సెట్ పరీక్షలు జూన్ 6న నిర్వహిస్తారు. లాసెట్, పీజీఎల్ సెట్ నిర్వహణ బాధ్యతలు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అప్పగించి కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి. విజయలక్ష్మిని నియమించారు. ఎంబీఏ, ఎంసీఏ డిమాండ్ ఉన్న కోర్సుల్లో ప్రవేశాల కోసం జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్ పరీక్ష జరగనుంది. ఐసెట్‌ను మహాత్మగాంధీ యూనివర్సిటీ నిర్వహించనుండగా ఆ యూనివర్సిటీ ప్రొఫెసర్ అలువాల రవి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎంటెక్, ఎంఫార్మసీ >>2

## కదిలిన అధునాతన యుద్ధనౌకలు

### ఐఎన్‌ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్ జలంతర్గామిని జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ




బుధవారం ముంబయిలో ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామిని జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చిత్రంలో ఉన్నారు.

**ముంబయి, జనవరి 15:** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధనౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ హాజరై యుద్ధనౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకాదళ బలం మరింత పటిష్ఠం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకు సాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయరు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా రెండు యుద్ధనౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్‌లో తయారైనవే. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది అని వివరించారు. సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి అని ప్రధాని పిలుపునిచ్చారు. పి15 బి గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. >>2

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో భారీ అగ్ని ప్రమాదం 3

## సెమీ కండక్టర్ల ఉత్పత్తికి చేయూతనివ్వండి

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన మంత్రి శ్రీధర్‌బాబు




బుధవారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 15 ప్రభాతవార్త:** సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్రం సైతం సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం కేంద్రమంత్రి అశ్వినివైష్ణవ్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్ ఏర్పాటు చేయడం ఆవశ్యమన్నారు. ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సెమీ కండక్టర్ మిషన్ పురోగతిపై ఆయన అభినందనలు తెలిపారు. వచ్చే నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

3 రోజుల్లో 8 కోట్ల మంది..

## 'మహాకుంభ్'కు జన ప్రవాహం



బుధవారం త్రివేణి సంగమం వద్ద లక్షలాది భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న దృశ్యం

### త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల కోసం బారులుతీరిన జనం

### 13 అఖాడాలకు చెందిన సాధువులతో నిండిపోయిన గంగాతీరం

### ఇసుకవేస్తే రాలనట్లుగా నిండిపోయిన పదివేల ఎకరాల 'కుంభ్‌నగర్'

**ప్రయాగరాజ్, జనవరి 15:** అంగరంగ వైభవంగా సాగుతున్న ప్రయాగరాజ్ కుంభ్‌మేళాలో రోజురోజుకూ భక్తుల రాకపెరుగుతోంది. మూడు పవిత్రనదుల సంగమం త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్రస్నానంకోసం బారులు తీరి మరీ నిలుచున్నారు. తొలిరోజు 1.75 కోట్లమందికిపైగా స్నానాలు చేసినట్లు యూపి >>2

బస్సుకు మంటలు.. నిర్మల్ జిల్లా వ్యక్తి సజీవ దహనం 3



పొంగల్ వేడుకల్లో భాగంగా తమిళనాడు మదురై జిల్లా పలమేడులో నిర్వహించిన జల్లికట్టు దృశ్యం

# సుప్రీంలోనూ క్వాష్ పిటిషన్ కొట్టివేత

>> ఎఫ్ఐఆర్‌లో కెటిఆర్‌తో పాటు ఇద్దరు అధికారుల పేర్లను మాత్రమే నమోదు చేశారని, ఇది పూర్తిగా రాజకీయ కక్షతో కూడుకున్న దని ఆయన వాదించారు. ప్రతిపక్ష నేతగా ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతున్నందునే ప్రభుత్వం కక్షగట్టి వరుసగా కేసులు నమోదు చేస్తుందని ఆయన వాదించారు. కా గా కెటిఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరిగితే ముందుగా తమ వాదనలు వినాలని ఇంతకు ముందే ప్రభుత్వం సుప్రీం కోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేయడంతో పాటు ఈ కేసుకు సంబంధించిన అన్ని వివరాలను చెప్పడం తెలిసిందే. కెటిఆర్ తరపున ధవే వాదనలు పూర్తయిన వెంటనే జస్టిస్ బేలా త్రివేది, జస్లిస్ ప్రసన్న వర్ల ధ ర్మాసనం కెటిఆర్ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తాము జోక్యం చేసుకోబోమని, అక్కడే అన్ని విషయా లు వెలుగులోకి వస్తాయని జస్టిస్ బేలా త్రివేది తెలిపారు. ఈ కేసు తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగితే కెటిఆర్‌కు జరిగే నష్టం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రతి పక్ష నేత కేసులను ఎదుర్కోవాలి కదా...? అని జస్టిస్ బేలా త్రివేది ప్రశ్నించారు. దీని తరువాత కెటిఆర్ తరపు న్యాయవాది ధవే మాట్లాడుతూ పిటిషన్‌ను వెనక్కు తీ సుకుని హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే పిటిషన్‌ను విత్ డ్రా చేసుకునే అవకాశం ఇచ్చిన ధర్మాసనం మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛను ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో నిరాశకు లోనైన కెటిఆర్ తరపు న్యాయవాది ధవే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు.

**మలిదఫా విచారణలో ఒకరిద్దరు అరెస్టు...?**

ఇదిలావుండగా హైకోర్టు ఫార్ములా ఈ కార్ రేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకోబోయని సుప్రీం కోర్టు చెప్పడంతో ఈ కేసులో నిందితులుగా వున్న కెటి ఆర్, అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలకు ఎసిబి అధికారులు మరో దఫా నోటీసులు ఇచ్చే అవకాశాలున్నాయి. ఒకటి రెండు రోజుల్లో ఈ నోటీసులు జారీ అయ్యే వీ లుందని తెలుస్తోంది. ఈ దఫా జరిగే విచారణలో ముగ్గురిలో ఒకరిద్దరు అరెస్టయ్యే వీలుందని వార్తలు వస్తున్నాయి. ఈ కేసులో కెటిఆర్, అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలను ఎసిబి అధికారులను ఇప్పటికే ఒకసారి విచారించడం తెలిసిందే. ఇందులో కెటిఆర్‌ను అత్యధికంగా ఏడు గంటలకు పైగా విచారించారు. మరోదఫా విచారణలో ఫార్ములా ఈ కార్ రేసులో ప్రమోటర్‌గా వున్న ఎస్ నెక్స్ట్‌జెన్ ఒకటవ రేసు పూర్తయిన తరువాత రెండవ రేసు నుంచి ఎందుకు తప్పుకుందనే దానిపై విచారించే వీ లుంది. దీంతో పాటు ఫార్ములా ఈ ఆపరేషన్ (ఎఫ్ఈఓ)కు హెచ్ఎండిఎ నుంచి జరిగిన 55 కోట్ల రూపాయల నిధుల బదలాయింపు, ఈ కంపెనీ లండన్ ఆర్బిట్రేటర్ లో తెలంగాణ సర్కారుకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌పైనా, అనంతరం ఈ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్న వైనంపైనా విచారించే వీలుంది. దీంతో పాటు బిఆ ర్ఎస్‌కు గ్రీన్ కో అనే సంస్థ నుంచి అందిన 41 కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్స్‌పైనా విచారించే వీలుంది. హెచ్ఎండిఎ నుంచి బదలాయించిన 55 కోట్ల రూపా యలు, ఎఫ్ఈఓ నుంచి గ్రీన్ కో సంస్థకు చేరాయని, అనంతరం ఆ సంస్థ 41 కోట్ల రూపాయలను బిఆర్ఎస్‌కు 41 కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్స్ ఇచ్చిందని ఎసిబి ఆరోపిస్తోంది. వీటన్నింటిని విచారణలో తేల్చేందుకు సిద్ధమవుతోంది.

# నేడు ఇడి విచారణకు హాజరు కానున్న కెటిఆర్

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత కెటిఆర్ గురువారం నాడు విచారణకు హాజరుకానున్నారు. ఈ నెల 16వ తేదీన విచారణకు రావాలని కెటిఆర్‌కు ఈడీ ఇదివరకే నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండిఎ విశ్రాంత అధికారి బిఎల్ఎన్ రెడ్డి లను ఈడీ విచారంచడం విదితమే. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న కెటిఆర్‌ను ఈడీ చివరగా విచారించేందుకు నిర్ణయించింది. ఫార్ములా ఈ కార్ రేసుకు సం బంధించి ఈడీ మనీలాండరింగ్, ఫెమా ఉల్లంఘన చట్టం కింద కేసులు నమోదు చేయడం తెలిసిందే. మరోవైపు కెటిఆర్ విచారణకు ఈడీ అధికారులు బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాట్లు చేబట్టారు. ఉదయం 11 గంటల సమయంలో కెటిఆర్ ఈడీ కార్యాలయంలో విచారణకు రానున్నారని తెలిసింది. వాస్తవానికి ఈ నెల మొదటి వారంలోనే కెటిఆర్‌ను ఈడీ విచారించాలని భావించినా ఆ సమయంలో హైకోర్టులో వున్న పెండింగ్ కేసు నేపథ్యంలో ఆయన విచారణకు గైర్హాజర్ అయ్యారు. ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి హైకోర్టులో కెటిఆర్‌కు వ్యతిరేకంగా తీర్పు రాగా తాజాగా బుధవారం నాడు సుప్రీం కోర్టు కూడా ఇందులో జోక్యం చేసుకునేం దుకు నిరాకరించింది. దీంతో కెటిఆర్ ఈడీ ఎదుట తప్పనిసరిగా హాజరు కావాల్సి న పరిస్థితి ఏర్పడింది. ఈ కేసుకు సంబంధించి ఈ నెల తొమ్మిదవ తేదీన ఎసిబి అ ధికారులు కెటిఆర్‌ను ఏడు గంటలకు పైగా విచారించడం తెలిసిందే.

## అధునాతన యుద్ధనౌకలు

>> ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ, సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం. పి17ఎ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞా నంతో దీన్ని తయారుచేశారు. పి75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

# ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణ: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఇందులో భాగంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణతో అడుగులేస్తోందని చెప్పారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పామాయిల్ గెలలు టన్ను ధర రూ.20 వేలకు పైగా ఉందని చెప్పారు. ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు యాంత్రీకరణ దిశగా తెలంగాణ వ్యవసాయం అడుగులు వేస్తుందని వివరించారు. రానున్న రోజుల్లో దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణ మారనుందని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భీమా పథకాలతో యావత్ దేశానికే తెలంగాణ మార్గదర్శిగా నిలిచిందని వ్యాఖ్యానించారు. వచ్చే సంక్రాంతి నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్ట్, వైరా లింక్ కెనాల్, మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు పూర్తయి దశాబ్దాల సాగునీటి కల సాకారం అవుతుందని తెలిపారు. రైతన్న ఇంట సిరులు కురిపించే ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున రాష్ట్రంలో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు యాంత్రీకరణ దిశగా తెలంగాణ వ్యవసాయం అడుగులు వేస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ ప్రజా పాలనలో రైతు రాజ్యం వచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

## పోలవరం ముంపుపై నిర్దేశిత సమయంలో

# ఐఐటీతో అధ్యయనం

**తెలంగాణకు నీటి కేటాయింపుల విషయంలో బలమైన వాదనలు వినిపించాలి..**

**ఐఎస్ఆర్‌డబ్ల్యుడిఎ1956 సెక్షన్ 3ని పరిగణనలోకి తీసుకోవాలి..**

**గోదావరి-బనకచర్లపై అభ్యంతరాలతో జల్‌శక్తి మంత్రి, ఎపి ముఖ్యమంత్రికి లేఖలు**

**నీటి పారుదల శాఖ సమీక్షలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి15:** తెలంగాణకు అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ)1956 సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (ఏపీఆర్ఏ)2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏపీఆర్ఏ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగా నీటి పంపకాలు రెండు రాష్ట్రాల మధ్య చేపట్టాలని సూచించిందని సీఎం తెలిపారు. కేడబ్ల్యూడీటీ-2 తదుపరి విధివిధానాలపై (ఫర్దర్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి స్టే ఇవ్వని విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు (జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ) తెలంగాణ తరఫున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖల్లో ప్రస్తావించాలని సీఎం సూచించారు.పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటీతో అధ్యయనం చేయించే అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. సిఎం వద్ద జరిగిన సమీక్షలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్,నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణా జలాల్లో మేజర్ షేర్-ట్రిబ్యునల్‌లో వాదన వినిపిస్తాం: ఉత్తమ్**

కృష్ణ ట్రిబ్యునల్ పై గురువారం నుంచి రెండు రోజుల పాటు సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. న్యాయస్థానంలో తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్, సుప్రీంకోర్టు న్యాయవాది వైద్యనాథన్‌ను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల ప్రతిపాదనకు సూచనప్రాయంగా ఒప్పుకున్నారని, నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగవద్దని మంత్రి అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టిఎంసిల నీటి కేటాయింపులు జరిగాయని, ఆ వాదనను తాము ఇప్పుడు ఏకీభవించడం లేదన్నారు. తెలంగాణలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టీఎంసీలు కేటాయించారని, అందులో మెజార్టీ టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా జలాలపై అధిక హక్కులు తమకే ఉన్నాయనే వాదనను ట్రిబ్యునల్ లో వాదించనున్నట్లు తెలిపారు.



బుధవారం న్యూఢిల్లీలో నీటిపారుదలపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

# మే 2 నుంచి 'సెట్'లు

| పరీక్ష పేరు | ప్రవేశ పరీక్ష తేదీ |
|---|---|
| అగ్రికల్చర్ | ఏప్రిల్ 29 |
| ఫార్మసీ | ఏప్రిల్30 |
| ఇంజనీరింగ్ | మే 2 నుంచి 5 వరకు |
| ఈసెట్ | మే 12 |
| ఎడ్‌సెట్ | జూన్ 1 |
| లాసెట్, పీజీ లాసెట్ | జూన్ 6 |
| ఐసెట్ | జూన్ 8, 9 |
| పీజీఈసెట్ | జూన్ 16 నుంచి 19 వరకు |
| పీఈసెట్ | జూన్ 11 నుంచి 14 వరకు |

>> కోర్సుల కోసం జూన్ 16 నుంచి 19 వరకు పీజీఈసెట్ నిర్వహించనున్నారు. జేఎన్టీయూహెచ్ నిర్వహించే పీజీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎ. అరుణ కుమారి వ్యవహరిస్తున్నారు. వ్యాయామ విద్య కోర్సులు డీపెడ్, బీపెడ్‌ల్లో ప్రవేశాల కోసం జూన్ 11 నుంచి 14 వరకు పీఈసెట్ నిర్వహిస్తారు. పాలమూరు యూనివర్సిటీ నిర్వహించే పీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్ ఉన్నారు. పీఈసెట్ మినహా మిగతా ఎంట్రెన్సులన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి. పీఈసెట్‌లో శారీరక సామర్థ్య పరీక్షలు ఉంటాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షలు మార్చి, ఏప్రిల్‌లో ముగిసేలా బోర్డులు, యూనివర్సిటీలు ప్రణాళిక చేస్తున్నాయి.

# వచ్చేనెల స్థానిక ఎన్నికలు

>> వేణుగోపాల్ నివాసంలో తెలంగాణ ముఖ్య నేతల కీలక సమావేశం జరిగింది. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ తదితరులు హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు వీరు సమావేశమయ్యారు. మంత్రులందరితో వేణుగోపాల్ విడివిడిగా సమావేశమయ్యారు.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలపై వారు కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు. మంత్రివర్గ విస్తరణ సహా ఇతర అంశాలపై వారు చర్చించారని తెలుస్తోంది.ఫిబ్రవరిలో తెలంగాణలో రాహుల్ గాంధీ సభ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ సభ సూర్యాపేట లేదా ఖమ్మంలో ఉండే అవకాశం ఉందన్నారు. జనవరి చివరి నాటికి నామినేటెడ్, కార్పోరేషన్ చైర్మన్ల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. మంత్రి వర్గ విస్తరణపై సీఎం, పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పీసీసీ కార్యవర్గ కూర్పుపై చర్చించినట్లు చెప్పారు. ప్రజల్లో ఉండేవారికే డీసీసీ అధ్యక్ష పదవులు ఇస్తామని తెలిపారు.

**రాహుల్‌గాంధీని కలిసిన వైఎస్ షర్మిలారెడ్డి**

ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీతో ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి సమావేశమయ్యారు. ఏపీలో పార్టీ బలోపేతంపై ఆమె రాహుల్‌తో చర్చించారు.

# బిఆర్ఎస్ కాదు బి-ఆర్ఎస్ఎస్

>> జరిగిన ఏఐసీసీ హెడ్ క్వార్టర్ కార్యాలయం ప్రారంభోత్స వానికి హాజరైన ఆయన అక్కడి మీడియాతో మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ అడుగు జాడల్లో వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోం దని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌పై బీజేపీ ఏ ఆరోపణలు చేస్తే తెలంగాణలో కాంగ్రెస్ పై బీఆర్ఎస్ అవే ఆరోపణలు చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సి న అవసరం లేదన్నారు. 140 ఏళ్ల చరిత్ర కలిగి కాంగ్రెస్ పార్టీ సొంత కార్యాలయం నిర్మించుకునేందుకు ఇన్నేళ్లు పట్టిందని అంటూ అదే నిన్నగాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలు 40 ఏళ్ల సీనియార్టీ మాత్రమే ఉన్న బీజేపీ స్వల్పకాలంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. తమ పార్టీ ప్రజల కోసం ఎంత నిస్వార్ధంగా పని చేస్తుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవాలన్నారు. పార్టీ ఎలాంటి స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గొప్ప చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమంతో పాటు అభివృద్ధి కోసం పాటు పడిందని గుర్తు చేశారు. 140 ఏళ్లు దేశాన్ని నడిపిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని అన్నారు. నిన్నగాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నాయని అన్నారు. బీజేపీ ఆర్థిక స్థితి, నిన్న మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో.. కాంగ్రెస్ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో చూడండి అని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఇకపై ఈ కార్యాలయం నుంచి ప్రణాళికలు రచించబోతున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలందరికీ ఇక్కడి నుంచే దిశా నిర్దేశం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఇక్కడి నుంచే దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు, ప్రణాళికలు రచించబడతాయన్నారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా విధి విధానాలు రూపొందిస్తామని అన్నారు.

బుధవారం దేశ ప్రజలకు పండగ రోజు అని.. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని అన్నారు. దేశ ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందని అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అపాయింట్ మెంట్ కోరినట్లు చెప్పారు. అపాయింట్ మెంట్ ఖరారు కాగానే వారిని కలవనున్నట్లు చెప్పుకొచ్చారు. తెలంగాణకు సంబంధించిన విషయాలపై చర్చించనున్నామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇక తెలంగాణలో చట్టబద్ధమైన పాలన సాగుతున్నదన్నారు.



మకర సంక్రాంతి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ మేళాలో పుణ్యస్నానాలు చేసిన అఖాడా సాధువులు

# 'మహాకుంభ్'కు జన ప్రవాహం

>> ప్రభుత్వంప్రకటించింది. కాగా రెండోరోజు మ కరసంక్రాంతిరోజున కూడా 3.5 కోట్ల మందికిపైగా స్నానాలుచేస్తే బుధవారం త్రివేణి సంగమంలో సుమారుగా మూడు కోట్లమందికిపైగా స్నానాలు ఆచరించినట్లు యూపి ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం మకరసంక్రాంతి సందర్భంగా సాధువులతోపాటు భక్తులు తొలి అమృతస్నానంచేసారు. 13 అఖాడాలకు చెందిన సాధువులు ఒకరితర్వాత ఒకరుగా స్నానంచేసారు. మకర సంక్రాంతిరోజునే మూడు కోట్లమంది భక్తులు మూడు నదుల సంగమంలో పుణ్యస్నానాలుచేసారు. మొదటి స్నానం రోజున 1.65 కోట్లమంది రాగా మొత్తం రెండురోజుల్లో 5.15 కోట్లమంది భక్తులు పవిత్రస్నానాలుచేసినట్లు యూపి ప్రభుత్వంప్రకటించింది. భారీ ఏర్పాట్లుచేసిన యూపి ప్రభుత్వం అంచనాలకు మించి భక్తులు వస్తున్నారు. పదివేల ఎకరాల కుంభ్‌నగర్ మొత్తం ఇసుకవేస్తే రాలనంతగా నిండిపోయింది స్నానఘాట్‌లన్నీ క్రిక్కిరిసిపోయాయి. రెండోరోజు ఉదయం పది గంటలవరకే 1.38 కోట్లమంది స్నానాలుచేసారని చెపుతున్నారు.వేకువఝామున మూడు గంటలకు బ్రహ్మముహూర్తంలో అమృతస్నానాలు ప్రారంభం అయ్యాయి. శ్రీ పంచాయితీ అఖాడా మహానిర్వాణి, శ్రీశంభు పంచాయితీ అటల్ అఖాడా, నిరంజని అఖాడా, ఆనంద్ అఖాడా మకర సంక్రాంతివేళ తొలి అమృత స్నానం ఆచరించారు. మొత్తం 13 అఖాడాలు మహాకుంభమేళాకు వచ్చాయి. మకరసంక్రాంతి, వసంత పంచమి రోజున సనాతన ధర్మానికి చెందిన 13 అఖాడాలు అమృతస్నానంచేయాలని యుపి ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. దీనితో అఖాడాలు తమతమ బృందాలతోప్రదర్శనగా వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. పవిత్రస్నానాలు అత్యంత శాంతియుత వాతావరణంలో కొనసాగుతున్నాయని యుపి డిజిపి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈసారి భద్రతకోసం సిసిటివిలు, డ్రోన్లు, అండర్‌వాటర్‌డ్రోన్లుకూడా ఉపయోగించామన్నారు.

# జాతీయ పసుపు బోర్డు కార్యకలాపాలు మొదలు

>> ముఖ్యమైన వెరైటీ పంట పెద్ద మొత్తంలో సాగవుతుందని, అందుకే బోర్డు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త వంగడాలపై పరిశోధనలు, పసుపు పంటకు వాల్యూ ఎడిషన్ చేసి ఎగుమతులు చేస్తామని పేర్కొన్నారు. అలాగే పసుపు ఉపయోగాలపై కూడా ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. పంట దిగుబడి పెంచడం, సప్లయ్ చైన్, మౌలిక వసతులు పెంపొందించడం, ఔషధ గుణాల నేపథ్యంలో ఫార్మా రంగంలో దీన్ని ఉపయోగించడం సహా అనేక అంశాల్లో రైతులకు బోర్డు నుంచి మద్దతు లభిస్తుందని స్పష్టం చేశారు. అరవింద్, బండి సంజయ్ ఈ బోర్డు కోసం తీవ్రంగా ప్రయత్నం చేసి సాధించారని చెప్పారు.

కాగా మోడీ ఏదైనా చెప్పారంటే అది నెరవేరి తీరుతుందన్నారు. కాశ్మీర్‌లో టన్నెల్ అయినా, రైతులకు ఇచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలైనా, స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సహకాలైన ఏదైనా సరే. మాట ఇచ్చారంటే అమలు చేసి తీరుతారని కొనియాడారు. ప్రపంచంలోని 19 దేశాలు ప్రధాని మోడీని సర్వోన్నత పౌరపురస్కారాలతో సత్కరించాయి. ఇది మామూలు విషయం కాదన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 16-01-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
తదియ తె.4.07
ఆశ్లేష ఉ.11.16
వర్జ్యం : రా.12.00-1.42
దు.ఉ.10.33-11.18, 2)మ.3.02 - 3-47
శుభసమయం: ఉ.8.30-9.20,
మ.3.50-4.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం రెండు కలిసి రావు. అదృష్టాన్ని పెద్దగా నమ్మరు.

**వృషభం:** కష్టించి పనిచేసే తత్వాన్ని పెంచుకుంటారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు.

**మిథునం:** పట్టుదలతో శ్రమించి వృత్తి, వ్యాపారాల వరంగా స్వల్పమైన అభివృద్ధిని కనబరుస్తారు.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు.క్రయ విక్రయాలలో ప్రోత్సాహం వుంటుంది.

**సింహం:** ఆత్మవిమర్శ చేసుకుంటారు. ఆలోచనలలో మునిగిపోతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**కన్య :** ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. యాంత్రికంగా పనులను పూర్తి చేస్తారు.

**తుల :** ఒకప్పుడు ఉత్సాహంగా, ఒకప్పుడు నిరుత్సాహంగా ఉంటారు. ఇందుకు చెప్పుకోదగిన కారణాలుండవు.

**వృశ్చికం:** శుభకార్యాలు, శుభకార్య సంబంధిత ప్రసంగాలు ఫలవంతంగా సాగుతాయి. ప్రయాణాలు.

**ధనుస్సు:** సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. కొన్ని విషయాలలో నూతన నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** ఆరంభ శూరత్వంతో మీ సన్నిహిత వర్గం నూతన కార్య క్రమాలకు శ్రీకారం చుట్టడం మీకు కష్టము కలిగిస్తుంది.

**కుంభం:** సోదరులు, మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. వాహన సౌఖ్యం.

**మీనం :** మాటలు చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకొని పనులు పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



జస్టిస్ హరిహరినాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు

# నలుగురు కొత్త జడ్జిలు

>> కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు కొత్తగా వస్తున్న నలుగురు న్యాయమూర్తులలో జస్టిస్ వై.రేణుక యార, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమల దేవి అలియాస్ తిరుపతమ్మ, జస్టిస్ బొబ్బిలి రామయ్య మధుసూదన్‌రావు ఉన్నారు. ఏపీ హైకోర్టుకు కొత్తగా వస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ హరిహరినాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఉన్నారు.

## సిజెగా జస్టిస్ సుజయ్‌పాల్

>> ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు. 1964 జూన్ 21న జన్మించిన జస్టిస్ సుజయ్‌పాల్ బీకాం, ఎంఎ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించిన ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. జస్టిస్ సుజయ్‌పాల్ ఈనెల 16 లేదా 17న రాజ్‌భవన్‌లో సీజేగా బాధ్యతలు తీసుకోనున్నారు.

## ఫిబ్రవరి 23న సంక్షేమ గురుకుల ప్రవేశపరీక్ష

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరో తరగతి, 8వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష తేదీని డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ మేరకు ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఒ ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించి అన్ని గ్రామాలు, నియోజకవర్గాలు, పాఠశాలల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రవేశపరీక్ష వాల్ పేపర్‌ను ఆయన విడుదల చేశారు.

## దక్షిణ మధ్యరైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్‌గా కె.పద్మజ



**హైదరాబాద్ (తార్నాక), జనవరి 15 ప్రభాతవార్త** : దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ( పిసిఓఎం) గా కె. పద్మజ బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. పద్మజ ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1991 బ్యాచ్‌కు చెందిన వారు. వీరు బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకే షన్‌లో పట్టభద్రులు. పద్మజ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పి.సి.సి.ఎం)గా విధులను నిర్వర్తిస్తూ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ (పి.సి.ఓ.ఎం.)గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు.భారతీయ రైల్వేలో 30సంవత్సరాలకు పైగా విశిష్టమైన కెరీయర్‌లో కె.పద్మజ దక్షిణ మధ్య రైల్వేలో హైదరా బాద్ డివిజన్లో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్: అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ (కోల్,గూడ్స్), సికింద్రాబాద్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ సిఫ్టీ ఆఫీసర్, గుంతకల్లు డివి జన్‌లో డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్, పి.ఆర్.ఎస్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్‌లో పనిచేశారు. రైల్ నిలయం ప్రధాన కార్యాలయంలో వారు డిప్యూటీ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్, కోచింగ్, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, జనరల్, చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్: చీఫ్ ఫ్రైట్ ట్రాఫిక్ మేనేజర్,చీఫ్ కమర్షియల్ మేనేజర్, ప్యాసింజర్ సర్వీసెస్ వంటి అనేక ఇతర కీలకపదవులు నిర్వహించారు. తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థా నంలో, సలహాదారు (రవాణా)గోదావరి ఫెర్టిలైజర్స్ కంపెనీ లిమిటెడ్, జనరల్ మేనేజర్, కాంకర్, హైదరాబాద్ కూడాపనిచేశారు. అంతేకాకుండా వారు అద నంగా దక్షిణమధ్య రైల్వే భారత్ స్కాట్స్ గైడ్స్‌కు రాష్ట్ర కమిషనర్, కార్యదర్శి, హ్యాండ్బాల్, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసి యేషన్, ప్రెసిడెంట్: దక్షిణ మధ్య రైల్వే లలిత కళా సమితి, సికింద్రాబాద్ ప్రెసిడెంట్, దక్షిణ మధ్య రైల్వే ఆఫీసర్స్ అసోసి యేషన్ ప్రెసిడెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## రాచకొండ పోలీసులకు పట్టుబడ్డ అక్రమ ఆయుధాల వ్యాపారి

### రెండు తుపాకులు, ఒక తపంచా, పది బుల్లెట్లు స్వాధీనం

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** నగర శివార్లలో అక్రమంగా తుపాకులు, తపంచాలు విక్రయిస్తున్న ఉత్తరాది ముఠా గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా ముఠాలో ఒక వ్యక్తిని పట్టుకోగా అతని వద్ద నుంచి రెండు తుపాకులు, ఒక తపంచా, పది బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధిం చిన వివరాలను రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు బుధవారం మీడియాకు వెల్లడించారు. యుపిలోని రాంపూర్ గ్రామానికి చెందిన హారేకృష్ణ యాదవ్ (26) అనే వ్యక్తి కొంతకాలంగా శివార్లలోని బీబీనగర్‌లో వుంటూ చిన్నా చితక పనులు చేస్తున్నాడు, 2022లో ఇతను కొం తకాలం ఇక్కడ పనిచేసి తిరిగి తన సొంత ఊరుకు వెళ్లిపోయాడు. తన ఊరిలో వ్యవసాయం తప్ప మరే పని లేకపోవడం, ఇందులో పెద్దగా లాభాలు లేకపోవడంతో ఇతను పక్కదారిపట్టాడు. ఇతని ఊరు బిహార్ రా ష్ట్రానికి సరిహద్దులో వుండడంతో అక్కడ బిహార్‌లోని భోజ్‌పూర్ జిల్లా షపూర్ గ్రామానికి చెందిన సంపత్ యాదవ్ అనే వ్యక్తి నుంచి రెండు తుపాకులు, ఒక తపంచా, పది బుల్లెట్లను కొన్నాడు, తక్కువ ధరకు వీటినికొన్న హారేకృష్ణ యాదవ్ ఆయుధాలను భద్రంగా హైదరాబాద్‌కు తరలించి జవహర్‌నగర్‌లో తానుంటున్న ఇంట్లో దాచా డు. ఈ ఆయుధాలను హైదరాబాద్‌లో తనకు తెలిసిన వ్యక్తులకు మంచి ధరకు అమ్మేందుకు హారేకృష్ణ ప్రయత్నించసాగాడు. ఈ క్రమంలో బుధవారం నాడు స్థానిక అం బేద్కర్ నగర్ బస్టాప్ వద్ద హారేకృష్ణ యాదవ్ ఆయుధాలతో వెళుతుండగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటి పోలీసులతో పాటు జవహర్ న గర్ పోలీసులు దాడిచేసి అతన్ని పట్టుకున్నారు. అనంతరం అతన్ని సోదా చేయగా రెండు తుపాకులు, ఒక తపంచా, పది బుల్లెట్లు ఒక సంచిలో వుండగా వాటిని జప్తు చేశారు. నిందితుడి వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను కూడా జప్తు చేశారు. కాగా ఇతనికి ఆయుధాలను విక్రయించిన బిహార్‌కు చెందిన సంపత్ యాదవ్ గురించి గాలించసాగారు. ఇదే సమయంలో హారేకృష్ణ యాదవ్ నుంచి ఆయుధాలను కొనేందుకు ప్రయత్నించిన వ్యక్తుల వివరాలను ఆరా తీస్తున్నట్లు పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఆయుధాలను కొనివుంటే వారిని కూడా అరెస్టు చేస్తామని, ఆయుధాలు కొనేందుకు యత్నించిన వారిపైనా కేసులు నమోదు చేసి విచారిస్తామని ఆయ న తెలిపారు.

హారేకృష్ణ యాదవ్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు రాచకొండ పోలీసులు నిర్ణయించారు. ఇతను ఎంతకాలంగా ఆయుధాలు విక్రయిస్తున్నాడు? ఇతనికి హైదరాబాద్‌లో పరిచయం వున్న వారు ఎవరు? తదితర వివరాలను కస్టడీ విచారణలో వెలుగు చూసే వీలుంది. కాగా హారేకృష్ణ యాదవ్‌ను అరెస్టు చేసిన ఎస్ఓటి పోలీసులను కమిషనర్ సుధీర్ బాబు అభి నందించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డిసిపి పద్మజతో పాటు ఎస్ఓటి డిసిపి రమణా రెడ్డి, అదనపు డిసిపి సంధ్యాల నరసింహారెడ్డి, ఎసిపి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




రాచకొండ పోలీసులు పట్టుకున్న వ్యక్తి నుంచి జప్తు చేసిన తుపాకులు, తపంచా, బుల్లెట్లను మీడియాకు చూపుతున్న కొత్వాల్ సుధీర్ బాబు

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మాసబ్‌ట్యాంక్ పోలీసుల నోటీసులు

### విచారణకు శుక్రవారం వస్తానన్న కౌశిక్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి 15:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని కౌశిక్ రెడ్డిని ఆదేశించారు. అయితే గురువారం కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, అందువల్ల శుక్రవారం విచారణకు హాజరవుతానని కౌశిక్ రెడ్డి తెలిపారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కౌశిక్ రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. గతనెల 4న తన ఫోన్ ట్యాప్ అవుతుందని కౌషిక్‌రెడ్డి బంజారాహిల్స్ పీఎస్‌కి వచ్చారు. అదే సమయంలో బయటకు వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ వాహనానికి తన వాహనాన్ని అడ్డు పెట్టి అనుచరులతో కలిసి పీఎస్‌లో హల్‌చల్ చేశారు. తన విధులు అడ్డుకోవడమే కాకుండా బెదిరింపులకు దిగిన వ్యవహారంపై ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదుపై అదే పీఎస్‌లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అధికారిగా మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాంను వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ నియమించారు. ఇందులో భాగంగా మాసబ్ ట్యాంక్ పోలీసులు కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీచేశారు.తనపై అన్యాయంగా కేసులు పెడితే ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రశ్నిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ శిక్షణ ఇచ్చిన బిడ్డను ఏ మాత్రం భయపడను అని స్పష్టం చేశారు. తాను తప్పు చేసినట్లు రుజువైతే ఉరితీయండని సవాల్ విసిరారు. తన అరెస్టు, కరీంనగర్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజాగా బుధవారం తనకు మళ్ళీ పోలీసులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే, ఈ నెల 16 హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావాలంటూ నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. కాగా, కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో రైతు భరోసా, రుణమాఫీ గురించి ప్రశ్నిస్తే ఎమ్మెల్యే సంజయ్ దాడి చేశారని ఆరోపించారు. ఆ రోజు మంత్రి శ్రీధర్‌బాబు కూడా వేలు ఎత్తి చూపుతూ బెదిరించారంటూ వీడియో ప్రదర్శించారు. బీఆర్ఎస్ బీఫారంపై గెలిచిన సంజయ్‌ను ప్రశ్నిస్తే నాపై కేసులు పెడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై చీటింగ్, హత్య కేసులు లేవని.అదే రేవంత్ రెడ్డిపై 82 పైగా కేసులు ఉన్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డిపై మొదటి కేసే చీటింగ్ కేసు అని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

### కౌశిక్‌రెడ్డి తీరు మార్చు కోవాలి: మహేశ్‌కుమార్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి15:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరుపై టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి తోటి ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదని కేవలం కెసిఆర్, కెటిఆర్ మెప్పు కోసం ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు క్రమశిక్షణతో మెలగాలని అప్పుడే ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తారని ఆయన హితవు పలికారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కెసిఆర్, కెటిఆర్ అదుపుచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులకు క్రమశిక్షణ అవసరమని, ఇకనైనా కౌశిక్‌రెడ్డి తన తీరు మార్చుకోవాలన్నారు. ఈ రకమైన ప్రవర్తనతో రాజకీయంగా ఎదుగుతామనుకోవడం అవివేకమేనన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రవర్తన ఎవరూ చేసిన ఉపేక్షించవద్దన్నారు. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి ఇప్పటికైనా ఆయన ప్రవర్తన మార్చుకోవాలని పిసిసి అధ్యక్షుడు వార్నింగ్ ఇచ్చారు. పల్లెల్లో ఎంతో వైభవంగా జరుపుకునే సంక్రాంతి వేడుకలు ఇలా హైదరాబాద్‌లో జరుపుకోవడం చాలా సంతోషంగాఉందన్నారు. మన తెలుగు పండుగలను రాబోయే తరాలకు అందించాలంటేఇలాంటి కార్యక్రమాలునిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహా కుంభమేళాలో విషాదం

## మంటల్లో కాలిపోయిన తెలంగాణ యాత్రికుల బస్సు

### నిర్మల్ జిల్లాకు చెందిన వ్యక్తి సజీవ దహనం, 50 మందికి గాయాలు



యుపిలోని మధుర వద్ద మంటలకు కాలిపోతున్న తెలంగాణకు చెందిన యాత్రికుల బస్సు

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** యుపిలోని ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళకు వెళ్లిన తెలంగాణకు చెందిన యాత్రికుల బస్సు మంటలకు ఆ హుతయ్యింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో నిర్మల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి సజీవ దహనం కాగా 50 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు ఇలావున్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన కొందరు యాత్రికులు ఒక టూరిస్టు బస్సులో కుంభమేళకు వెళ్లారు. కుంభమేళలో మంగళవారం ఉదయం పవిత్ర సాన్నాలు ఆ చరించి తిరుగు ప్రయాణంలో మధుర వద్ద బస్సును ఆపి సమీపంలో గల దేవాలయానికి వెళ్లారు. అనంతరం అందరు బస్సులో తిరుగు ప్రయాణం కోసం బస్సు వద్దకు రాగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బస్సువద్ద వున్న ప్రయాణీకులు భయంతో పరుగులు తీశారు. ఈ క్రమంలో 50 మంది స్వల్పంగా గాయపడ్డారు. అయితే అప్పటికే బస్సులో వున్న ధృపత్ అనే 60 ఏళ్ల వ్యక్తి సజీవ దహనం అయ్యాడు. అతను బస్సులో సిగరెట్ కాలుస్తున్న సమయంలో మంటలు చెలరేగి వుండ వచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా మంటలకు బస్సు ఆహుతి అవ్వడంతో ప్రయాణీకుల లగేజ్ అంతా కాలి బూడిదయ్యింది. కాగా ఈ ప్రమాదం నిర్మల్ జి ల్లాలో కలకలం రేపింది. తమ వారి కోసం స్థానికులు ఆరా తీశారు. దీనిపై ముథోల్ ఎంఎల్‌ఏ రామారావు పటేల్ స్పందించి మధుర జిల్లా పోలీసులతో మాట్లాడి ని ర్మల్ యాత్రికుల క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ వారి కి వెంటనే చికిత్స అందించాలని, వారిని క్షేమంగా నిర్మల్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. బస్సులో సజీవ దహనం అయిన వ్యక్తి మృతదేహాన్ని నిర్మల్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంఎల్‌ఏ కోరారు. బస్సులో వస్తువులు కాలిపోవడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డ వారిని ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పాత్ర మరువలేం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి15:** తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పోషించిన పాత్ర ప్రజ లెప్పుడూ మరిచి పోరని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రజల మనోభావాలని కేంద్రం ముందు వివరించి సఫలీకృతుడైన నాయకుడు జైపాల్‌రెడ్డి అని పేర్కొ న్నారు. తెలంగాణ సాధన కోసం నిశ్శబ్ద సైనికుడిలా జైపాల్ రెడ్డి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసి అతికీలక పాత్ర పోషించిన మట్టి బిడ్డ అని కొని యాడారు. తెలంగాణ పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎది గిన జైపాల్ రెడ్డి దేశంలో అరుదైన రాజకీయ వేత్త అని కొనియాడారు. రాజకీయాల్లో నిష్కళంక నేత గా, విలువలకు ప్రతీకగా జైపాల్ రెడ్డి నిలిచారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శాసనసభ్యుడిగా లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, విపక్ష నేతగా, కేంద్ర మంత్రిగా నిర్వ హించిన అనేక పదవులకు జైపాల్ రెడ్డి వన్నె తెచ్చారని అన్నారు.యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమం ప్రోగ్రామ్ రూపొందించడం ద్వారా దేశ ప్రాధాన్యాలను గుర్తించిన నాయకుడని శ్లాఘిం చారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆ ప్రాంతానికి నీరివ్వాలని మొట్టమొదట తలచిన నాయకుడు జైపాల్‌రెడ్డి అని గుర్తుచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడానికి జైపాల్ రెడ్డే పునాదులు వేశారని అన్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఆయన పేరు ఖరారు చేస్తూ ఇటీవల మంత్రిమండలి తీర్మానించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్ మెట్రో రైలు మంజూరైందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విశిష్ట విలువలతో జీవితాంతం ప్రజాసేవకే అంకితమైన జైపాల్ రెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ఈ తరుణంలో ఆశయాలు, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడంలో ప్రతి ఒక్కరు పాటుపడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## తిరుమలేశునికి పునఃప్రారంభమైన 'సుప్రభాతసేవ'

### 20నుండి సేవకు గృహస్థులకు అనుమతి

**తిరుమల,జనవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ పున:ప్రారంభమైంది. ధనుర్మాసఘడియలు పూర్తికావడంతో బుధవారం వేకువజామున నుండి తిరిగి శ్రీవారి ఆలయంలో ఆఅయ అర్చకులు, వేదపండితులు "కౌసల్యా సుప్రజా రామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామం వినిపించి స్వామివారిని మేల్కొలిపారు. ఏడుకొండలస్వామికి వైఖానస ఆగమోక్తంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు నిద్రనుండి సుప్రభాతసేవతోనే మేల్కొలుపుతారు. 15వతేదీ కనుమ పర్వదినం ఆరంభాన ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే కీర్తన విని పించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవను గృహస్థ భక్తులను అనుమతినిస్తారు. 19వతేదీ వరకు ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు అమలవుతుండటంతో 20వతేదీ నుండి గృహస్థభక్తుల నడుమ ఆర్జితసేవ పునరుద్ధరిస్తారు.ప్రతిరోజూ తిరుమలలో సుప్రభాతసేవలో 200మందివరకు భక్తులు పాల్గొంటారు.

## నాన్ వెజ్‌కు భారీ డిమాండ్

### తెల్లవారు నుంచే జనం క్యూలైన్లు

### నాటు కోడి కిలో రూ.900

### మటన్ రూ.950


**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సంక్రాంతి పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పండగలో తొలి రోజు భోగి, రెండో రోజు మకర సంక్రాంతి సెలబ్రేట్ చేసుకున్న ప్రజలు. మూడో రోజైన బుధవారం కనుమ పండగ జరుపుకున్నారు. తొలి రెండ్రోజులు చాలా ప్రాంతాల్లో ప్రజలు నాన్‌వెజ్‌కు దూరంగా ఉండగా, కనుమ రోజు మాత్రం మాసం ఆరగిస్తారు. దీంతో చికెన్, మటన్, చేపలకు భారీగా డిమాండ్ ఏర్పడడంతో దుకాణాల వద్ద రద్దీ విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో వ్యాపారులు వాటి ధరలను పెద్ద ఎత్తున పెంచేశారు. తెల్లవారుజాము నుంచే చికెన్, మటన్ షాపుల వద్ద నాన్ వెజ్ కోసం ప్రజలు బారులు తీరారు. దీంతో నాన్‌వెజ్ దుకాణాలు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. చికెన్, మటన్ షాపులతోపాటు ఫిష్ మార్కెట్స్‌కు ప్రజలు పోటెత్తుతున్నారు. సంక్రాంతికి నాటు కోళ్లు తినే సంప్రదాయం ఉండటంతో వాటికి డిమాండ్ పెరగింది. బాయిలర్ కోళ్ల కూడా భారీగా డిమాండ్ పెరిగింది. కేజీ నాటు కోడి చికెన్ మార్కెట్‌లో 900 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అయినా ప్రజలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొనుగోలు చేస్తున్నారు. లైవ్ నాటు కోళ్లను కేజీ 500 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. బాయిలర్ కోళ్ల మాంసాన్ని డిమాండ్‌ను బట్టి కేజీ 350 రూపాయల నుంచి 400 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా మాంసాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇక మటన్‌కు కూడా విపరీతమైన డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ వంటి నగరాల్లో కేజీ మటన్ 850 రూపాయలకు విక్రయిస్తుండగా, పల్లెల్లో డిమాండ్‌ను బట్టి 900 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఇదే సమయంలో చేపల ధరలు కూడా వ్యాపారులు భారీగా పెంచారు. మార్కెట్‌లో కేజీ 150 రూపాయలకు దొరికే చేపలను ప్రస్తుతం కేజీ 300 రూపాయల వరకు అమ్ముతున్నారు. కొందరు ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనపరచగా, సామాన్యులు మాత్రం మాంసం ధరలు మండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వైన్ షాపుల ముందు కూడా మద్యం ప్రియులు బారులు తీరుతున్నారు.ఉదయం 10 గంటల కు దుకాణాలు తెరుస్తారని తెలిసి ముందుగానే అక్కడకు చేరు కుంటు న్నారు. దీంతో మద్యం షాపుల వద్ద కూడా రద్దీ కనిపి స్తోంది. ఈఒక్క రోజే భారీగా ఆదా యం వస్తుందనిమద్యం షాపుల యజమానులుఆశాభావంవ్యక్తం చేస్తున్నారు.

### పర్యావరణ పరిరక్షణలో భారత్ ఇటలీ సహకారం మరింత బలోపేతం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 15 ప్రభాతవార్త:** పర్యావరణ పరిక్షణలో భారత్ అన్ని రకాల చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫ్యూచర్ మినరల్స్ ఫోరమ్-2025 మినిస్టీరియల్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటలీకి చెందిన పర్యావరణ మరియు ఇంధన భద్రత మంత్రి గిల్బర్టో పిచెట్టో ఫ్రాటిన్‌తో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థిరమైన మైనింగ్ పద్ధతులు పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలలో భారతదేశం ఇటలీ సహకారాన్ని బలోపేతం చేయడం గురించి చర్చించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా చెప్పుకొచ్చారు.

## సంక్రాంతిన భక్తులతో కలసి చైర్మన్ నాయుడు అన్నప్రసాదం స్వీకరణ

**తిరుమల,జనవరి 15ప్రభాతవార్తప్రతి నిధి:** సంక్రాంతి పర్వదినరోజు మంగళవారం తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సామాన్య భక్తులతో కలసి అన్నప్రసాద భవ నంలో అన్నప్రసాదం స్వీకరించారు. ఆయన



స్వయంగా అక్కడ ఉన్న భక్తులను పలకరించి భోజనం నాణ్యత, సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన కూడా భక్తులతో కలసి అన్నప్రసాదాలు స్వీకరించడం విశేషం.

## కనుమపర్వదినాన ఘనంగా గోపూజ

**తిరుమల, జనవరి 15ప్రభాతవార్త ప్రతి నిధి:** హిందూ వేదాలు, పురాణాల్లో పేర్కొన్న విధంగా సకల దేవదాస్వరూ పాలైన గోవులను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని టిటిడి బోర్డు సభ్యుడు జి.భాను ప్రకాష్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గోవులను రక్షించు కుందాం... సంస్కృతిని కాపాడు కుందాం అంటూ మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆయన కోరారు. కనుమపండుగ సందర్భంగా బుధవారం ఎస్వీగోశాలలో వేడుకగా గోపూజలు నిర్వహించారు. ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా గోమాతలకు పూజలు చేసి, అలంకరించి, పండ్లు, దాణా తినిపించారు. గోవును పూజించడం వల్లపాడిపంటలు పుష్కలంగా పండి లోకం సుభిక్షంగా ఉంటుందన్నారు.

## కనుమ రోజున అడవిలో వేటాడిన వెంకన్న

### వేడుకగా పార్వేట ఉత్సవం



**తిరుమల, జనవరి 15 ప్రభాతవార్త ప్రతి నిధి:** సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమపండుగనాడు సాంప్ర దాయాలను పాటిస్తూ దేవదేవుడు శ్రీవేంకటేశ్వంస్వామి అడవిలో వేటాడటం ఆనవాయితీ. బుధవారం మధ్యా హ్నం నిత్యకైంకర్యాలు ముగించుకున్న తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారు. శ్రీకృష్ణస్వామి వేర్వేరు పల్లకీలపై ఛత్రచామర మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పార్వేటమండపం వేంచేపుచేశారు. ఇక్కడ ఆలయ అర్చకులు, అధికారులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆస్థానం చేపట్టారు. వైకుంఠం నుండి భూలోకానికి వచ్చిన శ్రీనివాసుడుకనుమపండుగ రోజు వేటాడటం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని టిటిడి అధికారులు పాటిస్తూ బుధవారం పార్వేటమండపం అటవీప్రాంతంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన అడవిజంతువుల ప్రతిమలను ఈటెలతో వేటాడినట్లు అర్చకులు మూడుసార్లు ముందుకు వెళ్లి వెనక్కువచ్చి బాణాలు వేశారు. దీంతో పార్వేట ఉత్సవం ముగిసింది. అక్కడ నుండి సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయంలోనికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ముఖ్య అర్చకులు కిరణ్‌దీక్షితులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు బాలసుబ్ర మణ్యం, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పెరుగుతున్న గన్ కల్చర్

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** తెలంగాణలో అక్రమ ఆయుధాల వాడకం, కొనుగోలు పెరిగిపోతోంది. రాచకొండ పరిధిలోని జవహర్ నగర్‌లో యుపికి చెం దిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు తుపాకులు, మూడు తపంచాలు, పది బుల్లెట్లను జప్తు చేయడం సంచలనం రేపింది. ఇతను తొలిసారిగా తెలంగాణ పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తున్నా ఇతనిపై వేరే రాష్ట్రాలలో అక్రమ ఆయుధాల కేసులు వుండివుండవచ్చని వార్తలు వస్తున్నాయి. ఇదేసమయంలో ఇతను ఇప్పటికే కొందరికి అక్రమ ఆయుధాలు విక్రయించినట్లు వార్తలు వినవస్తుండడంతో దీనిపై పోలీసులు ఆరా తీయసాగారు. ఈ యువకుడి విషయం అలా వుంచితే ఇంతకు ముందు కూడా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధుల్లో పలువురు అక్రమ ఆయుధాలతో పట్టుబడిన ఉదంతాలున్నాయి. మరోవైపు అక్రమ ఆ యుధాలు కలిగిన వ్యక్తులు తమ ప్రత్యర్థులపై దాడులకు వీటిని వాడుతుండగా నేరగాళ్లు దోపిడి, లూటీలకు ఉపయోగిస్తున్నారు

ఉమ్మడి ఎపి హయాంలో అక్రమ తుపాకుల హల్‌చల్ వున్నా తెలంగాణలో వీటి వాడకం పెద్దగా వుండేది కాదు. రాయలసీమ, కోస్తా ఆంధ్రలో వీటి వినియోగం ఎ క్కువగా వుండగా తెలంగాణలో కొన్నిచోట్ల మాత్రమే వుండేది. 20 ఏళ్ల క్రితం నక్సల్స్ ప్రభావితం గల ప్రాంతాలలో కొందరు నాయకుల వద్ద పనిచేసే అనుచరులతో పాటు పోలీసు ఇన్‌ఫార్మర్ల వద్ద అక్రమ తుపాకులు వుండేవి. బాబరీ మసీదు విధ్వంసం తరువాత ఐఎస్ఐ మిలిటెంట్లు తెలంగాణలో కొన్నిచోట్ల పాగా వేసిన సమయం లో వారి వద్ద పలుమార్లు అక్రమ తుపాకులు పట్టుబడ్డాయి. ఈ క్రమంలోనే ఉత్తరప్రదేశ్, బిహార్, నేపాల్ నుంచి హైదరాబాద్‌కు అప్పట్లో ఏకంగా స్టెన్ గన్‌లు, చిన్నపాటి పిస్తోళ్ల వరకు అమ్మకాలు జరిగేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక అక్రమ తుపాకుల వ్యవహారం చాలావరకు తగ్గిందని పోలీసు గణాంకాలు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో వెలుగు చూస్తున్న అక్రమ ఆయుధాల వాడకం ఇందుకు విరుద్ధంగా వుండడం గమనార్హం. అయితే కొన్నేళ్లుగా రాష్ట్రంలో




భూముల విలువలు కోట్ల రూపాయ లకు పెరగడంతో అక్రమ తుపాకుల వాడకం పెరగసాగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తుపాకుల కోసం లైసెన్స్ పొందేందుకు వేలాది మంది దరఖాస్తు చేసుకు న్నా ఇందులో 90 శాతానికి పైగా దరఖాస్తులను పోలీసులు తిరస్కరించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు వున్నప్పటికీ పోలీసులు వీటిని తిరస్కరించడం గమనార్హం. స రిగ్గా ఇదే సమయంలోనే ఉత్తరాది రాష్ట్రాల నుంచి అక్రమ తుపాకులు రాష్ట్రంలో రాసాగాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో వున్న వారిలో అనేక మంది అక్రమ తుపాకులు కలిగివున్నట్లు పోలీసులకు సమాచారం వుంది. కొన్నిచోట్ల దీనిపై పోలీసులకు సమాచారం వున్నా అవి ఎవరి వద్ద వున్నాయనే తెలియడం లేదనే వాదన వు ంది. ప్రతి చిన్న విషయానికి తుపాకులు వాడడం అనేది ఇప్పుడు ఫ్యాషన్‌గానూ స్టేటస్ సింబల్‌గానూ మారడంతో ఆయా ప్రాంతాలలో చోటు చేసుకుంటున్న కాల్పుల ఘటనలు సంచలనం రేపుతున్నాయి. 2022 జనవరి నెలలో సిద్దిపేట పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కారులో 44 లక్షల రూపాయల నగదుతో కారులో వచ్చిన వ్యక్తిపై బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులు రెప్పపాటులో కాల్పులు జరిపి మొత్తం నగదును దోచుకున్నారు. ఈ ఘటనలో కారు డ్రైవర్ గాయపడ్డాడు. ఈ కాల్పులకు బరితెగించిన వారు నలుగురుగా తేలగా అందరిని సిద్దిపేట పోలీసులు పది రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన తరువాత రంగారెడ్డి జిల్లా కర్ణంగూడ వద్ద మట్టారెడ్డి అలియాస్ అశోక్ రెడ్డి అనే రియల్టర్ తన ప్రతర్థులుగా వున్న మరో ఇద్దరు రియల్టర్లు శ్రీనివాస్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డిలను అక్రమ తుపాకుల చేత కాల్చి చంపారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కేసులలో నిందితులందరిని వారం రోజుల వ్యవధిలోనే అరెస్టు చేయడంతో పాటు అక్రమ తుపాకులను స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనలో పోలీసుల వ్యవహారశైలి సవ్యంగా లేదనే ఆరోపణలు వచ్చాయి. సిద్దిపేట, రంగారెడ్డి జిల్లాలలో జరిగిన కాల్పులకు వాడిన తుపాకులు, తూ టాలు ఉత్తరప్రదేశ్‌లో ఖరీదు చేసినట్లు తేలింది. ఈ రెండు ఘటనల తరువాత సంగారెడ్డి జిల్లాలో వంశీ అనే యువకుడిపై మరో యువకుడు తుపాకితో కాల్పులు జరిపాడు. ఈ ఘటనకు కూడా రియల్ ఎస్టేట్ వివాదంగా తేలింది. దీని తరువాత నాగో ల్‌లో ఒక నగల దుకాణం పై సాయంత్రం వేళ ఇద్దరు దుం డగులు దాడిచేసి తుపాకులతో కాల్పులు జరిపి బంగారంతో పాటు నగదును దోచుకున్నారు.

ఈ కాల్పుల్లో ఇద్దరు గాయ పడగా నిందితు లను పోలీసులు వారం రోజుల్లోనే అరెస్టు చేశారు. ఈ ఘటనలకు భిన్నంగా పాతబస్తీలో పలుమార్లు బారత్‌లలో లైసెన్స్ తుపాకులతో గాలిలో కాల్పులు జరపడం, లే దా బహిరంగంగా ప్రదర్శించడం జరిగాయి. ఈ తరహా ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసినా ఇటువంటివి ఆగడం లేదు. ఇక తాజాగా రాచకొండ పోలీసులు యుపికి చెందిన హారేకృష్ణ యాదవ్ అనే యువకుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు తుపాకులు, మూడు తపంచాలు, పది బుల్లెట్లను జప్తు చేశారు. కాగా తెల ంగాణలో వరుసగా చోటుచేసుకుంటున్న గన్ కల్చర్ ఘటనలు మరింత ముదరక ముందే కఠినంగా వ్యవహరించాలని విశ్రాంత పోలీసు అధి కారులు అంటున్నారు. ఈ విషయంలో ఏమాత్రం ఉదాసీనంగా వున్నా ఇవి మరింత ప్రమాదకరంగా మారే వీలుందని వారంటున్నారు.

## శ్రీవారికి చేరిన గోదా మాలలు

**తిరుమల,జనవరి 15ప్రభాత వార్తప్రతినిధి:** ధనుర్మాసం ముగింపు తరువాత బుధ వారం ఉదయం తిరుమ లలో జరిగిన గోదాదేవి పరిణయోత్సవంకు గోవిం దునికి మహా భక్తు రాలైన గోదాదేవి ధరించిన మాల లను ఏడుకొండల వేంకటే శ్వరస్వామి మూల విరాట్టు కు అలంకరించారు. తిరు పతి గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ గోదాదేవి చెంతనుండి దేవునికి ప్రత్యేకంగా మాలలు అందాయి. ఈ గోదాదేవి మాలలు తిరుపతి నుండి తిరుమల పెద్దజీయంగారి మఠంకు తీసుకువచ్చి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయంలోనికి చేర్చారు.

అక్కడ స్వామివారి మూలవిరాట్టుకు అలంకరింపజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ,గోవిందరాజస్వామి ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, తిరుమల ఆలయ పేష్కార్‌రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

నిది కాదని తెలిసిన దాన్ని కూడా నిదనుకోవడం నిజంగా నేరం.

-ఠాగూర్

# బాలికా విద్యపై నో-డిటెన్షన్ ప్రభావం!

**ప్రభుత్వ పాఠశాలపై ఆధారపడి చదువుకొనే గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు బహుభాషా సమస్యలు, విద్య పట్ల సరైన అవగాహన లేకపోవడం, ఆడపిల్లల పట్ల వారికున్న ఆచార సంప్రదాయాలు, చిన్నతనంలోనే వివాహాలు, ఎదిగిన పిల్లలను బడికి పంపించడానికి తలిదండ్రులకు సుముఖత లేకపోవడం ఇవన్నీ వెరసి బాలికల విద్యకు డిటెన్షన్ ఒక అడ్డుకట్టాలా ఎర్పడే అవకాశం ఉంటుందేమో అనిపిస్తుంది. దీనికితోడు మరొకవైపు చిన్నపిల్లలను తమకుటుంబ ఆర్థిక పరిస్థితులకు చేదోడుగా వారిని పనుల్లో పెట్టడం తద్వారా బాల కార్మికులుగా మార్చడం, చదువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు, ఆడపిల్లలకు ఒక శాపంగా పరిణమించే పరిస్థితులకు దారితీస్తాయి.**



మల్లాడి శ్రీనగేష్

విద్యా హక్కు చట్టం ద్వారా ఉచిత నిర్బంధ విద్యా ప్రణాళికలు అమలుకు 2010వ సంవత్సరంలో శ్రీకారంచుట్టి బడికి దూరంగా వున్న పిల్లలను బడికి చేర్చాలని విద్యకు నోచుకోని బడుగు బలహీన వర్గాలకు చెందిన బాలలకు బంగారు భవిష్యత్తును అందించాలనే సంకల్పంతో ఏర్పరచిన విద్యాహక్కు చట్టం ప్రశ్నార్థకమై నిలుస్తోంది. బడి మానేసిన పిల్లలను వయసు ఆధారిత తరగతిలో నమోదు చెసి వారికి ప్రత్యేకశ్రద్ధతో వారికి వయసు, తరగతి వారీ సామర్థ్యాలను సమకూరెలా తయారు చెసి నాణ్యమైన విద్యతో ప్రయోజకులుగా తర్చిదిద్దాలనే ప్రయత్నంలో సఫలం కాలెదు సరికదా మరలా వెలుగులోనికి వచ్చిన డిటెన్షన్ విధానం పిల్లలను మరలా బడికి దూరం దూరం చేస్తుందా అనే ప్రశ్న అందరిలో తలెత్తుతుంది. ఎందుకనగా నో డిటెన్షన్ విధానానికి స్వస్తిపలికి విద్యార్థిని 5వ తరగతిలో, 8వతరగతిలో పరీక్షల ఫలితాల ఆధారంగా పై తరగతి ఉత్తీర్ణతసాధించేలా కేంద్రప్రభుత్వం నో డిటెన్షన్ విధానానికి ముగింపుగా ఓ గజిట్ విడుదల చెసిన సంగతి అందరికీ తెలిసింది. ఈ విషయంలో రాష్ట్రాలదే తుది నిర్ణయమే అయినప్పటికీ వాటి పరిణామాలు విద్యార్థుల పట్ల వివక్షదిశగా పరిణమించే పరిస్థితులు ప్రస్ఫూటంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డిటెన్షన్ వలన ఒకవేళ తరగతిలో పలు మార్లు ప్రయత్నించి, ఫలించక నిరాశతో బడిబాటను వదిలేస్తే ఇప్పటికే వివక్ష వలయంలో విలవిల్లాడుతున్న బాలికల విద్య మరింత జఠిలం, ఎక్కువ శాతం బాలికలు బడికి దూరమయ్యేపరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. సమాజంలో ఆడపిల్లల చదువుపట్ల ఇప్పటికీ వివక్ష చూపించడం, ఉన్నత చదువులకు ప్రోత్సహించక పోవడం గమనార్హం. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో బడి మానేస్తున్న బాలికల శాతం 2020-21 సంవత్సరంతో 0.69 కాగా, 2021-22 లో 1.35శాతంగా నమోదైంది. ఈ పరిస్థితి గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో మరీ ఎక్కువ. ఎందుకనగా లెక్కలకన్నా వాస్తవాలు చాలా భిన్నంగా ఉంటాయి. ఈ ప్రాథమికవిద్యా ప్రభావం ఉన్నత విద్యపైన ,డ్రాప్‌అవుట్ శాతం పైన మరింత ప్రభావాన్ని చూపిస్తుందనేది వాస్తవం. ఉన్నత విద్యలో డైస్ గణాంకాల ప్రకారం సుమారు. 14.7 శాతం మంది విద్యార్థులు సెకండరీ స్థాయిలో బడి మానేస్తుండగా, బాలికలు సుమారు 13.7శాతం మంది చదువుకు దూరం అవుతున్నారని మానవ అభివృద్ధి నివేదిక 2020-21 తెలియజేసింది. ఇప్పటికీ గ్రామీణ స్థాయిలో బడి మానేస్తున్న విద్యార్థుల శాతం 2020-21 సంవత్సరంలో 37 శాతంగా నమోదైంది, అసర్ 2023 నివేదిక ప్రకారం బాలికల విద్యా విషయానికొస్తే సుమారు 16.80 శాతం మంది బడికి దూరం అవుతున్నారు అంటే విద్యాహక్కు చట్టం 2009 ప్రధాన భూమికకే తూట్లు పడ్డాయనేది వాస్తవం. ఈ పరిస్థితిలో మరలా వెలుగులోకి వచ్చిన డిటెన్షన్ విధానం గజెట్ ప్రభుత్వపాఠశాలపై ఆధారపడి చదువుకొనే హరిజన, గిరిజన వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకించి బాలికా విద్యకు విఘాతం కలిగిస్తుందనేది నిపుణుల అభిప్రాయం, వాస్తవం కూడా. డిటెన్షన్ విధానాన్ని బలపరిచే నిర్ణయం ఏమాత్రం ఆకస్మిక నిర్ణయం కాదు. ఈ నిర్ణయంపై 2015 లో కేంద్ర కమిటీ ఆయా రాష్ట్రాలతో చర్చించి విద్యాహక్కుచట్టానికి ఏ మాత్రం నష్టం వాటిల్లకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించింది. అయితే ప్రస్తుత పరిస్థితి, నూతన విద్యావిధానంలో ప్రధానంశంగా పొందుపరచిన పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక దశలోనే గట్టి పునాది వంటి అంశాలను పరిగణలోనికి తసుకొని డిటెన్షన్ విధానం వచ్చినా పిల్లలు అనుకున్న ఫలితాలతో ముందుంటూరనే భావనతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చి ఉండవచ్చు. కానీ చేసిన ప్రణాళికలను ఆయా రాష్ట్రాల్లో అమలు




తీరును అంచనా వేయకుండా డిటెన్షన్ నిర్ణయం తీసుకుంటే ఇది విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదంవుంది,పాఠశాలల్లో డ్రాప్ అవుట్ రెటు శాతం ముఖ్యంగా బాలికలవిద్యలో తీవ్ర పరిణామం చూపే ప్రమాదం వుంది. విద్యార్థుల పునాదిని బలపరిచే పూర్వ ప్రాథమిక విద్యనూ బలపరచకుండా అకస్మాత్తుగా డెటెన్షన్ విధానాన్నిప్రోత్సహిస్తే, పరీక్ష ఫెయిల్ అయిన మూడు మాసాలలో మరలాపరీక్ష నిర్వహించి తిరిగి ఉత్తీర్ణతను బట్టి అదనపు తరగతికి చేరే వెసులుబాటుకల్పించారు. కానీ ఈ వ్యవధిలో విద్యార్థిని సంసిద్ధపరచడం ఎంత అసాధ్యమో అనేది యోచించాలి. మరొకవైపు విద్యార్థి ఫెయిల్ అయితే మరలా గడచిన తరగతిలోనే కొనసాగితే విద్యార్థి ఎదుర్కొనే మానసిక సం ఘర్షణ ఒకవైపు. ఇక బాలికల విద్య విషయాన్ని ప్రస్తావిస్తే నో డిటెన్షన్ విధానం ముఖ్యంగా బాలికా విద్యపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో లేదా సెమీ గ్రామీణ వ్యవస్థలో బాలికల విద్యపట్ల తీరని వివక్ష కనబడుతూనే వుంది. మగ పిల్లలను ప్రైవెట్ విద్యాసంస్థల్లో చదివించి ఆడ పిల్లలను వివక్షపేరుతో, ఆడపిల్లల చదువుపై పెట్టుబడి పెట్టలేమనే నెపంతో ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. సమాజంలో ఆడపిల్లల చదువుపై ఇప్పటికీ వివక్ష చూపించడం, ఉన్నత చదువులకు ప్రోత్సహించకపోవడం గమనార్హం. అంతేకాదు, చాలా మంది పేద కుటుంబాలలో అనగా కూలి, రోజువారీ ఆదాయాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఆర్థిక స్తోమత లేక తమ పిల్లల చదువును నిర్లక్ష్యం చేస్తున్న సందర్భాల్లో డిటెన్షన్ డ్రాప్ అవుట్ శాతం పెరగడానికి తరుగుతున్న ప్రభుత్వ పాఠశాల శాతంమరింత తగ్గేప్రమాదం కూడా దీనికితోడవుతుంది. ఇప్పటికే సుమారు ఒక లక్ష వరకు ప్రభుత్వపాఠ శాలలు దేశంలో మూతపడ్డాయి. చాలా పాఠశాలలు ఏకో పాధ్యాయ పాఠశాలలుగా మనుగడ సాగిస్తున్నాయి. అంతేకాదు 6.59శాతం ప్రభుత్వ పాఠశాలలు తరగిపోయాయి. 4.23శాతం ప్రైవెట్ పాఠశాలల శాతం పెరిగిందని అధ్యయనాలు తెలియపరుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలపై ఆధారపడి చదువుకొనే గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు బహుభాషా సమస్యలు, విద్య పట్ల సరైన అవగాహన లేకపోవడం, ఆడపిల్లల పట్ల వారికున్న ఆచార సంప్రదాయాలు, చిన్నతనంలోనే వివాహాలు, ఎదిగినపిల్లలను బడికిపంపించడానికి తలిదండ్రులకు సుముఖత లేకపోవడం ఇవన్నీ వెరసి బాలికల విద్యకు డిటెన్షన్ ఒక అడ్డుకట్టాలా ఎర్పడే అవకాశం ఉంటుందేమో అనిపిస్తుంది. దీనికితోడు మరొకవైపు చిన్నపిల్లలను తమకుటుంబ ఆర్థిక పరిస్థితులకు చేదోడుగా వారిని పనుల్లో పెట్టడం తద్వారా బాల కార్మికులుగా మార్చడం, చదువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు, ఆడపిల్లలకు ఒక శాపంగా పరిణమించే పరిస్థితులకు దారితీస్తాయి. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దడానికి ఆడపిల్లల చదువు వ్యవస్థను బలపరచడానికి ఉపకరించే వ్యూహాలు రచించి విద్యాహక్కు చట్టనిబద్ధతను బలపరచాలి. ప్రాథమిక స్థాయినుండి పిల్లలకు పటిష్టమైన, నాణ్యమైన విద్యను అందించి తదనుగుణంగా పాఠశాలల పరిస్థితులను తీర్చిదిద్దడం, ఉపాధ్యాయుల బోధనా విధాన సరళిని మెరుగుపరచడం, పూర్వ ప్రాథమిక విద్యకు నోచుకోని గ్రామీణ పిల్లలకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమెరసీ కార్యక్రమం ద్వారా చక్కని పునాదిని ఏర్పరచడం తప్పనిసరి. ఎందుకనగా విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటానికి ఉపాధ్యాయులు తమబోధనా వ్యూహాలను మెరుగుపరచుకోవడం, డిజిటల్ యుగంలో వినూత్నపద్ధతులను అలవరచుకోవడం, సాంప్రదాయబోధనా విధానానికి స్వస్తి పలకడం తక్షణ కర్తవ్యంగా భావించాలి. సిలబస్ పూర్తి చేయడం కాదు, పూర్తి చేసిన పాఠ్యంశాల్లో ప్రగతిని తరచూ అంచనా వేయాలి. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను తర్చిదిద్దడానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బాల్ రక్షా భారత్ సిప్స్ సాంకేతిక సహకారంతో పాఠశాల విద్యాశాఖ అమలుపరు స్తున్న లెర్నింగ్ ఇంప్రూమెంట్ కార్యక్రమ వ్యూహాలైనే బోధన విద్యార్థులకు ప్రోస్ పీరియడ్‌ను కెటాయించి అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను తేర్చిదిద్దాలి. విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయడం, పీర్‌లెర్నింగ్, చదవడం వ్రాయడం రానివిద్యార్థుల కోసం లాంగ్వేజ్ భాషాభివృద్ధికి చదవడం వ్రాయడం వంటి కీలకాంశాలపై దృష్టి సారించా లి. భారం లేని చదువుతో పాఠశాల పిల్లలను చక్కదిద్దాలి. డిటెన్షన్ కన్నా నాణ్యమైన విద్యతో రిటెన్షన్ కోసం కృషి చేయాలి. తద్వారా బాలికా విద్యాభివృద్ధితో దేశాన్ని బలోపేతం చేయాలి. ●

# మార్కెట్ కమిటీల మాయాజాలం!

అదుపు ఆజ్ఞా లేకుండా పెరిగిపోతున్న ధరలను నియంత్రిస్తాం, నల్లబజారుదారులపై ఉక్కు పాదం మోపుతాం అంటూ ఎవరు అధికారంలోకి వచ్చినా చెప్పే మాటలే చెబుతున్నారు తప్ప ఆచరణలో మాత్రం ఏమీ చేయలేకపోతున్నారు. స్వరం మారుతున్నదే తప్ప పాటమాత్రం పాతదేన్నట్టుగా ఉంది. ధరల నియంత్రణలో పాలకుల ధోరణి ఏ పార్టీ అధికారంలో ఉన్నా మెతకవైఖరి అవలంబిస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధరల విషయంలో ఆవేదన,ఆందోళన వ్యక్తం చేసి రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపట్టిన నాయకులే అధికారంలోకి రావడంతోనే మారిపోతున్నారేమోననిపిస్తున్నది. ఇటీవల కాలంలో అదుపులేకుండా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యుడు విలవిల్లాడిపోతున్నాడు. ఒక్కరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు.ఒక పట్టణంలో ఉన్నధర మరో నగరంలోఉండడం లేదు. పండుగల సీజన్‌లో అయితే ధరలు మరింతగా పెరుగుతాయి. ఈ ధరలు ఇలా కొండెక్కడానికి గల కారణాలు, కారకులెవరో, ఎవరికి చెప్పుకోవాలో, చర్యలు ఎవరు తీసుకుంటారో దిక్కుతోచక సన్నజనంతోపాటు మధ్య తరగతి ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పోని ఉత్పత్తి చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర వస్తున్నదంటే అదీ లేదు. అక్కడ పెట్టుబడులు పెరుగుతున్నాయి. పండించిన పంటలకు ధరలురాక మొత్తం వ్యవసాయరంగమే సంక్షోభంలో కూరుకుపోతున్నది.అసలు వ్యవసాయమే గిట్టుబాటుకాక అప్పులు చెల్లించలేక, ఆత్మాభిమానం చంపుకోలేక అన్నదాతలు ప్రాణత్యాగం చేస్తున్నారు. ఇప్పుడు పంజాబ్,హర్యానా ప్రాంతంలోని రైతులు చేస్తున్న ఆందోళన ఉధృతరూపం దాల్చింది. వేలాది మంది రైతులు ఢిల్లీని ముట్టడించేందుకు బారులుతీరారు. వారు అడిగేవి తమకు గిట్టుబాటు ధర ఇప్పించమని. ప్రధానంగా రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు వాటి ధరలు పాతాళలోకానికి పడిపోతున్నాయి. వారివద్ద నుండి ప్రైవేట్ వ్యక్తుల గోదాముల్లోకి చేరుకోగానే ఒక వ్యూహం ప్రకారం కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటున్నారు.ఇదేదో ఇప్పుడు కొత్తగా వచ్చిందని చెప్పడం లేదు. ఎప్పటి నుంచో జరుగుతున్నది. రానురాను పెరిగిపోతున్నది. ఇందులో కొందరు దళారులు వ్యాపారస్తులు కీలక పాత్ర వహిస్తున్నారనే విషయం అధికారులకు పాలకులకు తెలిసినా చర్యలు శూన్యం. కొందరు దళారులు కమిషన్‌ల రూపంలో కోట్లాది రూపాయలు భోంచేస్తున్నారు. చట్ట ప్రకారం లైసెన్సు పొందినా నిబంధనలు అతిక్రమించి అటు రైతులను, ఇటు వినియోగదారులను దోపిడీకి గురి చేస్తున్నారు. ఇలా దోపిడీకి గురికాకుండా నివారించి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వినియోగదారులకు సరైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించడంలో కీలకపాత్ర వహించాల్సిన మార్కెట్ కమిటీలు అటు రైతులకు, ఇటు వినియోగదారులకు భక్షక కంపెనీలుగా తయారయ్యాయి. దళారులను అదుపు చేయలేకపోగా కొన్ని ప్రాంతాల్లో వారితోనే కుమ్మక్కైపోతున్నారు. అనేక సంద ర్భాల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. రైతులు ఉద్య మించి ధర్నాలు చేశారు. అయినా ఏమాత్రం ఫలితం ఉండడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అంటూ వేదికలెక్కి అరిచే పెద్దలే మార్కె ట్ కమిటీల విషయంలో అదే ప్రజాస్వామ్యాన్ని భూస్థాపి తం చేస్తున్నారు. నామినేషన్ పద్ధతి ఎప్పుడు, ఎవరు ప్రవేశపెట్టారో కానీ ఈ మార్కెట్ కమిటీలు రైతులపాలిట శాపాలుగా పరిణమించాయి.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన రైతుల ప్రతినిధుల బదులు బంధుమిత్రులనో, లేక తమ తోకలుగా, బాకాలుగా ఉన్న రాజకీయ కార్యకర్తలనో ఈ కమిటీల్లో నేతలు నియమించుకుంటున్నారు. మార్కెట్ కమిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ఇందులో ప్రజలో తిరస్కరించబడిన వారు ఎన్నికల్లో పోటీచేసే సత్తా లేనివారు చివరకు ప్రజాసేవ అంటే ఏమిటో తెలియనివారిని సైతం ఈ కమిటీల్లోకి చొప్పిస్తున్నారు. పాలకుల దయాదాక్షి ణ్యాలమీద ఎంపికైన పాలక మండళ్ల ఉనికి నామమాత్ర మే కాదు కొన్ని సందర్భాల్లో దళారుల సంక్షేమంగా పని చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రైతుల వద్ద నుంచి సరుకులు మార్కెట్‌కు వచ్చినప్పుడు ధరలను నియంత్రిస్తున్నారు. అవసరం అనుకుంటే పోటీగా ఇతర ప్రాంతాల నుంచి రప్పించి మార్కెట్లో దించి స్థానిక రైతుల ఉత్పత్తులను దెబ్బతీస్తున్నారు. రైతుల పేరుతోనే గ్రామాల్లో సరుకులు నిల్వ చేసుకొని కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెరిగిన తర్వాత మార్కెట్లోకి దించుతున్నారు. ఫలితంగా ధరలు పెరిగిపోతున్నాయి. ఈ బాగోతమంతా బహిరంగంగా జరుగుతున్నా రైతులు అల్లాడుతున్నా పాలకులు హెచ్చరికలు, ప్రకటనలు, సమీక్షలు, సమావేశాలతో కాలం గడుపుతున్నారే తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. గతంలో కూడా ఈ విషయంపై అధ్యయనం చేసేందుకు ఎన్నో సార్లు కమిటీలు వేశారు. నివేదికలు తెప్పించుకున్నారు. కానీ ఆ సూచనలు కానీ, సలహాలు కానీ పాటించిన దాఖలాలు లేవు. వ్యాపారులు లాభాల కోసమే ఈ వ్యాపారం చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారుల వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వ్యవహరించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాది రూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని భోంచేస్తున్న అధికారులను ఏమనాలి. ఇప్పటికైనా పాలకులు రాజకీ యాలకు అతీతంగా ఆలోచించాలి. ధరల నియం త్రణ విషయంలో పటిష్టమైన కృషికి శ్రీకారం చుట్టాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా మరెన్ని కార్యక్రమాలు చేపట్టినా పేదరికం మరింత పెరుగుతుంది.

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.



హెచ్.లాంగ్‌ఫెలో

కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో ఖర్చు అయిన జీవితమే చాలా ఉపయోగకరమైన జీవితం.



విలియం జేమ్స్

# ఇజ్రాయెల్ దాడులకు అంతం లేదా?

కనుమ ఎల్లారెడ్డి

ఇజ్రాయిల్ దాడులకు అంతు లేకుండా పోతోంది. దాడులకు ఎవరు మరణిస్తున్నారో ఇజ్రాయెల్‌కు తెలియడం లేనట్లు ఉంది. ఒకవేళ తెలిసి పసిపిల్లలను, గర్భిణీ స్త్రీలను పొట్టన పెట్టుకుంటుందా. దాడిలో పసిపిల్లలే ఎక్కువ అని తెలుస్తోంది. విపరీత చలిలో పాపం పసిపిల్లలు, గర్భిణీ స్త్రీల అవస్థలు చూస్తుంటే ఎంతటి కర్కశ హృదయం కలవారైనా కరిగిపోవాల్సిందే. కాని ఇజ్రాయెల్‌కు ఇవేమి పట్టనట్లు ఉంది. హమాస్ అంతమే దాని ప్రధాన ఆశయం. అయితే పగ దానిపైఉండాలి కాని పసిపిల్లలు ఏం చేశారాని. దానికి తోడు గర్భిణీస్త్రీలు. గాజాలో పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయి. వాళ్లు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. కనీసం తలదాచుకునే దానికి కూడా సరైన దుప్పట్లు లేవు. ముడుచుకుని గడ్డకట్టే చలిలో వణుకుతూ చస్తున్నారు. సహాయం చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. పౌష్టిక ఆహారం దేవుడెరుగు కనీసం ఒక బ్రెడ్ ముక్క కూడా దొరకడం గగనమైంది. కడుపు నింపుకోవడానికి వాళ్లు పడే అవస్థలు చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. ఇంతటి అమానుషమైన చర్యలకు ఇజ్రాయెల్ పాల్పడటం శోచనీయం. ఐక్యరాజ్య సమితి అనుభందసంస్థ అయిన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్ ) పిల్లల అభివృద్ధి కోసమే, అది ఎటువంటి ప్రకటనలు చేయడం లేదు. ఈ విషయంలో ప్రపంచ ఆహార సంస్థ కూడా చేష్టలుడిగినట్లు ఉంది. ఆదుకోవాల్సిన సంస్థ మౌనంగా ఉండటం, శాంతి కోసం తపన పడే ఐక్యరాజ్య సమితి చర్యలు ముందుకు పడటం లేదు. దీనికి ప్రపంచ దేశాలు ఏమి చేస్తున్నాయో అర్థంకాదు.



శాంతి, సుస్థిర అభివృద్ధి అనేమాటలు శిఖరాగ్ర సమావేశాలలో నాయకులు కలిసినప్పుడే చేతులు ఊడిపోయేలా కరచలనం చేస్తుంటారు. దానికితోడు పెదవులపై వారి చిరునవ్వు. అది అప్పటి వరకే తరువాత వారి ప్రకటనలు మరో విధంగా ఉంటాయి. మొత్తానికి ఇజ్రాయెల్ కాల్పులవిరమణ ఆపేటట్లు లేదు.శాంతి ప్రక్రియలకు ఖతర్‌లో అడుగు ముందుకు పడితే సంతోషమే. అయితే హమాస్ కూడా ఇజ్రాయెల్ పట్ల స్నేహాభావం చూపాలి. ఇటీవల ఓ 19 సంవత్సరాల ఇజ్రాయెల్ అమ్మాయిని పాలస్తీనా బంధించటంచూస్తే శాంతికి అడ్డుకట్ట పడుతుందేమో ననిపిస్తుంది. ఆ అమ్మాయి అనే మాటలలో సత్యం ఉన్నట్లు కనిపిస్తోంది. మా అవస్థలు, మా బతుకు మీకుపట్టదా, పౌరులసంక్షేమం కోసమే కదా ప్రభుత్వాలు ఉండేది అనిచెప్పడం.ఇరు పక్షాలకు, నేతలకు కనువిప్పు కల్పిస్తే చాలు. కాని ఇజ్రాయెల్ ఆ దిశలో చర్యలు తీసుకోదు. హమాస్ ఇజ్రాయెల్ పౌరుల బంధిల పైనే పట్టు సాధిస్తోంది. హమాస్ చెరలోని మా పౌరులను విడుదల చేయాలని ఇజ్రాయెల్ వాదన. ఇదే ఇరు పక్షాల మధ్య సయోధ్యకు ప్రధాన అవరోధంగా ఉంది. అందుకే ఇజ్రాయెల్ కాల్పుల మోత మొగిస్తోంది. ఇజ్రాయెల్ దాడిలో చాలావరకు హమాస్ నాయకులు హతమైనట్లు తెలుస్తోంది. ఇక్కడ ఇజ్రాయెల్, గాజాలోని పిల్లల, గర్భిణులపై దాడిచేయక దయ,జాలి,కరుణ, ప్రేమ చూపాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే విశ్వమానవాళికి ప్రేమను పంచిన క్రీస్తు భోదనలు ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదా!. క్రీస్తు మంచితనం ఇకనైనా నెతన్యాహు గ్రహిస్తే మేలు. ఒక హెచ్చరిక జారీ చేసి హమాస్‌కు గడువుఇచ్చి దారికి తెచ్చుకుంటే కాల్పుల విరమణ ఆగిపోతుంది. దాడులు ప్రతిదాడులు చేయకుండా, పౌరులను బంధించకుండా ఉంటే శాంతి ఫలించినట్లే. రెండు శాంతి పక్షం వహిస్తాయని ఆశిద్దాం. ●

# ప్రజావాక్కు



## సురక్షితమైన నీటిని అందించాలి

బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్లాలని, వారికి ఉచిత నిర్బంధ విద్యఅందించాలని విద్యాహక్కుచట్టం చెబుతుంది. పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పౌష్టికాహారమైన భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. మధ్యాహ్నభోజనాన్ని వండిపెట్టే బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించారు. అలాగే విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందజేసేందుకు నాడు నేడు పథకం కింద శుద్ధ జలం ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అవి తరచుగామరమ్మతులకు గురవుతున్నాయి.పలుచోట్ల ట్యాంకు నుంచి వచ్చే నీటినే వంట వండేందుకు ఉపయోగిస్తున్నారు. ఈ ట్యాంకులు ఏళ్ల తరబడి శుభ్రం చేయక, బ్లీచింగ్ చేయకపోవడంతో మధ్యాహ్నం భోజనం చేసే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

-సి. చంద్రశేఖర్, నెల్లూరు జిల్లా

## కార్యాచరణకు నోచుకోని ప్రతిపాదనలు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. దానితో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వివరాల ప్రకారం, ఢిల్లీలోని 38 మానిటరింగ్ స్టేషన్లలో తొమ్మిదిలో ఏక్యూఐస్థాయిలు తీవ్రమైన స్థాయిలోఉన్నాయి. పొలాల్ని శుభ్రంచెయ్యడానికి వారి ముందున్న సులభమైన, చౌకైన మార్గం గడ్డిని తగలబెట్టడమే. గడ్డిని తగలబెట్టకుండా ఆపేందుకు రైతులకు ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని, యంత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాలు రకరకాల ప్రతిపాదనలు తెరపైకి తెచ్చాయి.

-పి.సాయిరుత్విక్, నల్గొండ

## పత్తి పరిశోధన కేంద్రం

తెలంగాణలోనే రెండవ అతిపెద్ద పట్టణం వరంగల్‌కి పత్తి పరిశోధన కేంద్రం మంజూరైంది. తెలంగాణ భౌగోళికంగా రెండు అతి పెద్ద జీవ నదుల మధ్యన ఉన్నది చారిత్రక దక్కన్‌పీఠభూమి ప్రాంతంలో ఆర్కియాన్ శిలాల మధ్యన ఉండడం మూలంగా తెలంగాణలో పండే పొడుగు గింజ పత్తి చాలా శ్రేష్ఠమైంది.అయితే తెలంగాణలో బహుశా రెండో అతి ప్రధాన పంటగా ఉన్న పత్తికి మద్దతు ధర దక్కకపోవడం ఒక్కటే విచారకరం.

- భారత అవినాష్, జనగామ

## భద్రతా ప్రమాణాల కొరత

ఈ మధ్య కాలంలో అనేక పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి.మృతదేహాలను పోస్టు మార్టంకి తరలించడం, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు పంపించడం, మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించడంతో తమ బాధ్యత తీరిపోయిందని ప్రభుత్వాలు భావించినంతకాలం ఇటువంటి దురదృష్టకర ఘటనలు జరుగుతునే వుంటాయి. కార్మికులకు గ్రూప్ హెల్త్‌ఇన్సూరెన్స్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యాలు.. ప్రమాదం జరిగాక మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకోవడానికి కూడా ముందుకు రావడంలేదు.పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇల్లు చేరడం కష్టంగా మారింది. ముఖ్యంగా పలు రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేకపోవడం, నైపుణ్యం గల కార్మికులనుతీసుకోకపోవడంఅధికప్రమాదాలకుకారణంగా చెప్పొచ్చు.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## ఉచితాలు ఎందుకు?

ఉచితాలు ఎందుకు ఉపాధి కల్పన చేయాలని సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుకోవాలి. ఉచితాలు కొంతవరకు అవసరమే. కానీ అర్హత లేని వారెందరో వీటిని పొందుతున్నారు. ఓట్లకోసమే వీటిని పోటాపోటీగా ఎలక్షన్ల కాలంలో పెంచుకుంటూపోతున్నారు.ముందుచూపు గల రాజకీయ నాయకులు ఆర్థికశాస్త్రవేత్తలు వీటిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆతరువాత పదవిలోకి వచ్చిన ప్రభుత్వాలు ద్రవ్యలోటుతో వాగ్దానం ప్రకారం వాటిని అమలు చేయలేక అభాసు పాలవుతున్నారు. రెండు తెలుగురాష్ట్రాలు ఈవిషయంలో తికమకలవుతుండడం గమనిస్తూనే ఉన్నాం. ఖర్చు పెట్టడం అంత తేలిక కాదు. వనరులను సృష్టించి సంపద పెంచుకోవడం.

-ఎన్. లక్ష్మి, సికింద్రాబాద్

## కొత్త బస్సులు వేయాలి

ఆర్టీసీ వారు ప్రతి డిపోకు కొత్త బస్సులు మంజూరు చేయాలి. కొన్ని డిపోలకు తక్కువ బస్సులు ఉండటం వల్ల అన్ని రూట్‌లకు బస్సులు నడపలేకపోతున్నారు. బస్సులు తక్కువగా ఉండటం వల్ల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల కొరకు పడిగాపులు కాయాల్సివస్తుంది. ముఖ్యంగా పాఠశాలలకు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి చాలా సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి డిపోకు నూతన బస్సులు మంజూరు చేయాలి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

# అమలుకు నోచుకోని ఆదివాసి చట్టాలు!

రామ కిష్టయ్య సంగన భట్ల

దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడుతుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగినగుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారత దేశంలోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగిఉంది. దేశ జనాభాలో 8.6శాతం మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది కొండలు, అడవుల తెగలుగా వర్గీకరించబడ్డారు. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతోపాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించబడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి



చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయబడుతున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కులేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించిపోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్రం వచ్చి యేళ్ల గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటికీ ఉన్నాయి.విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకుపట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారాస్వయం పాలన ఉద్దేశిత పీసాచట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడుభూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా. పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూదురాక్రమణపై కమిటీ వేయాలని, ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదోతరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది. ●

మనవి


ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మళ్లీ కేజ్రీవాల్‌పై ఇడి విచారణ

## ఢిల్లీ లిక్కర్‌కేసులో అనుమతి ఇచ్చిన కేంద్ర హోంశాఖ



**న్యూఢిల్లీ, జనవరి 15, ప్రభాతవార్త:** మరికొన్ని రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఝులక్ ఇచ్చింది, దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితుడుగా వున్న కేజ్రీవాల్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) విచారించేందుకు కేంద్ర హోం శాఖ బుధవారం అనుమతి ఇస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. కేజ్రీవాల్ ఢిల్లీ సిఎంగా వున్న సమయంలోనే లిక్కర్ స్కాం వెలుగులోకి రావడం, మొదట ఆప్ నేతలు, ఆ తరువాత కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం ఆయనను ఇడి కూడా అరెస్టు చేయడం విదితమే. ఈ కేసులో ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ సహ పలువురు ఎంపిలు, ఎంఎల్ఎలు అరెస్టవడం తెలిసిందే. వీరంతా చాలాకాలం పాటు తీహార్ జైల్లో వుండి బెయిల్‌పై విడుదలయ్యారు. ఇలా అరెస్టయి బెయిల్‌పై వున్న వారిలో కేజ్రీవాల్ కూడా వున్నారు.

లిక్కర్ స్కాంపై విచారణ ప్రస్తుతం స్తబ్దుగా వుంది. ఆరేడు నెలలుగా దీనిపై అటు సిబిఐ కానీ ఇటు ఇడి కానీ విచారణ చేస్తున్న దాఖలాలు లేవని చెప్పాలి. అయితే వచ్చే ఫిబ్రవరి నెల ఐదవ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ అనూహ్యంగా లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌ను ఇడి విచారించేందుకు అనుమతివ్వడం రాజకీయంగా ప్రకంపనలు రేపుతోంది. ప్రజాప్రతినిధులను విచారణ జరపాలంటే ఇడి ముందస్తు అనుమతి పొందాలని గత ఏడాది నవంబర్ నెలలో సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ జారీచేసిన ఆదేశాలు సంచలనం రేపాయి. కేజ్రీవాల్‌ను విచారించేందుకు తమకు అనుమతి కావాలని ఇడి అధికారులు నెల రోజుల క్రితం ఢిల్లీ లెఫ్టినంట్ గవర్నర్ వికె సక్సేనాకు లేఖ రాశారు. దీనికి సక్సేనా ఆమోదం తెలపడంతో ఇడి అధికారులు ఈ విషయాన్ని కేంద్ర హోం శాఖకు పంపారు. దీనిపై స్పందించిన కేంద్ర హోంశాఖ కేజ్రీవాల్‌ను లిక్కర్ స్కాంలో విచారించేందుకు ఇడికి అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను విచారించే వీలుంది. విచారణలో భాగంగా కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేయవచ్చనే వార్తలు కూడా విన వస్తున్నాయి.



## పోలెండ్, ఉక్రెయిన్ సరిహద్దుల్లో రష్యా భీకరదాడులు

**వార్సా(పోలెండ్), జనవరి 15:** పోలండ్ సరిహద్దుల్లో ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులుచేసింది. కీలకమైన గ్యాస్, ఎరువుల సరఫరా కేంద్రాలే లక్ష్యంగాచేసుకుని మాస్కోకు చెందిన ఏడు టిఎ-22 ఆరు టియు-95 స్ట్రాటజిక్ బాంబర్లు దాడులుచేసాయి. పోలండ్ సరిహద్దుకు అత్యంత సమీపంలో రష్యా క్షిపణులు పడ్డాయి. దీనితో నాటో దళాలు అప్రమత్తం అయ్యాయి. వెంటనే ఫైటర్‌జెట్ విమానాలు గాలిలోకి ఎగిరాయి. నేతలపై ఉన్న ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు అప్రమత్తం అయ్యాయని నాటో ఆపరేషనల్ కమాండ్ హెడ్‌క్వార్టర్‌నుంచి ప్రకటన వెలువడింది. ఉక్రెయిన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు మొత్తం 40 క్షిపణుల్లో 30ని నేలకూల్చినట్లు అద్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. అదనంగా మరో 70 అటాక్‌డ్రోన్లుకూడా దాడిచేసాయన్నారు. నాటోసదస్సులో మిత్రదేశాలు ఇచ్చిన హామీలు ఇంకా కొన్ని అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఎయర్‌డిఫెన్స్‌ల సరఫరాను వేగవంతంచేయాలని పిలుపు ఇచ్చారు. మరోవైపు ఉక్రెయిన్‌నేషనల్ గ్రిడ్‌లో సమస్య కారణంగా ఆరుప్రదేశాల్లో అత్యవసర కరెంటు కోతలు విదించారు.

ముందురోజు రష్యాపై ఉక్రెయిన్‌చేసిన దాడిక ప్రతీకారంగానే ఈ దాడిచోటుచేసుకున్నట్లు రక్షణ నిపుణులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో, అమెరికా తయారీ ఎటిఎసిఎంఎస్‌లను కీవ్ వాడుతుండటంతో మాస్కోదళాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఒక్కరోజే సుమారు 14 క్షిపణులు 200 డ్రోన్లతో రష్యాయపై విరుచుకుపడింది. కెమికల్ ఫ్యాక్టరీలు విద్యుత్‌కేంద్రాలను లక్ష్యంగాచేసుకున్నాయి. తాము రెండు మిలియన్ డాలర్ల విలువయిన స్ట్రామ్ షాడో క్షిపణులను కూల్చేసినట్లు రష్యా ప్రకటించుకుంది.

## నామినేషన్ దాఖలుచేసిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, జనవరి 15:** ఆప్ అధినేత, మాజీ సిఎం అరవింద్‌కేజ్రీవాల్ బుధవారం నామినేషన్ దాఖలుచేసారు. న్యూఢిల్లీ నియోజకవర్గంనుంచి ఆయన బరిలో దిగారు. నామినేషన్ పత్రాలను దాఖలుచేయడానికి ముందు కేజ్రీవాల్ తన భార్య సునీతతో కలిసి హనుమాన్ వాల్మీకి ఆలయాల్లో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆప్ కార్యాలయంనుంచి న్యూఢిల్లీ జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి నామినేషన్ పత్రాలు అందచేసారు. నేనునామినేషన్ దాఖలు చేసాను. చేసిన పనికి ఓటు వేయండి. ఒకవైపు పనిచేసే పార్టీ మరొకవైపు దుర్వినియోగంచేసే పార్టీ ఉంది. కాబట్టి పనికి ఓటు వేయండని ఢిల్లీ ప్రజలకు నేను చెప్పాలనుకుంటున్నట్లు కేజ్రీ అన్నారు. విద్య,వైద్యం, విద్యుత్, నీరు రోడ్లు వీటికి ఓటు వేయడం చాలా పనులుజరిగాయి. ఇంకా చాలాపనులు మిగిలి ఉన్నాయి. కాబట్టి ప్రజలు కష్టపడి ఓట్లువేస్తారని ఆశిస్తున్నట్లు అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. కాగా కేజ్రీవాల్‌కు ఖలిస్తానీ ఉగ్రవాదగ్రూపుల నుంచి ప్రాణాపాయం ఉందని నిఘా ఏజెన్సీలు చెప్పాయి. దీనిపై కేజ్రివాల్ వ్యాఖ్యలుచేస్తూ ఐదో తేదీ జరిగే ఢిల్లీ అసెంబ్లీకోసం ఈరోజు నామినేషన్ దాఖలుచేస్తూ దేవుడే నన్ను రక్షిస్తాడు అని అన్నారు. దేవుడు అనుమతించినంతకాలం తాను జీవించాలనే నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

## రైతుఖాతాలోకి రూ.16 లక్షలు

### తిరిగి ఇవ్వనని మొండికేసిన రైతు!

**అజ్మేర్, జనవరి 15:** రాజస్థాన్‌లోని అజ్మీర్‌జిల్లాకు చెందిన ఒక రైతు బ్యాంకు ఖాతాలో పొరపాటున రూ.16 లక్షలు వచ్చాయి. అయితే వచ్చిన డబ్బును తిరిగి ఇచ్చేందుకు సదరు రైతు ఎంతకీ ఒప్పుకోలేదు. చివరకు బ్యాంకు పోలీసులను ఆశ్రయించింది. కిషన్‌గఢ్‌లోని ఆర్ని పోలీస్ స్టేషన్‌పరిధిలో ఈసంఘటన జరిగింది చోటా లాంబా గ్రామానికి చెందిన రైతు కనకరామ్‌జాట్ తన ఖాతాలోని బ్యాంక్ ఆఫ్ బరోడానుంచి లక్షల్లో డబ్బుట్రాన్స్‌ఫర్ అయింది. దీనితో ఆనందంతో సదరు రైతు పర్సనల్‌లోన్ తీర్చేందుకు రూ.15 లక్షలు వాడేసాడు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి పంట బీమా ప్రీమియంగా ఈ మొత్తం పొరపాటున రైతు జాట్‌ఖాతాలోకి బదిలీచేసినట్లు బ్యాంకు గుర్తించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ జితేంద్ర ఠాకూర్ మంగళవారం సాయంత్రం ఆరణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసారు. డిసెంబరు 31న రైతు ఖాతాలోకి డబ్బులుచేరాయి. జనవరి రెండునుంచి నాలుగు తేదీమధ్య జాట్ ఒక్కొక్కటిగా రూ.5 లక్షలచొప్పున వేరువేరు లావాదేవీలు చేసాడు. మొత్తం 15 లక్షలను వినియోగించుకున్నాడని బ్యాంకు మేనేజర్ జితేంద్ర ఠాకూర్ వెల్లడించారు.

## స్వాతంత్ర్యంపై భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం

### కాంగ్రెస్ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవంలో అగ్రనేత రాహుల్

### బ్రిటీష్‌వారిపై పోరాడిన యోధులందరిని కించ పరిచిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్



న్యూఢిల్లీలో కాంగ్రెస్ కొత్త కార్యాలయం ప్రారంభిస్తున్న ఖర్గే, సోనియా, రాహుల్

**న్యూఢిల్లీ, జనవరి 15:** అయోధ్యలో రామమందిరం ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్రాన్ని పొందిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. వీటిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. తాజాగా ఆ పార్టీ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీ మాట్లాడుతూ భగవత్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌పై ధ్వజమెత్తారు.

దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి మా రాజ్యాంగ సిద్ధాంతం, మరొకటి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదంటూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ దేశ ప్రజలందరినీ అవమానించారు. బ్రిటిష్ వారిపై పోరాడిన యోధులందరినీ ఆయన కించపరిచారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి. ఇకనైనా ఇలాంటి పిచ్చి మాటలు వినడం ఆపాలి అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేవారిని ఆపగలిగేది తమ పార్టీ మాత్రమే నని అన్నారు. తమ పోరాటంలో న్యాయం ఉందని, దాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ తీరుపైనా రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల సమయానికి మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. దానికి సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు ఇసి నిరాకరిస్తోంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం ఇసి బాధ్యత. మన ఎన్నికల వ్యవస్థలో తీవ్రమైన సమస్యలున్నాయి అని రాహుల్ ఆరోపించారు. అనంతరం నూతన ప్రధానకార్యాలం గురించి స్పందిస్తూ ఈ కొత్త భవనం కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో రూపుదిద్దుకుంది. ఇది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు చెందుతుంది అని పేర్కొన్నారు.

**కొత్త ఎఐసిసి కార్యాలయానికి 'ఇందిరాభవన్'గా నామకరణం**

కాంగ్రెస్ పార్టీ కొత్తకేంద్ర కార్యాలయాన్ని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ప్రారంభించారు. కొత్తఎఐసిసి భవనానికి ఇందిరాగాంధీ భవన్ అని పేరుపెట్టారు. పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, మల్లిఖార్జున్‌ఖర్గేలు ప్రారంభించిన తర్వాత కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం అక్బర్‌రోడ్డు 24వ నెంబరు బంగ్లాలో ఎఐసిసి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ బంగ్లాలో పార్టీ కార్యాలయాలు ఉండకూడదని గతంలోకేంద్రం నిర్ణయించింది. దీనితో పార్టీలు సొంతభవనాలు నిర్మించు కున్నాయి. ఐదుదశాబ్దాలుగా అక్బర్‌రోడ్డులోనే కాంగ్రెస్ కార్యకలాపాలు నిర్వహించింది. 1978 నుంచి ఇది ఎఐసిసి కేంద్ర కార్యాలయంగా ఉంది. 9ఎ కోట్లారోడ్డులో ఆరు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో కాంగ్రెస్ నూతన కార్యాలయాన్ని నిర్మించారు. కోట్లా మార్గ్‌కు ఎఐసిసి కార్యాలయాన్ని తరలించినా అక్బర్‌రోడ్డునుంచికూడా కార్యకలాపాలు ఉంటాయని పార్టీ నేతలు చెపుతున్నారు. 2008లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయమార్గ్‌లో కాంగ్రెస పార్టీకి కేంద్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. తర్వాత ఆమార్గ్‌నుంచి కోట్లా మార్గ్‌వైపు ప్రవేశం మార్చుకున్నారు. 2009లో కేంద్ర కార్యాలయం నిర్మాణం ప్రారంభించి 15 ఏళ్లపాటు ఇందిరాగాంధీభవన్ నిర్మాణం కొనసాగించారు.

## సిఎం అతిశి జింకలా ఢిల్లీ వీధుల్లో పరుగులు పెడుతున్నారు!

### బిజెపి అభ్యర్థి రమేశ్ బిదూరి మళ్లీ వింత వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జనవరి 15:** దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, ఢిల్లీ సిఎం అతిశి మర్లెనాలపై వ్యాఖ్యలుచేసి నాలుక్కరుచుకున్న బిజెపి కల్కాజీ అభ్యర్థి రమేష్ బిదూరి మరోసారి నోరుజారారు. మళ్లీ ఢిల్లీ సిఎం అతిశి మర్లెనాపై చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసాయి. నాలుగేళ్లుగా ఢిల్లీ సమస్యలను పట్టించుకోని అతిశి ఎన్నికలు సమీపించిన వేళ ఓట్లకోసం నగర వ్యాప్తంగా జింకలా పరుగెడుతున్నారని ఆయన విమర్శలు సంధించారు. ఢిల్లీ ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నగర వీధులపరిస్థితి చూడండి. గడచిని నాలుగేళ్లలో అతిశి ఎప్పుడూ నగర సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఎన్నికలు వస్తున్నందున అడవిలో జింకలా ఢిల్లీ వీధుల్లో ఆమె పరుగులు పెడుతున్నారని ఎద్దేవాచేసారు. ప్రజల ఓట్లకోసం ఆయన జింకల్లా పరుగులుతీసేస్తున్నారంటూ ఛలోక్తులు వేసారు. అతిశి ఇంటిపేరు మార్చుకుందని గత వారం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు రాజకీయ ప్రత్యర్థులపై వివాదాస్పద ప్రకటనలు చేయడం బిదూరికి ఇదే మొదటిసారికాదు. బిఎస్‌పి నేత డానిష్ ఆలీని దూషించడం మొదలు ప్రియాంక గాంధీ వంటి నేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. పార్టీ అదిష్టాని ఆయనపై కన్నెర్రచేసినా ఆయన తీరుమారలేదు. బిజెపి తరపున ఢిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిదూరీయే అవుతారని ఇప్పటికే కేజ్రీవాల్ ప్రచారం తెరపైకి తెచ్చారు. వీటిని తోసిపుచ్చిన బిదూరి సిఎం అభ్యర్థిరేసులో తానులేనని స్పష్టంచేసారు.

## 'సైకిల్ ట్రాక్' పిటిషన్‌ను కొట్టివేసిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ, జనవరి 15:** ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బుతో దేశం అంతా సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని పిటిషన్ వేసిన వ్యక్తిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖజానా నుంచి వచ్చే డబ్బును పేదలకు ఇళ్లు, ఆరోగ్యం, విద్యా మొదలైన సౌకర్యాలు కల్పించడానికి వినియోగించాలా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. అనేక నగరాల్లో పేద ప్రజలు సరైన నివాసాలు లేక మురికివాడల్లో నివసిస్తున్నారని వారికి సరైన ఆరోగ్య, విద్యా సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది. దేశ ప్రజల సమస్యలు వదిలేసి సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు గురించి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మీ ఆలోచన చాలా గొప్పదని చురకలు అంటించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది మాట్లాడుతూ ఎంపిక చేసిన నగరాలు, పట్టణాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించే అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్కీమ్‌ను ప్రస్తావించారు. దీనికింద అనేక రాష్ట్రాల్లో సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. చలికాలంలో విపరీతమైన మంచు, వాయుకాలుష్యం వల్ల దేశ రాజధానిలో తరచూ ప్రమాదాలు జరుగతున్నాయని సైకిల ట్రాక్‌లు నిర్మించడం వల్ల వాటిని కొంత మేరకు నివారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ కోరిన విధంగా ప్రభుత్వాలు చేస్తాయని అనుకోవడం పగటికలే అవుతుందని పేర్కొంటూ న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

## బ్లాక్‌కోట్ డేటా రిలీజ్‌చేసిన ఫిట్‌నెస్ యాప్



**ప్యారిస్, జనవరి 15:** హీరోషిమా నాగసాకిపై వేసిన బాంబులకంటే వెయ్యిరెట్లు శక్తివంతమైన అణ్వాయుధాల డేటా లీకైంది. రక్షణదళాల్లో అణుజలాంతర్గాముల కదలికలు అత్యంత రహస్యంగా ఉంచుతారు. అందుకలోని సిబ్బందికే చివరినిమిషం వరకూ ఎక్కడికి వెళతారో తెలియదు. కానీ ఏకంగా అణుజలాంతర్గాముల బేస్ వివరాలే ఇపుడు లీక్ అయ్యాయి. ఒక్కోదానిలో 16 అణుక్షిపణులు ఉన్న నాలుగు సబ్‌మెరైన్లు అక్కడ ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి ఓ ఫిట్‌నెస్‌ట్రాకింగ్ యాప్ కారణమని తేలింది. ఫ్రాన్స్‌కు చెందిన ఓ అణుజలాంతర్గామి సిబ్బంది అధికారులు డేటాసహా లొకేషన్ వివరాలు పొరపాటున లీక్ అయ్యాయి. వాస్తవానికి ఆసబ్‌మెరైన్ రష్యా సమీపంలో గస్తీకి వెళ్లాల్సి ఉంది. ఈ వివరాలు మాస్కోచేతికి చేరితే ఆ జలాంతర్గామి పరిస్థితేంటని ఫ్రాన్స్ బెంబేలెత్తింది. మొబైల్, స్మార్ట్ వాచ్‌ల్లో వినియోగించే స్ట్రావా యాప్ ఈ మొత్తం తతంగానికి మూలం అని తేల్చారు. కష్టమర్ల ఫిట్‌నెస్ కార్యకలాపాలను ట్రాక్‌చేసి పర్యవేక్షిస్తుంది. దీనితో వారు ఎక్కడున్నారు అనే అంశం అత్యంత కచ్చితత్వంతో గుర్తిస్తుది. తాజాగా అది బ్రెస్ట్ హార్బర్‌లో లాంగ్ ఐలాండ్ అనే ఫ్రాన్స్ సబ్‌మెరైన్‌బేస్‌ను గుర్తించింది. ఇక్కడ ఉన్న నాలుగు జలాంతర్గాలములు కలిపి 64 క్షిపణులు ప్రయోగించేసామర్థ్యంతో ఉంటాయి. వీటిని బ్లాక్‌బోట్స్ అంటారు. 1972నుంచి ఇక్కడ ఉన్న జలాంతర్గాముల్లో ఒకటి ఎప్పుడూ గస్తీలో ఉంటుంది. అధ్యక్షుడు ఆదేశాలమేరకు స్పందించేలోపే ఓ రహస్య ప్రదేశంలో కాచుకుని ఉంటుంది. లాంగ్ ఐలాండ్ బేస్‌లో మొత్తం రెండువేలమంది మిలిటరీ సిబ్బంది పనిచేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో ఇదే టాప్ సీక్రెట్ మిలిటరీజోన్. ఇక్కడ కనీసం స్మార్ట్‌ఫోన్లను కూడా వాడనీయరు. తీసుకెళ్లినా వాటిని స్విచ్ఛాఫ్‌చేసి సిగ్నల్‌ప్రూఫ్ లాకర్లలో పెట్టేస్తారు. కానీ కొందరు సిబ్బందిమాత్రం ఫిజికల్ యాక్టివిటీ చెక్‌చేసుకోడానికి థర్డ్‌పార్టీ యాప్స్ వినియోగించే స్మార్ట్‌వాచ్‌లను వాడటం జరుగుతోంది. ఇపుడు ఈ డేటా లీక్ అయ్యాక ఫ్రాన్స్ రక్షణశాఖ అప్రమత్తం అయింది. గత పదేళ్లుగా స్ట్రావా యాప్ వాడుతున్న సుమారు 400 మంది సిబ్బందిపై దర్యాప్తు ఆరంభించింది.

ఇక ఫ్రాన్స్ పత్రిక లా మాండే వివరాల ప్రకారం ఇక్కడపనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా అసలు తమపేర్లతోనే యాప్ నమోదుచేసినట్లు తేలింది. వారిప్రొఫైల్‌ను పబ్లిక్‌గానే ఉంచారు. మొత్తం 16 సార్లు అణుజలాంతర్గాములున్న ప్రదేశాల్లో జాగింగ్‌కువెళ్లారు. ఆసమయంలో తన లొకేషన్ టైమ్‌ను ఆతడు రికార్డుచేసాడు. ఆ తర్వాత రెండునెలలపాటు ఆతడి కార్యకలాపాలు ఆయాప్‌లో నిలిచిపోయి మళ్లీ షురూ అయ్యాయి. దానిలో చాట్‌చేస్తూ తాను రెండునెలలపాటు జీవవ్యర్థాల బాక్స్‌లోకి వెళ్లివచ్చాను అని సందేశం పంపించాడు. దీనికితోడు స్కూబా డైవింగ్ ఇమేజ్‌లను షేర్‌చేసాడు. ఈ స్ట్రావా యాప్‌ను అమెరికా, రష్యా,ఫ్రాన్స్ అధ్యక్షుల బాడీగార్డులు కూడా వాడుతున్నారు. దీనితో అధ్యక్షుల కదలికలు ట్రిప్‌ల వివరాలుకూడా ఆ యాప్‌లోకి చేరుతున్నాయి.

## సిఎం అతిశికి రూ.76.93 లక్షల ఆస్తులు!

**న్యూఢిల్లీ, జనవరి 15:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతునానయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తికావస్తోంది ముఖ్యనేతలంతా నామినేషన్లు దాఖలుచేసారు. సిఎం అతిశి, మాజీ సిఎం కేజ్రివాల్‌లు నామినేషన్లు దాఖలుచేసారు. ఇక సిఎం అతిశి కల్కాజీ నియోజకవర్గంనుంచి పోటీచేస్తున్నారు. సిఎంపై కాంగ్రెస్ నాయకురాలు అల్కాలాంబా పోటీచేస్తుంటే బిజెపినుంచి మాజీ ఎంపి రమేష్‌సింగ్ బిదూరి పోటీలో ఉన్నారు. కాగా అఫిడవిట్లలో నేతలు తమ ఆస్తులను కూడా పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం తన ఆస్తుల విలువ రూ.76,93,347.98 లుగాపేరొనకన్నారు. ఐదేళ్లలో తన సంపద 28.66శాతంపెరిగిందని అఫిడవిట్‌లో వెల్లడించారు. ఎలాంటి స్థిరాస్తిలేదన్నారు. ఆభరణాల పేరుతో కేవలం పదిగ్రాముల బంగారం మాత్రమే ఉందని వెల్లడించారు. సొంతకారులేదా ఇతర ఎలాంటి వాహనాలులేవన్నారు. రెండు క్రిమినల్ పరువునష్టం కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలియజేశారు. ప్రస్తుతంరూ.30వేల నగదు ఉందని తనకు మూడు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని ఆమె అన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి అల్కాలాంబా తనకు మొత్తం రూ.3.41 కోట్ల ఆస్తులున్నాయన్నారు. రూ.61.12 లక్షలవిలువైన చరాస్తులు, ఆమె బంధువుకి రూ.14.36 లక్షల విలువైన చరాస్తులున్నాయన్నారు. గత ఐదేళ్లలోరూ.20.12 లక్షలుపెరిగినట్లుగాచెప్పారు. గురుగ్రామ్‌లో రూ.80 లక్షలవిలువైన రూ.500 చదరపు అడుగుల వాణిజ్య ఫ్లాట్ ఢిల్లీలోని సౌత్ ఎక్స్‌టెన్షన్‌వన్‌లో రూ.2 కోట్ల విలువైన నివాస ఆస్తిఉంది. అఫిడవిట్‌ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆమె ఆదాయం రూ.8.28 లక్షలుకాగా 2023-24లో రూ.8.91 లక్షలు, 2022-23లో రూ.5.35 లక్షలుగా ఉంది. ఆభరణాలగురించి మాత్రం అఫిడవిట్‌లో తెలపలేదు. ఇక బిజెపి అభ్యర్థి రమేష్‌సింగ్ బిదూరి కల్కాజీనుంచే పోటీలో ఉన్నారు. 2003, 2008, 2013ల్లో తుగ్లకాబాద్ అసెంబ్లీ స్థానంనుంచి పోటీచేసి గెలిచారు. అల్కాలాంబా సుమారు ఐదేళ్లపాటు ఆప్‌లో ఉండి 2019లో కాంగ్రెస్‌లోచేరారు. కల్కాజీ నియోజకవర్గంలో మొత్తం 1,94,515 మందిఓటర్లు ఉండగా వీరిలో 1,06,983 మంది పురుషులు 87,617 మంది మహిళలున్నారు. ఐదుగురు ట్రాన్స్‌జెండర్లుఉన్నారు. కాగా బిదూరి దాఖలుచేసిన ఆస్తుల అఫిడవిట్‌మాత్రం ఇంకా వెలుగులోకి రాలేదు.

## కేజ్రివాల్ పునర్విచారణను వ్యతిరేకించిన ఆప్

**న్యూఢిల్లీ, జనవరి 15:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్‌ను విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కేంద్ర అనుమతివ్వడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ వ్యతిరేకించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిజెపి మళ్లీ తన నీచ రాజకీయాలను మొదలుపెట్టిందని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేశాక ఇడి మళ్లీ వారిని విచారించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారని దుయ్యబట్టారు. కేజ్రీవాల్, సిసోడియాలకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల తర్వాత ఈ కేసును విచారించడానికి మళ్లీ కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థకు అనుమతి ఇచ్చింది. అది కూడా ఎన్నికలకు ముందు. తప్పుడు కేసులు పెట్టి ఆప్ నేతల పరువు తీయడం బిజెపికి రోజువారీ దినచర్యగా మారిందని ప్రజలకు ఇప్పుడు అర్థమైంది అని ప్రియాంక అన్నారు.

## దక్షిణ కొరియా అధ్యక్షుడు అరెస్ట్!



**సియోల్, జనవరి 15:** హటాత్తుగా అత్యవసరస్థితిని ప్రకటించి దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్ లెక్కలేనన్ని చిక్కులు తెచ్చుకున్నాడు. ఇప్పటికే ఆయన రెండుసార్లు అభిశంసనకు గురయ్యారు. తాజాగా ఇపుడు ఆయన్ను పోలీసులు అరెస్టుచేసారు. మార్షల్ లా విధించి చట్టాన్ని ఉల్లంగించినందుకుగాను యోల్‌ను అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున వందలమంది దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసానికి చేరుకున్నారు. తొలుత అధ్యక్ష భద్రతా దళాలు వీరిని అడ్డుకున్నాయి. కొంతసేపు ప్రతిష్టంభన నెలకొన్న తర్వాత దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసం లోపలికి వెళ్లి యూన్‌సుక్ యోల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీ భద్రత నడుమ ఆయన్ను అక్కడి నుంచి తరలించారు. గతంలో యోల్‌ను అరెస్టుచేసేందుకు ఓసారి ప్రయత్నించగా పెద్ద ఎత్తున ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఆ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని నేడు భద్రత మరింత కట్టుదిట్టంచేసారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ గత ఏడాది డిసెంబరులో దక్షిణకొరియా అధ్యక్షుడు ఎమర్జెన్సీ మార్షల్ లా విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకతరావడంతో యూన్‌సుక్ తన ప్రకటనను విరమించుకున్నా ఆయన తనపదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసాయి. ఈ నేపథ్యంలో మార్షల్ లా అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం తీసుకురాగా పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మార్షల్‌లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు. మార్షల్ లా ఉత్తర్వులు జారీచేసి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టినందుకు ఆయనకు వ్యతిరేకంగా విపక్షాలు పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. తీర్మానానికి అనుకూలంగా 204మంది ఓటేయగా 85 మంది మాత్రమే వ్యతిరేకించారు. దీనితో ఆయన అభిశంసనకు గురై అధ్యక్ష అధికారాలను కోల్పోయారు. మరోవైపు అత్యవసరపరిస్థితి విదించిన నేపథ్యంలో దానిపై విచారణ చేసేందుకు దర్యాప్తు అదికారులు పలుసార్లు సమన్లుజారీచేసారు. వాటికి ఆయన స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించగా అరెస్టు వారంట్ జారీ అయింది. ఈ క్రమంలో తాజాగా ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.

## త్రివేణిసంగమంలో స్నానంచేస్తూ గుండెపోటుతో ఎన్సీపినేత మృతి

**ప్రయాగరాజ్, జనవరి 15:** మహాకుంభ్‌లో స్నానంచేస్తుండగా గుండెపోటు రావడంతో మహారాష్ట్ర మాజీ మేయర్ చనిపోయారు. షోలాపూర్ మాజీ మేయర్‌ఎన్సీపీ శరద్‌పవార్ వర్గం నాయకుడు మహేశ్‌కోతే ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద మహాకుంభ్‌లో స్నానం చేస్తుండగా గుండెపోటుతో మరణించారు. ఈ సమాచారం ఆతని కుటుంబసభ్యులు ధృవీకరించారు. మహేష్‌కోతే వయసు 60ఏళ్లు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో గంగా, యమున, సరస్వతి నది త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానంచేస్తుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కోతే ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలోకి స్నానంకోసం వెళ్లాడు..నది నీటిలోనే ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆయన్ను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడేఆయన చనిపోయినట్లు ప్రకటించారని ఆయన కుటుం బీకులు తెలిపారు. కోతే భౌతికకాయాన్ని దహన సంస్కారాలకోసం షోలాపూర్‌కు తరలించారు. కోతే నవంబరు 20ఎన్నికల్లో షోలాపూర్‌నార్త్ నుంచి బిజెపి అభ్యర్థి విజయ్ దేశ్‌ముఖ్‌పై పోటీచేసినప్పటికీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. కోతేకు భార్య కుమారుడున్నారు. ప్రయాగరాజ్‌లో విపరీతమైన చలి ఉంది. వివిధ అఖారాలకు చెందిన సాధువులు మకసంక్రాంతి సందర్భంగా మహాకుంభ్‌లో మొదటి అమృత స్నానం చేసారు.




శామీర్‌పేటలో తండ్రిని హత్య చేసిన కుమారుడు నర్సింహ్మాను అరెస్ట్ చేసిన శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, పాల్గొన్న ఎస్ఐలు

# తండ్రిని హత్య చేసిన కసాయి

### తల్లిపై సైతం దాడి, నిందితుడు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు: సిఐ శ్రీనాథ్

**శామీర్‌పేట, జనవరి 15, ప్రభాతవార్త:** శామీర్‌పేట గ్రామ పరిధిలోని పెద్దమ్మ కాలనీలో నివాసం ఉంటున్న హన్మంతు (50) హత్యకు గురయ్యాడు. శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ కథనం ప్రకారం శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీలో హన్మంతు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. హన్మంతు కుమారుడు నర్సింహ్మా (కొడుకు) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అతను వివాహితుడు అయినప్పటికీ భార్యతో తగాదాల కారణంగా విడిపోయి తల్లి, తండ్రితో కలిసి అద్దె గదిలో నివసిస్తున్నారు. నర్సింహ్మాకు మద్యం అలవాటు ఉన్నట్లు తెలిపారు. దీని కారణంగా అతను తరచుగా తల్లిదండ్రులపై దాడి చేయటం ప్రారంభించారన్నారు. ఈ నెల 14న సంక్రాంతి పండుగ రోజున మధ్యాహ్నం 3గంటల సమయంలో తల్లి, చెల్లి య దమ్మ అలియాస్ రాదమ్మ మధ్య చీరపై వివాదం జరిగిందన్నారు. ఈ వివాదంలో తల్లి అనుకోకుండ చేపల అక్వేరియంను తాకటంతో అది కిందపడి పగలి పోయింది. దీంతో మద్యం మత్తులో ఉన్న నర్సింహ్మా రోకలి కర్రతో తల్లిని పొట్టపై,కాళ్లపై బలంగా కొట్టినట్లు తెలిపారు. ఆమె కింద పడిపోవటంతో తండ్రి హన్మంతు ఈ ఘటనను ఆపేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నర్సింహ్మా చేసిన దాడిలో హన్మంతు తలపై రోకలి కర్రతో కొట్టాడు. హన్మంతు పారిపోవటానికి ప్రయత్నించగా నర్సింహ్మా ఇటుకను తీసుకొని తలపై బాదాడన్నారు. దీంతో హన్మంతుకు తీవ్రగాయాలవగా యాదమ్మ 108అంబులెన్స్‌కు సమాచారం అందించగా వైద్య సిబ్బంది పరిశీలించి హన్మంతు మృతిచెందినట్లు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. శామీర్‌పేట పోలీసులు నర్సింహ్మాను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రేమ వ్యవహారం: యువకుని ఇంటిపై పెట్రోల్ దాడి

### ఓ చిన్నారి సహా ఇద్దరికి తీవ్రగాయాలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి15 ప్రభాత వార్త:** ప్రేమ పేరుతో ఓ యువతి వెంట తిరుగుతున్న ఓ వ్యక్తి ఇంటిపై పెట్రోల్ దాడి చేసిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఈ దాడిలో పకి ్కంటి చిన్నారితో పాటు యువతిని ప్రేమిస్తున్న యువకుని తండ్రికి తీవ్ర గాయాలై య్యాయి. అల్వాల్ పోలీసులు, ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకులం ప్రాంతానికి చెందిన హేమలత, ప్రకాశ్ అనే దంపతుల కుమా రుడు ప్రదీప్‌తో గత కొన్ని నెలల నుంచి మచ్చ బొల్లారం ఎరుకుల బస్తీ గోపాల్ నగర్‌లో నివాసం ఉంటున్నారు.

అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో ప్రదీప్ తిరుగుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ యువతి బాబాయ్ నందకుమారు పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించాడు. ఆ యువతి బాబాయ్ మంగళవారం రాత్రి ఆగ్రహంతో ఇరువురి ప్రేమను విడదీసేందుకు ఆ యువతిని కొట్టడంతో పాటు ఆమెను ప్రేమిస్తున్న ప్రదీప్ ఇంటిపై పెట్రోల్‌తో దాడి చేయగా యువ కుడి తండ్రి ప్రకాశ్(60), తీవ్ర గాయాలపాలు కాగా పక్కింటికి దిలీప్‌కు చెందిన 4 సంవత ్సరాల కుమార్తె చాందినికి కూడా గాయాలై య్యాయి. పెట్రోల్ దాడిలో గాయపడ్డ యువకుని తండ్రి ప్రకాశ్‌ను చికిత ్సనిమిత ్తం గాంధీ ఆసు పత్రికి తరలించగా, పక్కింటి బాలిక చాందిని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత ్సపొందుతున్నది. ఈ ఘటనకు ప్రేమ వ్యవ హారమే కారణమని పోలీ సులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న అల్వాల్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పెట్రోల్ దాడిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# ఉద్యోగుల వయోపరిమితిని పెంచొద్దు

### సిఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయోపరిమితి 61 సంవత్సరాలు, 63 సంవత్సరాలు లేదా 65 ఏళ్ళకు పెంచాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కోరారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి బుధవారం ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. రాష్ట్రంలో 16 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక రోడ్లు మీద తిరుగుతున్నారని, వారి శక్తి యుక్తులు వృధా అవుతున్నాయని, ఇలాంటి తరుణంలో ఉద్యోగుల వయస్సు పెంచితే 40 వేలమంది ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని విచారం వ్యక్తం చేశారు. గతంలో సిఎం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కాని 70 వేల ఉద్యోగాలకు మించి దాటలేదని ఈ హామీ పూర్తికాకుండా ఇంకా ఉద్యోగ అవకాశాలు తగ్గిచడం న్యాయం కాదన్నారు. ఉద్యోగుల పదవి విరమణ వయస్సు పెంచితే ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతుందని, సీనియర్ ఉద్యోగుల వేతనం ఒక లక్ష నుంచి 3 లక్షల వరకు ఉంటుందని, రిటైర్ అయినవారి స్థానాలు భర్తీ చేస్తే కొత్తవారికి 40వేల నుంచి 60వేల వరకు వేతనం ఉంటుందని, రిటైర్ అయ్యే 40 వేల మంది స్థానాల్లో లక్షా 50వేల మందిని భర్తీ చేయవచ్చునని ఆయన సూచించారు.

# లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

### మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ కోసం రూ.5 వేలు లంచం

**మెట్పల్లి, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా మెట్పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిపోద్దిన్ బుధవారం పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది ద్వారా రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పీ రమణమూర్తి కి పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే బాధితుడు సుంకే విష్ణు, ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. పట్టణంలో ని సాయిరాం కాలనీలో ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుంకే విష్ణు అనే వ్యక్తి తన స్థలం బ్యాంక్ లో తనఖా పెట్టి రుణం తీసుకోవడానికి డిసెంబర్ 28న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మార్ట్ గేజ్ చేయించాడు.ఇట్టి డాక్యుమెంట్ తీసుకోవడానికి రిజిస్ట్రార్ అసిపోద్దిన్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేయగా డాక్యుమెంట్ అసిస్టెంట్ రైటర్ ఆర్మూర్ రవి ద్వారా రూ.5 వేలకు ఒప్పందం కుదిరింది.దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా..డబ్బులు చెల్లిస్తున్న సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి,అటెండర్, డాక్యుమెంట్ అసిస్టెంట్ రైటర్ లతో పాటు సబ్ రిజిస్ట్రార్ ఆసిఫోద్దిన్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు. లంచం తీసుకున్నట్లు కెమికల్ పరీక్షలో నిర్ధారణ



కాగా మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిఫోద్దీన్, ఔట్ సోర్సింగ్ అటెండర్ బాణోతు రవి కుమార్, డాక్యుమెంట్ అసిస్టెంట్ రైటర్ ఆర్మూర్ రవిని అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఏది ఏమైనా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది ద్వారా పై స్థాయి అధికారులకు చేతులు తడిపితేనే రిజిస్ట్రేషన్ చేస్తారని,లేదంటే డాక్యుమెంట్ లో ఇది లేదు, అదిలేదు అని కొర్రి పెడతారని జగమెరిగిన సత్యం.డాక్యుమెంట్‌లు సరిగాలేని వాటి రిజిస్ట్రేషన్ చేయాలంటే సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్న సమయంలో ఇంచార్జి బాధ్యతలు నిర్వ హించే అధికారికి రోజు వారి కంటే ఎక్కువ మొత్తం లో డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్‌కోసం వస్తాయని పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

# గొంతు కోసేసిన మాయదారి చైనా మాంజా

### తృటిలో తప్పిన పెను ప్రమాదం



**బీబీనగర్ జనవరి 15, ప్రభాతవార్త:** చైనా మాంజా ఎంత సులువుగా ఇతరుల పతంగులను తెంపి వేస్తుందో అంతే ఈజీగా మనుషుల మెడలు చేతులకు గాయాలు చేస్తాయి ఈ మాంజా కారణంగా మరణాలు సంభవించిన ఉదంతాలు ఎన్నో సంక్రాత్రి పండుగ అంటే గాలిపటాలు అని ఎంత సంబరపడిపోతారు వాటిని ఎగురవే యడానికి వినియోగించే మాంజ కారణంగా కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతోంది. కొం తమంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు తీవ్ర గాయాల పాలవుతున్నారు. ప్రభుత్వం నిషేధించిన పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసిన కొందరిలో మార్పు రావడం లేదు. తాజాగా హైదరాబాద్ వరంగల్ జాతీయ రహ దారిపై గల బీబీనగర్ కేంద్రంలోని ప్లై ఓవర్ బ్రిడ్జి పై భువనగిరి నుండి బోడుప్పల్ కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చెందిన యువకుడికి చైనా మాంజ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎయిమ్స్ ఆసుపత్రి తరలించి చికిత్స నిర్వ హించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్‌కు చెందిన దాసరి రాము తన మిత్రుడు భాస్కర్‌తో కలిసి బుధవారం భువనగిరికి సొంత పనుల నిమిత్తం వెళ్లి తిరిగి బోడుప్పల్ కు వెళ్తున్న సమయంలో బీబీనగర్ మండల కేంద్రం లోని ఫ్లైఓవర్ పై గాలిపటం కోసం కట్టిన చైనా మాంజా గొంతుకు తగలడంతో వెంటనే అప్ర మత్తమైన రాము చెయ్యి అడ్డంపెట్టిన చెయ్యితో పాటు మెడ కూడా తెగినట్లు తెలిపారు. గాయాలై రక్తం కారుతున్న యువకుడిని దగ్గరలో గల ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# కాళేశ్వర,ముక్తేశ్వర దేవాలయాభివృద్ధికి సహకరించండి

### రామగిరి కోటను టూరిజం హబ్‌గా మార్చండి: కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 15 ప్రభాతవార్త:** కాళేశ్వరం – మంథని–రామగిరిని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధ వారం కేంద్ర మంత్రిని కలిసి మంథని నియోజ కవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరి కోటను టూరిజం హాబ్‌గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రం అం దజేశారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి వెయ్యి సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందన్నారు. దేశంలో ఎక్కడా కనిపించని విధంగా గర్భగుడిలో రెండు శివలింగాలు పూజలందుకుంటున్నాయి. ఒకటి ముక్తేశ్వరునిది(శివుడు), మరొకటి కాళేశ్వరునిది(యముడు).ఏటా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది మేలో సరస్వతి పుష్క రాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 30 లక్షల నుంచి 40 లక్షల మంది ఇక్కడ పవిత్రస్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నాం. ఇక్కడే 2027లోనూ గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. అప్పుడు కోటి మందికి పైగా వచ్చే అవకాశముంది. సోమ్‌నాథ్, కేదార్‌నాథ్, మహాకాళేశ్వర్, అయో ధ్య, కాశీల మాదిరిగా ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హాబ్‌గా అభివృద్ధి చేయొచ్చు. ఇప్పటికే ఇందుకు సంబంధించి సమగ్ర ప్రణాళికను రూపొందించాం.దీని అమలుకు కేంద్రం సహకరించాలి. భక్తుల సౌకర్యార్థం పుష్కరాలు మొదలయ్యే నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రామగిరి కోటకు సుమారు 1200 ఏళ్ల చరిత్ర ఉంది. రామాయణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉందన్నారు. రాముడి ఆలయాలు, జల పాతాలు, ఎన్నో ఔషధమొక్కలు ఇక్కడున్నాయి. ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రానికి కావాల్సిన అన్ని ఆకర్షణలు ఇక్కడున్నాయి. ఈ కోటను సందర్శించేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తున్నారు. స్వదేశీదర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద ఈ కోటను మెగా టూరిజం హాబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసిన మంత్రి శ్రీధర్‌బాబు

# సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ పుట్టినిల్లు

### ప్రతి పండుగను ప్రతి యేటా జరపాలి : దేవరయాంజాల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 15, ప్రభాతవార్త:** సంస్కృతి, సంప్రదాయ (పండుగ)లకు తెలంగాణ పుట్టినిల్లు అని, సంక్రాంతి సంబరాలను ప్రజలు వైభవంగ ఘనంగ జరుపుకుంటారని, ప్రతి పండుగను, ప్రతి ఏటా ఘనంగ సాంప్రదాయాలతో జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ సూచించారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లో టిపిసిసి కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పతంగుల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. భోగి,సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని భోగి రోజున మహిళలకు, బాలికలకు ముగ్గుల పోటీలు, సంక్రాంతి రోజున యువతకు పతంగుల పోటీలను వారు నిర్వహించటం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగ టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని రైతులు, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగ జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల, మతాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పమన్నారు. సంక్రాంతి అంటేనే రంగోలి ముగ్గులు, పంతంగుల కోలాహలం అని అన్నారు. యువత చెడు మార్గాల్లో వెళ్లకుండ భావితరాలకు ఉపయోగపడే విధంగ ఉండాలని అన్నారు. రైతాంగానికి సంక్రాంతి పండుగ వెలుగును సంతోషాన్ని ఇస్తుందన్నారు. తాను చిన్న నాటి కాలంలో సంక్రాంతి పండుగకు ముందు నెల నుంచి పండుగ తరువాత మరో నెలపాటు పతంగులు ఎగురవేసేవారిమన్నారు. సంక్రాంతి పండుగ అంటే ముగ్గులు, పతంగుల పోటీలు, ఆటలకు ప్రత్యేకత అన్నారు. ప్రకృతిని కాపాడు కోవటానికి తెలంగాణ సాంప్రదాయ పండుగలను ఘనంగ జరుపుకోవాలన్నారు. హైదరాబాద్‌లోనూ తెలంగాణ సంస్కృతి సాంప్రయాదాయాల కోసం సంక్రాంతి సంబరాలు పతంగుల పోటీలు జరుపుకుంటున్నామన్నారు. ప్రకృతి ఆశీర్వదించాలంటే సంస్కృతి సాంప్రదాయ పండుగలను ఘనంగ జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఎస్.హరి వర్ధన్‌రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, టిపిసిసి కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మేడ్చల్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు కొలను హన్మంత్‌రెడ్డి, నర్సా రెడ్డి భూపతిరెడ్డి, అనిల్‌కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దేవరయాంజాల్‌లో సంక్రాంతి సందర్భంగా పతంగుల పోటీలను ప్రారంభించిన టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్,పాల్గొన్న నాయకులు

# ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

### దుకాణాల యాజమానులపై కేసు

### షెల్టర్ హోమ్‌కు బాలుర తరలింపు

**ఘట్‌కేసర్, జనవరి 15, ప్రభాతవార్త:** దుకాణాలలో బాలకార్మికుల చేత పని చేయిస్తున్న యాజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పట్టణంలో బుధవారం ఆపరేషన్ స్మైల్ భాగంగా స్మైల్ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ముగ్గురు మైనర్ బాలురు పని చేస్తుండగా రిస్క్యూ చేసి పని నుంచి విముక్తి కల్పించారు. ముగ్గురు బాలురను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరచగా వారిని షెల్టర్ హోమ్‌కు తరలించారని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దుకాణాలయాజమానులపై చైల్డ్ లేబర్, జువెనిల్ జస్టిస్ చట్టం ప్రకారం కేసు నమో దు చేసినట్లు తెలిపారు. మైనర్ బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి15:** కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై దాఖలైన పిటిషన్‌ను కొట్టి వేయాలంటూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కూనంనేని సాంబశివరావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్ కేసులో వాదనలు ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలంటూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2023 ఏడాది చివరిలో జరిగాయి. ఆ సమయంలో ఫారం 26 ఎన్నికల అఫిడవిట్‌లో సమగ్ర వివరాలు వెల్లడించలేదంటూ కొత్తగూడెంకు చెందిన నందూలాల్ అగర్వాల్ ఆరోపించారు. ఆ క్రమంలో కూనంనేని ఎన్నికను సవాల్ చేస్తూ.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కూనంనేని సాంబశివరావు.. ఎన్నికల రిట్నరింగ్ అధికారికి సమర్పించిన ఫారం 26 అఫిడవిట్‌లో తన భార్య పేరు పేర్కొనలేదన్నారు. అలాగే లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ రూపొందించలేదంటూ తన దాఖలు చేసిన పిటిషన్‌లో నందూలాల్ అగర్వాల్ స్పష్టం చేశారు. కాగా, నందూలాల్ వేసిన పిటిషన్‌ను క్వాష్ చేయాలంటూ తొలుత తెలంగాణ హైకోర్టును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆశ్రయించారు. కానీ నందులాల్ పిటిషన్‌ను క్వాష్ చేయడానికి తెలంగాణ హైకోర్టు నిరా కరించింది. దీంతోకూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు.అక్కడ సైతం సుప్రీంకోర్టు తాజా తీర్పుతో కూనంనేని సాంబశివరావుకు నిరాశే మిగిలింది.

### ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో

# భారీ అగ్ని ప్రమాదం

### రూ. 35 నుంచి 40 లక్షల వరకు నష్టం

### అగ్నికి ఆహుతైన 800 నుంచి 1000 బస్తాలకు పైగా పత్తి..!

### సత్వర చర్యల కోసం అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మార్కెట్ అధికారులు

**ఖమ్మం ప్రభాతవార్త ప్రత్యేక ప్రతినిధి:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు ఎనిమిది వందల నుంచి వెయ్యి బస్తాలకు పైగా పత్తి అగ్నికి ఆహుతి అయినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి.. కాగా మార్కెట్ అధికారులు మాత్రం 150 బస్తాలకు పైగా పూర్తిగా కాలిపోయాయని ,మరికొన్ని బస్తాలు డామేజ్ అయినట్లు పేర్కొన్నారు.. నష్టం జరిగిన అంశంలో ఇటు పత్తి స్టాకు పెట్టుకున్న వ్యాపారులు ఎనిమిది వందల నుంచి వెయ్యి బస్తాలకు పైగా కాలిపోయాయి అని వివరించగా, అధికారుల అంచనా మరో విధంగా ఉంది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ సహకార గిడ్డంగుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.** ఖమ్మం వ్యవసాయ పత్తి యార్డులో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మణికంఠ ట్రేడర్స్, శ్రీరామ ట్రేడర్స్ లకు చెందిన పత్తి బస్తాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సాయంత్రం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్తో అగ్నిప్రమాదం సంభవించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మణికంఠ ట్రేడర్స్ యజమాని పాండు కు సంబంధించి 850 బస్తాలు, శ్రీరామ ట్రేడర్స్ కు చెందిన యజమాని శ్రీరామ శ్రీను కు సంబంధించిన 510 బస్తాలు పత్తి గతవారం కొనుగోలు చేసి మార్కెట్లో నెట్ వేసి ఉంచారు . ఇద్దరు వ్యాపారుల వి కలిపి 1300 బస్తాలు పత్తి మార్కెట్లో స్టాకు ఉండగా ఆ పత్తిలాటుకు మంటలు అంటుకొని పెద్ద ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. సమాచారం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు అక్కడికి తక్షణమే చేరుకున్నారు అదేవిధంగా రెండు అగ్ని మాపక వాహనాలు అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అంతకుముందే మార్కెట్లో పనిచేసే మార్కెట్ సూపర్వైజర్లు పాషా , ప్రసాద్ తదితర సిబ్బంది అక్కడికి చేరుకొని చుట్టుపట్టు ఉన్నటువంటి హమాలీలు ప్రజలు దాదాపు 200 బస్తాలకు పైగా మంటలనుంచి గుంజి బయట వేసినట్టు శ్రీరామ ట్రేడర్స్ యజమాని శ్రీరామ శ్రీను ప్రభాతవార్తకు వివరించారు. మార్కెట్ గ్రేడ్ 2 గ్రేడ్ అధికారి మార్కెట్ అధికారి ఆంజనేయులు, తర సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం 150 బస్తాలకు పైగా పత్తి పూర్తిగా కాలిపోయిందని మరికొన్ని బస్తాలు అయ్యాయి.

**అధికారుల లెక్క కరెక్ట్ కాదు వ్యాపారులు....** అగ్నిప్రమాదంలో కాలిపోయిన పత్తి బస్తాల విషయంలో అధికారులు చెబుతున్న అంచనా సంఖ్య కరెక్టు కాదని కాలిపోయిన పత్తికి ఓనర్లు అయిన వ్యాపారులు తెలిపారు. మణికంఠ ట్రేడర్స్ ,శ్రీరామ ట్రేడర్స్ ఇద్దరివి కలిపి 1300 బస్తాలు అక్కడ లాట్ పెట్టినట్టు వారు తెలిపారు . అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత ఆ మంటల్లో నుంచి సురక్షితంగా మార్కెట్ సూపర్వైజర్లు హమాలీలు చుట్టుపక్కల ప్రజలు కలిసి దాదాపు 200 బస్తాలు మాత్రమే బయటికి తీయగలిగారని బయటికి తీసిన బస్తాలన్నిటినీ లెక్క వేస్తే అంచనా పై స్పష్టత వస్తుందని వారు ప్రభాత వార్తకు తెలిపారు. దాదాపు 1000 బస్తాలకు పైగా నష్టం వాటిలిందని వారు పేర్కొంటున్నారు.

**రూ. 35 నుంచి 40 లక్షల నష్టం వాటిల్లింది**

మంటల్లో కాలిపోయిన పత్తి విలువ దాదాపు 35 నుంచి 45 లక్షల రూపాయల మధ్య ఉంటుందని శ్రీరాము శ్రీనివాస్ తెలిపారు. కాలిపోయిన పత్తిలో మణికంఠ ట్రేడర్స్ పాండుకు చెందినదే అత్యధికమని ఆయన తెలిపారు.



అగ్నికి ఆహుతవుతున్న పత్తి బస్తాలు

**మార్కెట్ ఇన్సూరెన్స్ వస్తుందా...!** సహజంగానే వ్యవసాయం మార్కెట్లో ఉన్న వ్యాపారులకు సంబంధించిన స్టాకు కాని, రైతులకు సంబంధించిన స్టాకు గాని ప్రమాదం జరిగి పంట నష్టం జరిగినప్పుడు మార్కెట్ ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం పొందవచ్చు. ప్రస్తుతం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పత్తి ట్రేడర్స్ కొనుగోలు చేసి సంక్రాంతి పండుగ సందర్భంగా వరుసగా సెలవులు ఉండటంతో వేరే మార్కెట్ కు ఇక్కడ నుండి ఎగుమతి చేసుకునే అవకాశం లేక ఇక్కడ పెట్టుకున్నందున ఈ మొత్తం నష్ట నష్టానికి మార్కెట్ ఇన్సూరెన్స్ ద్వారా క్లీన్ అవుతుందని వ్యాపారులు అంటున్నారు కాకపోతే కాలిపోయిన పత్తి నూరు శాతం విలువను క్లైమ్ చేస్తారో లేదో కానీ మొత్తం మీద ఇన్సూరెన్స్ వస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇంతకంటే పెద్ద ప్రమాదం జరిగి దాదాపు 1000 బస్తాల వరకు పత్తి దగ్ధమైన విషయం తెలిసిందే. ఆ పత్తికి సంబంధించి మార్కెట్ ఇన్సూరెన్స్ క్లైయిమ్ అయిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద కనుమ పండుగ రోజు అందరూ సంతోషంగా సంబరాల్లో ఉన్న సందర్భంలో మార్కెట్లో అంటుకున్న మంటలు ఆ ప్రాంతంలో కలకలం రేపాయి.

# మాంజా తగిలి పలువురికి గాయాలు



**కొత్తగూడెం టౌన్, జన వరి 15, ప్రభాతవార్త:** చైనా మాంజానా.. మజాకానా అంటూ అందరినీ హడలెత్తిస్తోంది.నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు పదిమంది వరకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా బుధవారం కొత్తగూడెం విద్యానగర్‌కాలనీ బైపాస్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న వారికి పతంగి మాంజ తగిలింది. దీంతోబైక్‌పై వెళ్తున్న పాల్వంచకు చెందిన భూక్యానవీన్, సుప్రజా దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. అదేవిధంగా కొత్తగూడెంపట్టణంలోని సింగరేణిమైదానం చిల్డ్రన్స్‌పార్కు మధ్య ద్విచక్రవా హనంపై వెళ్తున్న యువకుడికాలికి చైనా మాంజా తగిలి తీవ్ర గాయమైంది. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు. చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేసినా వ్యాపారస్తుల తీరుమాత్రం మారడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పథకాల

# లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

### అర్హులైన వారిని గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలి: జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో సి.ఎస్ శాంతి కుమారి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి15:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ఈనెల 21వ తేదీ నుండి నిర్వహించే గ్రామ సభలలో ఆమోదం పొందాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26వ తేదీన ప్రారంభించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తగు కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ నాలుగు ప్రతిష్టాత్మక పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవిన్యూ శాఖ ద్వారా వ్యవసాయ



శాఖకు పంపడం జరిగిందని, సాగుయోగ్యంకాని భూములను క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించాలని అన్నారు. సంయుక్త సందర్శనలు నిర్వహించి, గ్రామ సభల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు ప్రదర్శించి, చదివి వినిపించి ఆమోదం పొందాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి, ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాల జాబితాను, గ్రామ సభల్లో ప్రకటించి ఆమోదం పొందాలని సి.ఎస్ తెలిపారు. రేషన్ కార్డుల మంజూరీకై రూపొందించిన లబ్ధిదారుల ముసాయిదా జాబితా గ్రామసభల్లో ఆమోదం పొందాలన్నారు. ఇదేవిధంగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాల ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారుల ముసాయిదా జాబితా ను గ్రామాలలో ప్రదర్శించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీల వారిగా పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారిగా సభలు నిర్వహించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, లబ్ధిదారుల జాబితా ఎంపిక, డాటా ఎంట్రీ, క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీహెచ్ ఎంసీ కమీషనర్‌ను ఆదేశించారు. ఇప్పటివరకు, ఈ నాలుగు పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ముసాయిదా జాబితా తయారీ, డేటా ఎంట్రీ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు చేసిన ప్రత్యేక శ్రద్ధని సిఎస్ అభినందించారు. ఈ నాలుగు పథకాల అమలుకై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అనుగుణంగా అమలయ్యేలా సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని సిఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డిఎస్ చౌహాన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసి కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 5 వేల మంది రైతులకు వెదురు సాగు

**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెదురు సాగును ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో భాగంగా 5 వేల మంది రైతులకు అవకాశం కల్పిం చనుంది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే 4 ఏళ్లలో 7లక్షల ఎకరాల్లో సాగు చేయడం ద్వారా 75వేల మంది రైతులకు ఉపాధి కల్పించాలని భావిస్తోంది. ప్రధానంగా రాష్ట్రంలోని భద్రాద్రి, కొత్తగూడెం, ములుగు,భూపాలపల్లి, నాగర్ కర్నూల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో వెదురు సాగు చేపట్టాలని నిర్ణయించింది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి జిల్లాను ఎంపిక చేశారు. ఇం దుకయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనున్నట్లు సమాచారం. వెదురు సాగు కు తొలుత 5వేల మంది రైతులను ప్రభుత్వం ఎంపిక చేయనున్నట్లు తెలు స్తోంది. నర్సరీల్లో మొక్కల్ని పెంచి రైతులకు పంపిణీ చేయనుంది. ఎకరంలో 60 మొక్కల్ని నాటుతారు. 30ఏళ్ల వరకూ సాగు చేసుకోవచ్చు. ఎకరాకు 20 వేల రూపాయల పెట్టుబడితో ఏడాదికి 40వేల రూపాయల నుండి 60 వేల రూపాయల వరకూ ఆదాయం వచ్చే ఛాన్సుంది. వెదురు వస్తువులకు, వెదురు నుంచి తీసే ఇథనాల్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో దీని సాగును ప్రోత్సహించాలని సర్కార్ నిర్ణయించింది.



## ఆస్ట్రేలియాలో క్రీడా అధికార బృందం పర్యటన

### అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తెలంగాణలో మౌలిక క్రీడా సదుపాయాల ఏర్పాటు లక్ష్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి15:** తెలంగాణలో క్రీడాభివృద్ధిని వేగవంతం చేయడానికి, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలు, శిక్షణ కేంద్రాలను తీర్చిదిద్దడానికి తెలంగాణ అధికార ప్రతినిధి బృందం ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్స్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాలు జితేందర్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి (క్రీడలు) జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి ఇతరులు ఉన్నారు.క్వీన్‌లాండ్స్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్, పాప్యులస్ కార్యాలయాలను ఆస్ట్రేలియాలోని ప్రముఖ యూనివర్సిటీలో ఒకటైన యూనివర్సిటీ అఫ్ క్వీన్స్‌లాండ్స్‌లను గ్రిఫీత్ యూనివర్సిటీ నథన్‌ను తెలంగాణ క్రీడా అధికార ప్రతినిధి బృందం సందర్శించింది. తెలంగాణ ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇతర శిక్షణ కేంద్రాలన్నింటినీ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు, క్రీడా సదుపాయాల రూపకల్పన నిర్మాణ నిర్వహణలో ఆధునిక దూరంలో ప్రమాణాలపై నీ బృందం అధ్యయనం చేస్తుంది. క్రీడలతోపాటు విద్యలలో సమతుల్యం సాధించేందుకు, క్రీడా సంబంధిత పరిశోధనలు విద్యా కార్యక్రమాలను ఒలంపిక్ పతక విజేతలను సృష్టించడంలో మెరుగైన పద్ధతులను అవలంబించేందుకు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ క్వీన్స్‌ల్యాండ్ ఉన్న ఈ సంస్థల కార్యక్రమాలను ఈ బృందం అధ్యయనంచేస్తుంది. ఈ ప్రతినిధి బృందానికి తోడుగా మరో ముగ్గురు ప్రతినిధులు, స్పోర్ట్స్అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, శాసనమండలి సభ్యులు, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ హాకీ అసోసియేషన్ చైర్మన్, మైనార్టీ విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఫయీమ్ ఖురేషి ఢిల్లీ నుంచి ఆస్ట్రేలియాకు పయనమయ్యారు. 23వతేదీ వరకు ఈ బృందం ఆస్ట్రేలియాలోని పలువిశ్వవిద్యాలయాలు క్రీడా విశ్వవిద్యాలయాలు, వివిధ స్టేడియాలు సందర్శించనున్నారు.ఆధునిక పరిశోధనలు ఆవిష్కరణలు వివిధ కార్యక్రమాల వివరాలు, తెలంగాణ క్రీడ అభివృద్ధికి దోహదం చేసే వివిధ కార్యక్రమాల రూపకల్పన తదితర అంశాలపై రాష్ట్ర క్రీడా అధికార బృందం పరిశీలించనుంది.

# ఉచితంగా 'సూర్యఘర్ యోజన'

### హెల్దీ, వెల్దీ, హ్యాపీ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం, ఇంటింటికి పైప్‌లైన్‌తో గ్యాస్ సరఫరా

### సోలార్ విద్యుత్ వ్యవస్థవైపు అంతా మారుదాం, ప్రతి సంక్రాంతికి ఇదే విధంగా సొంతూరికి వస్తా: ఏపి సిఎం చంద్రబాబు

**చంద్రగిరి, జనవరి 15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్) పథకం ఆంధ్రప్రదేశ్‌లో ఉచితంగా అందిస్తామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంక్రాంతి సంబరాలకు సొంతూరు నారావారిపల్లికి విచ్చేసిన ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఆయన తన సతీమణి నారా భువనేశ్వరి 25 ఏళ్ల క్రితం సంక్రాంతికి నారావారిపల్లి రావడం ప్రారంభినట్లు తెలిపారు. అప్పట్లో పెద్దగా ఎవ్వరూ పట్టించుకోలేదనీ, గత కొన్నేళ్లుగా ఈ సంప్రదా యాన్ని ప్రజలు పాటిస్తూ దేశ విదేశాల నుండి సైతం తమ పల్లెకు చేరుకుని సుఖసంతోషాల నడుమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోలార్ విద్యుత్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కలెక్టర్ స్థాయి నుండి క్షేత్ర స్థాయిలోని అధికారుల వరకు అందరిపైవుందన్నారు. సూర్యఘర్ యోజన పథకం మొదటి ప్రాధాన్యత ఎస్సీ,ఎస్టీలకే అన్నారు. లబ్దిదారులు తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు 3 కిలో వాట్స్‌పై కేంద్రం 70 వేలు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. అయితే సదరు మొత్తాన్ని భరించలేని వారి నివాసాలపై ప్రభుత్వమే సోలార్ వ్యవస్థను చేస్తుందని అన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి అయ్యే ఖర్చును సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ లబ్దిదారుల గృహ అవస రాలకు సరిపోగా మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.80 వంతున కొనుగోలు చేస్తుందన్నారు. ఆ మేరకు సోలార్ ఏర్పాటుకు అయిన ఖర్చును పూర్తిగా వసూలు చేసుకున్న అనంతరం గృహ యజమానులకు అందించడం జరుగుతుందన్నారు. హెల్తీ (ఆరోగ్యం), వెల్తీ (సంపద), హ్యాపీ (సంతోషం) ఇదే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందు సాగుతున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌లో సంపదను సృష్టించి సమాజంలో సంతోషాలను నింపడమే ఎన్‌డిఏ ప్రభుత్వ ప్రాధాన్యతలుగా వివరించారు. రాష్ట్రంలో మొదటసారి దీపం పథకంలో గ్యాస్ సిలెండర్ అందించిన తాను ప్రస్తుతం దీపం-2 ద్వారా ఏడాది 3 సిలెండర్లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇంటింటికీ పైప్ లైన్ ద్వారా (విద్యుత్ సరఫరా తరహాలో) గ్యాస్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో రూ.6700 కోట్లు బకాయిలను చెల్లించినట్లు తెలిపారు. నేటితరం యువతలో ఆసాధారణ శక్తి సామర్ధ్యాలు కలిగివున్నందున విజన్-2047 రూపొందించడం జరిగిందన్నారు.అయితే ప్రపంచ స్థాయిలో యువత శాతాన్ని పరిశీలిస్తే నానాటికీ దిగజారిపోతున్నట్లు తెలిపారు. వృద్ధుల శాతం అధికం కావడంతో కొన్ని దేశాలు యువత కోసం మనదేశం వైపు చూస్తున్నట్లు తెలిపారు. గతంలో తాను ఇద్దరు పిల్లలు ముద్దు అన్నాననీ, అయితే



నారావారిపల్లెలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏపి సిఎం చంద్రబాబు

మారుతున్న కాలానికి అనుగుణంగా కనీసం ప్రతి కుటుంబంలో ముగ్గురు, నలుగురు పిల్లలు వుండే విధంగా ప్రయోజనాలను కల్పించనున్నట్లు తెలిపారు. కేవలం 6 మాసాలలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాధితులకు రూ.125 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో పాటు జవాబుదారీ తనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ల పంపిణీపై ప్రతిపక్ష వైసిపి విమర్శలకు స్పందిస్తూ దేశంలో మరి ఏ ఇరత రాష్ట్రంలో అందజేయనంతటి మొత్తాన్ని మన రాష్ట్రంలో అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు ఏ సమయంలో, ఎవరు ఎక్కడ పించన్ అందజేసిందీ వివరాలను అందించే విధంగా తమ పాలన సాగుతున్నట్లు తెలిపారు. కుప్పం, నారావారిపల్లిలో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్రం మొత్తం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18న వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తద్వారా 150 సేవలను ఆన్‌లైన్‌లో పెడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఏలు పులివర్తి నాని, మురళీమోహన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ రవి నాయుడు, తుడా మాజీ చైర్మన్ నరశింహ యాదవ్ పాల్గొన్నారు.

## అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్

### వినియోగం పెరుగుదలతో అప్రమత్తంగా ఉండండి ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్



**హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో సిఎండి కృష్ణభాస్కర్ సూచించారు. ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో అధిక డిమాండ్ ఉన్న ఐటీ కారిడార్ ప్రాంతాలకు సేవలు అందిస్తున్న 400కెవి రాయదుర్గం సబ్‌స్టేషన్, 220 కెవి గచ్చిబౌలి సబ్ స్టేషన్‌లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ 33 కెవి ఫీడర్‌లో విద్యుత్ సరఫరా స్థితిని నిశితంగా పర్యవేక్షించాలని చెప్పారు. అన్ని సర్కిళ్ల పరిధిలోనూ విద్యుత్ నిర్వహణ పనులను సకాలంలో అమలు చేయడానికి తగినంత మెటీరియల్ స్టాక్‌లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి సమస్య తలెత్తినప్పుడు వెంటనే వాటిని సరిదిద్దేందుకు తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత లోపాలను సరిదిద్దడంలో బాధ్యతాయుతంగా తగిన విధంగా పరిష్కరించాలని తెలిపారు. అన్ని నిర్మాణ మరియు ఆపరేషన్ నిర్వహణ పనులను సకాలంలో అమలు చేయడానికి తగినంత మెటీరియల్ స్టాక్‌లను ఉంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అంతేకాకుండా ఏదైనా అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ట్రాన్స్‌ఫార్మర్లు, సిటి, పిటిలు, ఇన్సులేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు మొదలైన పరికరాల తగినంత రోలింగ్ స్టాక్‌ను నిర్ధారించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సమయంలో, అన్ని ఫీల్డ్ ఇంజనీర్లు తమ ప్రధాన కార్యాలయంలోనే ఉండి, రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన మరియు నమ్మదగిన విద్యుత్ సరఫరాను నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తూనే ఉండాలని చెప్పారు. ప్రధానంగా హైదరాబాద్‌లో కరెంట్ వినియోగం పెరుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా సరఫరాను చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

# ఏదారి చూసినా 'ఏకాదశ రుద్రు'లే..

### ఎపిలో ప్రభల తీర్థానికి పోటెత్తిన జనం, జాతీయ స్థాయి గుర్తింపుతో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, జగ్గన్నతోట, గంగవరం, వాకలగరవులో భారీ ఏర్పాట్లు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , జనవరి 15, ప్రభాతవార్త:** పచ్చటి తివాచీ పరిచినట్లు వరిచేలు, ఒంపులు తిరిగి గలగలా పారే కౌశికనదీ పాయతో పాటు పిల్ల కాలువలు, ఏపుగా పెరిగిన కొబ్బరి చెట్లు నడుమ ఎటు చూసినా జన సందోహం. ఏ రహదారి చూసిన తీర్థం వైపే పయనం. ఏకాదశ రుద్రులు ఒకే చోట కొలువైన ప్రదేశాన్ని భక్తి పూర్వకంగా తిలకించేందుకు ఆరాటం. గలగల పారే కౌశిక నదీ పాయలో పీకల్లోతు నీటిలో తేలియాడుతూ గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం రుద్ర ప్రభలను మోసుకొస్తున్న దృశ్యాలను చూడాలనే ఆత్రుత. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోటలో జరిగే ప్రభల మహోత్సవం, తీర్థమును వీక్షి ంచడం అదృష్టంగా భావిస్తారు. పురాతన చరిత్రతో పాటు ఇటీవల జాతీయస్థాయి గుర్తింపు రావడంతో జగ్గన్నతోట ఏకాదశరుద్రులు ప్రభల మహోత్సవం,తీర్థంను ప్రత్యక్షంగా తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని కనుమనాడు నిర్వహించిన జగ్గన్నతోట, సాకుర్రు గున్నేపల్లి సెంటర్, చిరతపూడి డాము సెంటర్‌లో బుధవారం జరి గిన ప్రభల తీర్థాలు అత్యంత వైభవంగా జరిగాయి. అంబాజీపేట మండలంలోని మొసలపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోటలో నిర్వహించిన ప్రభల తీర్థ మహోత్సవం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. సుదూర ప్రాంతాలనుండి వేలాది మంది భక్తులు తరలిరాగా ఒకే చోట కొలువైన ఏకాదశరుద్రులను ఒకసారి దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు విచ్చేసారు.



జగ్గన్నతోట ప్రాంతంలో పెద్దఎత్తున జరిగిన ప్రభల ఊరేగింపు దృశ్యం

**జాతీయ ఖ్యాతినార్జించిన ఏకాదశరుద్రుల ప్రభల మహోత్సవం :** తతనాలుగున్నర శతాబ్దాల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రుల ప్రభల మహోత్సవానికి జాతీయ గుర్తింపులభించడంతో ప్రభల మహోత్సవంను, తీర్థాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో రెండేళ్ల క్రితం ప్రదర్శించిన ఏపీ రాష్ట్ర శకటాలలో ఏకాదశ రుద్రుల ప్రభను ప్రదర్శించడంతో జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచంలో నలుమూలలలో ఉన్న తెలుగువారు సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని కనుమనాడు ఒకే చోట కొలువయ్యే ఏకాదశ రుద్రులను ప్రత్యక్షంగా దర్శించుకునేందుకు తరలివచ్చారు.

**జగ్గన్నతోటలో కొలువుదీరిన ఏకాదశరుద్రులు వీరే..**

మొసలపల్లి మధుమాసంత భోగేశ్వరస్వామి, ఇరుసుమండ ఆనంద రామేశ్వరస్వామి, ముక్కామలరాఘవేశ్వర స్వామి,వక్కలంకకాశీ విశ్వేశ్వర స్వామి, వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వర స్వామి,పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వర స్వామి, కె.పెదపూడిమేనకేశ్వరస్వామి, గంగలకుర్రుచెన్న మల్లేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, పాలగుమ్మిచెన్నమల్లేశ్వరస్వామి, నేదునూరుచెన్నమల్లేశ్వర స్వామి వార్లు కొలువుదీరారు.

**జిల్లాలోని అత్యంత ఎత్తు, బరువైన ప్రభలు :**

ప్రభల తీర్థ మహోత్సవాల్లో ముఖ్యంగా తొండవరం శ్రీ ఉమా తొండేశ్వరస్వామి (56 అడుగులు ఎత్తు), వాకలగరువు శ్రీ ఉమా పార్వతీ సోమేశ్వర స్వామి (54 అడుగులు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అత్యంత ఎత్తైన, బరువైన ప్రభలుగా గుర్తింపబడ్డాయి.

## తెలంగాణ ఇన్ సర్వీస్ వైద్యులకు సుప్రీంకోర్టులో ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి15:** తెలంగాణ స్థానికత కలిగి గతంలో తెలంగాణ రాష్ట్రం బయట ఎంబిబిఎస్ పూర్తిచేసిన ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ వైద్య విద్యఅడ్మిషన్లలో అవకాశం కల్పించాల్సిందిగా బుధవారం సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్ సర్వీస్ వైద్యుల తరఫున అడ్వకేట్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ తెలంగాణ స్థానిక కలిగి గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా కేవలం ఎంబిబిఎస్ చదువు మాత్రమే తెలంగాణ బయట పూర్తి చేసి తిరిగి సొంత రాష్ట్రంలో సుదీర్ఘకాలం కాంట్రాక్ట్ వైద్యులుగా సేవలందిస్తూ తెలంగాణ స్థానికత ఆధారంగా రెగ్యులర్ ప్రభుత్వ సర్వీసులో చేరి సుమారు 6 నుంచి 10 సంవత్సరాల కాలం పాటు తెలంగాణ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు.

ఈ నేపథ్యంలో వారికి ఇన్ సర్వీస్ లో పీజీ చేసే అర్హత వారికి ఉందని వాదనలు వినిపించారు.వాదనల అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఇన్ సర్వీస్ వైద్యుల అభ్యర్థనకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే అభ్యర్థులకు పీజీ అడ్మిషన్లలో అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచనలు చేసింది. అందుకు ప్రభుత్వ తరఫున లాయర్లు కూడా సుముఖత వ్యక్తం చేసి తెలంగాణ ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ అడ్మిషన్లలో అవకాశం కల్పిస్తామని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ముందు ఒప్పుకున్నారు. ఎట్టకేలకు సుప్రీంకోర్టులో న్యాయం జరిగినందుకు ఇన్ సర్వీస్ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు.

# సుప్రీం కోర్టులో ఎపి సిఎంకు ఊరట

### గత ప్రభుత్వం వేసిన పిటిషన్ కొట్టివేత

**విజయవాడ,జనవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీం కోర్టులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టి వేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు తెలిపారు. ఛార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్ర బాబుకు సుప్రీంకోర్టు సూచించింది.

2023 నవంబర్‌లో చంద్రబాబుకు ఎపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్‌ను రద్దు చేయాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఈరోజు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది.

అయితే ఈ కేసులో ఎపి హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని జర్నలిస్టు ఇంప్లీడ్ పిటిషన్ వేయగా.. దాన్ని కొట్టివేస్తూ జర్నలిస్టుపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ కేసుకు మీకు సంబంధం ఏంటి... మీరెందుకు ఇందులో జోక్యం చేసుకున్నారు అంటూ జర్నలిస్టును కోర్టు మందలించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీం కోర్టు సమర్థించింది. ఆ బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఎపి స్కిల్ కేసుకు సంబంధించి గత ప్రభుత్వం మాజీ సిఎం హోదాలో ఉన్న చంద్రబాబుపై కేసు బనాయించి జైలుకు కూడా పంపించింది. ఆనాటి నుంచి కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి గతంలో చంద్రబాబుకు ఎపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరుగాయి.

స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరిగిందని అప్పటి సర్కార్ పేర్కొనలేదు. కావాలని కుట్ర పూరితంగా రాజకీయ కక్షలో భాగంగా చంద్రబాబుపై అవినీతి కేసును మోపింది. అక్రమ కేసును పెట్టి మరీ చంద్రబాబును జైలుకు తరలించారు.

ఇదే పిటిషన్‌ను విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా సుప్రీం కోర్టు కొట్టివేసింది.

## సంక్రాంతి తర్వాత తిరుగు పయనమైన పల్లెవాసులు

### విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి15:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టారు. ఉత్సాహంగా గతవారం ఊళ్లకు బయలుదేరిన పల్లెవాసులు, సంక్రాంతిని ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో జరుపుకుని తమ ఉద్యోగాల రిత్యా తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ క్రమంగా పెరిగింది. నల్గొండ జిల్లాలోని చౌటుప్పల్ దగ్గర పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. మెల్లగా రద్దీ పెరుగుతుండటంతో 12 టోల్ బూత్‌ల ద్వారా ఏపీ నుంచి తెలంగాణకు వాహనాలను హైదరాబాద్ వైపుగా పంపుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం రద్దీ తీవ్రంగా ఉంటుందని అక్కడి ట్రాఫిక్ పోలీసులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

# 'సంక్రాంతికి వస్తున్నాం' సక్సెస్ మీట్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పొంగల్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మించారు. మీనాక్షిచౌదరి,



ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటించారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో చార్ట్ బస్టర్ మ్యూజిక్ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అందరినీ అలరించి పొంగల్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. సక్సెస్ మీట్‌లో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. హ్యాపీ సంక్రాంతి టు ఆల్ అఫ్ యూ. ఈ సంక్రాంతి మా సంక్రాంతికి వస్తున్నాం సినిమాని ఇంత బాగా రిసీవ్ చేసుకున్న ఆడియన్స్, ఫ్యాన్స్‌కి మనస్ఫూర్తిగా థాంక్ యూ. నేను ఫ్యామిలీ సినిమా చేసిన ప్రతిసారి ఆడియన్స్ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేయడం, వారిలో నవ్వులు చూడటం డిఫరెంట్ కైండ్ అఫ్ ఎమోషన్. సినిమాకి ప్రతి థియేటర్ నుంచి ఫెంటాస్టిక్ రెస్పాన్స్ వస్తోంది. రియాక్షన్స్ అన్నీ జెన్యూన్‌గా వున్నాయి. మేము మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే దిగాం. సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం, అదే రోజున వచ్చి ఇంత పెద్ద హిట్ అయినందుకు చాలా ఆనందంగా వుంది. అనిల్ నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇవ్వడం ఆనందంగా వుంది. ఇది తన కెరీర్ లో కూడా బిగ్ బ్లాక్ బస్టర్. దిల్ రాజు, శిరీష్‌కు ఇది మరో బిగ్ హిట్. ఐశ్వర్య, మీనాక్షి టీం అందరి విషయంలో చాలా ఆనందంగా వున్నాను. అందరికీ చాలా థాంక్స్ అన్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ, బెసికలీ టెక్నికలీ కలర్ ఫుల్లీ హౌస్ ఫుల్లీ ఇట్స్ ఏ బ్లాక్ బస్టర్ పొంగల్ (నవ్వుతూ) తెలుగు ప్రేక్షకులందరికీ బిగ్ థాంక్స్. బెనిఫిట్ షోలకి ఫ్యాన్స్ యూత్ వెళ్తుంటారు. ఫస్ట్ టైం ఉదయం నాలుగున్నర షోలకి కూడా ఫ్యామిలీ ఆడియన్స్ రావడం ఈ సినిమా ద్వారా బిగ్గెస్ట్ అచీవ్మెంట్ మాకు. థియేటర్లో ప్యాక్డ్‌గా ఫ్యామిలీ ఆడియన్స్ వున్నారు. మాకు ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్స్. బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ తీసుకున్నాం. పండగ రోజులు ఇంకా అద్భుతంగా వుంటుంది. వెంకటేష్‌కి ఫ్యామిలీస్‌లో ఉన్న ఫుల్ ఏమిటో మనందరికీ తెలుసు. ఈసారి కరెక్ట్‌గా పొంగల్‌కి కుదిరింది, ఇది వెంకీ సార్ పొంగల్. మా సినిమాని సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా థాంక్ యూఅన్నారు

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. నిన్నటి నుంచి ఈ సినిమాకి వస్తున్న వైబ్ మాకు అర్థమైయింది. ముందుగానే షోస్ యాడ్ అవుతూవెళ్ళాయి. ఆడియన్స్ సినిమా చూడాలని ఫిక్స్ అయ్యారని తెలిసింది. అమెరికా నుంచి అమలాపురం, ఆస్ట్రేలియా నుంచి అనకాపల్లి.. ఇలా షోలు పూర్తయిన వెంటనే బ్లాక్ బస్టర్ పొంగల్ అనే రిపోర్ట్స్ వచ్చేశాయి. సినిమాలో నాన్ స్టాప్‌గా నవ్వులు ఎంజాయ్ చేస్తున్నారు.

# 'రాజా సాబ్' నుంచి ప్రభాస్ న్యూ పోస్టర్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్న క్రేజీ మూవీ రాజా సాబ్. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో రాజా సాబ్ సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండటంతో ఈ సినిమా మీద అందరిలో క్యూరియాసిటీ ఏర్పడుతోంది. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాజా సాబ్ సినిమా నుంచి శుభాకాంక్షలు చెబుతూ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. పండుగ కళ కనిపిస్తున్న ఈ పోస్టర్‌లో ప్రభాస్ లుక్ ఆకట్టు కుంటోంది. సూపర్ హిట్ సినిమాలు నిర్మిస్తున్న ప్రెస్టీజియస్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రాజా సాబ్ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో ఎక్కడా రాజీపడకుండా గ్రాండ్‌గా ప్రొడ్యూస్ చేస్తోంది. రాజా



సాబ్ సినిమాను అందరికీ గుర్తుండిపోయేలా రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమా త్వరలో పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీలో గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రస్తుతం రాజా సాబ్ చిత్రీకరణ తుదిదశలో ఉంది. నటీనటులు: ప్రభాస్, నిధిఅగర్వాల్, మాళవిక మోహనన్ తదితరులు. టెక్నికల్ టీమ్.. ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వర రావు, సినిమాటోగ్రఫీ: కార్తీక్ పళని, మ్యూజిక్: తమన్, ఫైట్ మాస్టర్: రామ్ లక్ష్మణ్, కింగ్ సోలోమన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ఎస్‌కేఎన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: టీజీ కృతిప్రసాద్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ కాకా, కో ప్రొడ్యూసర్: వివేక్ కూచిభొట్ల, ప్రొడ్యూసర్: టీజీ విశ్వప్రసాద్, రచన, దర్శకత్వం: మారుతి.

# 'ఘాటి' నుంచి ఫస్ట్ లుక్, గ్లింప్స్

క్వీన్ అనుష్క శెట్టి, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ ఘాటి గ్లింప్స్‌లో ఇంటెన్స్ వైలెంట్ క్యారెక్టర్‌లో అందరినీ ఆశ్చర్య పరిచారు. అనుష్క పుట్టినరోజున విడుదలైన గ్లింప్స్ అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రాన్ని గీజు క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇది బ్లాక్ బస్టర్ వేదం విజ



యం తర్వాత అనుష్క, క్రిష్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా, అలాగే గీజు క్రియేషన్స్‌తో అనుష్కకు నాల్గవ చిత్రం. ఈ చిత్రంలో తమిళ స్టార్ విక్రమ్ ప్రభు దేశీ రాజు అనే లీడ్ క్యారెక్టర్‌ని పోషిస్తున్నాడు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మేకర్స్ అతని ఫస్ట్ లుక్, పాత్ర గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్ అతన్ని ఫెరోషియస్ అవతార్‌లో ప్రజెంట్‌చేసింది. గ్లింప్స్‌లో దట్టమైన అడవులు, కఠినమైన ఘాట్ ప్రాంతాల గుండా పోలీసులు విక్రమ్‌ను వెంబడిస్తున్నట్లు ప్రజెంట్ చేశారు. తరువాత అతనుగూండాలతో ఇంటెన్స్ యాక్షన్ సీన్ ప్యాక్డ్‌గా వున్నాయి.

# 'దిల్ రూబా' పోస్టర్ విడుదల

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా దిల్ రూబా. ఈ సినిమాలో రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. దిల్ రూబా చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. దిల్ రూబా సినిమా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా దిల్ రూబా సినిమా నుంచి విశెస్ చెబుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హీరో కిరణ్ అబ్బవరం జాయ్ ఫుల్‌గా కనిపిస్తున్నారు. లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దిల్ రూబా ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ సినిమా టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. ఫిబ్రవరి 14న వాలైంటెన్స్ డే దిల్ రూబా రిలీజ్‌తో మరింత స్పెషల్ కానుంది. నటీనటులు: కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్, తదితరులు. టెక్నికల్ టీమ్, పీఆర్ఓ: జీఎస్‌కే మీడియా దుడ్డి శ్రీను. ప్రొడక్షన్ డిజైనర్: సుధీర్ ఎడిటర్: ప్రవీణ్. కేఎల్ సినిమాటోగ్రఫీ: డానియేల్ విశ్వాస్, మ్యూజిక్ సామ్ సీఎస్, నిర్మాతలు: రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ.

# 'మోగ్లీ 2025' నుంచి సాక్షి సాగర్ మదోల్కర్ పరిచయం

తన తొలి చిత్రం కలర్ ఫోటోతో జాతీయ అవార్డును గెలుచుకుని యంగెస్ట్ దర్శకుడిగా గుర్తింపు పొందిన సందీప్ రాజ్ మరో ఎమోషనల్ రిచ్ స్టోరీతో వస్తున్నారు. మోగ్లీ 2025 టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో యంగ్ ట్యాలెంటెడ్ రోషన్ కనకాల హీరోగా నటిస్తున్నారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కాంటెంపరరీ లవ్ స్టోరీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విజనరీ ప్రొడ్యూసర్ టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటివలే ఈ సినిమా గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా డెబ్యుటెంట్ సాక్షిసాగర్ మదోల్కర్ నటిస్తున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన మేకర్స్ జాస్మిన్‌గా హీరోయిన్ సాక్షిసాగర్ మదోల్కర్ పాత్రని పరిచయం చేశారు. ఇంటెన్స్ అండ్ పవర్ ఫుల్ లుక్‌లో త్రిశూలం పట్టుకొని ఆదిశక్తిగా కనిపించిన సాక్షి మదోల్కర్ ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఈ పోస్టర్ సినిమాలో ఆమె క్యారెక్టర్‌పై చాలా క్యురియాసిటీని పెంచింది. మోగ్లీ 2025కి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. కలర్ ఫోటోకు సక్సెస్ ఫుల్ సౌండ్‌ట్రాక్స్ అందించిన కాల భైరవ సంగీతం సమకూర్చనున్నారు. బాహుబలి 1, 2, ఆర్‌ఆర్‌ఆర్ వంటి భారీ బ్లాక్‌బస్టర్‌లలో చీఫ్ అసోసియేట్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన రామ మారుతి ఎమ్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. కలర్ ఫోటో, మేజర్, అప్ కమింగ్ గూడాచారి 2 చిత్రాలకు పని చేసిన పవన్ కళ్యాణ్ ఎడిటర్. మోగ్లీ 2025 చిత్రాన్ని 2025 వేసవిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తారాగణం: రోషన్ కనకాల, సాక్షిసాగర్ మదోల్కర్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సందీప్ రాజ్, నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్, బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: కాల భైరవ, డిఓపి: రామ మారుతి ఎం, ఎడిటర్: పవన్ కళ్యాణ్ పీఆర్వో: వంశీ శేఖర్ మార్కెటింగ్: ఫస్ట్ షో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.



# 'లైలా' నుంచి ఫీమేల్ లుక్ రిలీజ్

మాస్ కా దాస్ విశ్వక్సేన్ అప్ కమింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ లైలా. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఫస్ట్ సింగిల్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ చిత్రంలో విశ్వక్సేన్ అమ్మాయి అబ్బాయిగా కనిపించనున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ మూవీ నుంచి ఇప్పటికేను మోడల్‌ని రిలీజ్ చేశారు. సంక్రాంతి సందర్భంగా, మేకర్స్ ఫీమేల్ లుక్‌ని రిలీజ్ చేశారు. పోస్టర్‌లో విశ్వక్సేన్ అని గుర్తించడం కష్టం, ఎందుకంటే అతను అద్భుతమైన మేకప్‌తో అచ్చు అమ్మాయిలా కనిపిస్తున్నారు. చుట్టూ తిరుగుతున్న సీతాకోక చిలుకలు ఎగురుతూ, లైలా పెదవులపై వేలుతో నిశ్శబ్దాన్ని వ్యక్తపరిచే సింబాలిక్ ఫోజ్‌లో కనిపిస్తుంది. పింక్ కలర్ థీమ్ అమ్మాయి ఎలిగెన్స్‌ని జోడిస్తుంది. లైలా పాత్రలో విశ్వక్ సేన్ అద్భుతంగా ట్రాన్స్‌ఫర్మేషన్ కావడం ఆకట్టుకుంటుంది. ఈసినిమా టీజర్‌ను జనవరి 17న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆకాంక్ష శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. వాసుదేవ మూర్తి స్క్రీన్ ప్లే అందించగా, రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చగా, బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. నటీనటులు: విశ్వక్సేన్, ఆకాంక్ష శర్మ సాంకేతిక సిబ్బంది: బ్యానర్: షైన్ స్క్రీన్స్.






# 'నారి నారి నడుమ మురారి' ఫస్ట్ లుక్

చార్మింగ్ స్టార్ శర్వా 37వ మూవీ శర్వా37, సామజ వరగమన ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో చిత్రీకరణ జరుగుతోంది. అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి నిర్మించిన ఈ చిత్రం జాయ్ ఫుల్ హిలేరియస్ రైడ్‌గా ఉండబోతోంది. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రానికి నారీ నారీ నడుమ మురారి అనే టైటిల్ రివిల్ చేశారు. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. ఈ టైటిల్ సినిమా మెయిన్ బ్యాక్ డ్రాప్‌ని తెలియజేస్తుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ హీరో డైలామాని చూపిస్తుంది. సాక్షివైద్య, సంయుక్త మధ్య శర్వా గందరగోళ పరిస్థితిలో చిక్కుకున్నట్లు కనిపిస్తుంది. పోస్టర్‌లో ఇద్దరు అమ్మాయి శర్వా చెవుల్లో అరవడం, అతను చెవులను మూసుకోవడం కనిపిస్తోంది. కాగితాలు ఎగురుతూ గందరగోళం, హ్యూమర్‌ని యాడ్ చేస్తున్నాయి. ఈ సన్నివేశం ఒక లైటర్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కోసం టోన్‌ని సెట్ చేస్తుంది. శర్వా ట్రెండీ దుస్తులలో ఎట్రాక్టివ్‌గా కనిపిస్తుండగా, సాక్షివైద్య, సంయుక్త ఇద్దరూ మెరుస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ జాయ్ ఫుల్ వైబ్‌ను కనిపిస్తోంది, ఈ చిత్రం యువత, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా వుంటుంది. నారీ నారీ నడుమ మురారికి అత్యుత్తమ సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. విశాల్ చంద్ర శేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, జ్ఞాన శేఖర్ వీఎస్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భాను బోగవరపు కథను రాస్తున్నారు, నందు సావిరిగణ సంభాషణలను అందిస్తున్నారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా సహ నిర్మాతగా అజయ్ సుంకర వ్యవహరిస్తున్నారు. ప్రధాన నటీనటులు షూటింగ్‌లో పాల్గొంటున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. తారాగణం: శర్వానంద్, సంయుక్త, సాక్షివైద్య, సాంకేతిక సిబ్బంది: స్క్రీన్ ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర, బ్యానర్లు: ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, కథ: భాను బోగవరపు, డైలాగ్స్: నందు సవిరిగాన సంగీతం: విశాల్ చంద్ర శేఖర్, సహ నిర్మాత: అజయ్ సుంకర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి పీఆర్వో: వంశీ శేఖర్, డిజిటల్:విశ్వ సీఎం.



# సితార 'ప్రొడక్షన్ నం.32' లాంచ్

బేబీ చిత్రంతో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ద్వయం సంచలన విజయం సాధించింది. అలాగే 90ఎస్ వెబ్ సిరీస్‌తో దర్శకుడు ఆదిత్య హాసన్ ప్రతి కుటుంబానికి చేరువయ్యారు. ఇప్పుడు ఈ ముగ్గురు యువ సంచలనాలతో వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, తమ ప్రొడక్షన్ నం.32ని సగర్వంగా ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాతలు అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. 90ఎస్ సిరీస్‌లో చిన్న పిల్లవాడు ఆదిత్య పాత్ర ఎంతలా ప్రేక్షకుల మనసులను గెలుచుకుందో తెలిసిందే. ఆ పిల్లవాడు పది సంవత్సరాల తర్వాత పెద్దవాడైతే, ఆ పాత్రను ఆనంద్ దేవరకొండ పోషిస్తే, అతనికి ఒక అందమైన ప్రేమ కథ ఉంటే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి ఈ చిత్ర కథ పుట్టినట్లుగా అనౌన్స్ మెంట్ వీడియోలో చూపించారు. "మీరు టీవీలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా చూశారు కదా. ఇప్పుడు థియేటర్లో ఒక మిడిల్ క్లాస్ బాయ్ లవ్ స్టోరీ చూడండి. ఇది నా స్టోరీ, నీ స్టోరీ, కాదు కాదు మన స్టోరీ. మోస్ట్ రిలేటబుల్ లవ్ స్టోరీ. అంటూ వీడియో చివర్లో ఆనంద్ చెప్పిన డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రం కామెడీ, రొమాన్స్, ఎమోషన్, డ్రామా కలయికతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా రూపొందనుంది. తన మధురమైన మెలోడీలతో ప్రపంచవ్యాప్తంగా హృదయాలను గెలుచుకున్న సంగీత సంచలనం హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ నవీన్ నూలి మరియు 90ఎస్ సిరీస్‌లో తన అసాధారణ ప్రతిభతో ప్రశంసలు పొందిన ఛాయాగ్రాహకుడు అజీమ్ మొహమ్మద్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై బ్లాక్ బస్టర్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రకటన వీడియోతోనే ఈ చిత్రం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. యువ దర్శకుడు ఆదిత్య హాసన్, బేబీ ద్వయంతో కలిసి మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి సిద్ధమవుతున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. తారాగణం: ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, రచన, దర్శకత్వం: ఆదిత్య హాసన్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్ కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: అజీమ్ మొహమ్మద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఫణి కె. వర్మ, సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, వి.ఎం.ఆర్ బ్యానర్స్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్.





# మురికివాడ మహిళల్లో మార్పు..

మనకేదైనా కష్టం వస్తే ఇలాంటిది ఎవరికీ రాకూడదనుకుంటాం. అయితే, ముంబయికి చెందిన ఆత్మాదేవి అలా అనుకోవడంతో ఆగిపోలేదు. ఆ కష్టాల్ని ఎదిరించేలా మురికి వాడల మహిళల్లో 20 ఏళ్లగా చైతన్యాన్ని నింపుతోంది..

ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్ జిల్లాలో మారుమూల గ్రామంలో పుట్టి పెరిగింది. ఆత్మాదేవీ జైస్వర్ పెళ్లినాటికి ఆమె వయసు 14ఏళ్ల ప్రపంచం తెలియని ఆ వయ సులో భర్తతో కలిసి ముంబయి. వచ్చింది. మురికి వాడైన దారిలో తన కొత్త జీవితాన్ని ప్రారంభించింది. చూస్తుండగానే ఇద్దరు పిల్లలు వాళ్లను ఎలా పెంచాలో కూడా తెలిస్తే వయసు కాదు. ఆర్థిక స్వేచ్ఛ లేదు. తనకంటూ ఏ విలువా ఉండేది కాదు. భర్త, అత్తమామలు తనను ఇంట్లో నుంచి బయటకి పంపేవారు కాదు. అలా ఏళ్ల తరబడి ఓ చిన్న గదిలోనే మగ్గిపోయింది. ఇలా తరచుగా గృహహింసను ఎదుర్కొంటూ. కానీ ఎన్నాళ్లిలా? ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడి బయట పడింది. సోషల్ యాక్టివిస్టుగా మారి... 17తను బయటపడటమే కాదు, తనలాంటి వాళ్లకోసమూ పోరాడాలనుకుంది ఆత్మాదేవి. అప్పటినుంచీ ధరావి, ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి అక్కడి మహిళల్లో చైతన్యం కల్పించడం మొదలు పెట్టింది. వివిధ వివరాలను ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి అక్కడి మహిళలు, అమ్మాయిల పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునేది పనిచేయవలసిన అవసరం లేదు, ఆర్థిక స్వేచ్ఛ, గృహహింస కేసుల్లో పిల్లల హక్కులు, పిల్లల లైంగిక వేధింపుల చట్టాలు మొదలైన వాటి గురించి వారికి అవగాహన కల్పించడం ప్రారంభిం చింది. అలా సాగిన ప్రయాణం... ప్రస్తుతం అహ్మదాబాద్, నాగుర్, నాసిక్, సోలాపూర్ వంటి ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలు చేపట్టే స్థాయికి చేరుకుంది. "చాలా మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడ్డారు. వాళ్ల సొంతంగా సంపాదించుకోవటమే కాదు, వారి పిల్లలకు మెరుగైన విద్య, జీవన శైలిని అందిస్తున్నారు అంటోన్న ఆత్మాదేవి ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!





# 17 యేళ్లకే ఏడు పర్వతాలెక్కేసింది !



మనం కన్న కల నెరవేరితే ప్రపంచాన్నే జయించినంతగా మురిసిపోతాం కానీ నిజంగానే ప్రపంచాన్నే గెలిచేసింది 17 ఏళ్ల కామ్య కార్తికేయ. ఒకటి కాదు, రెండు కాదు.. ఏడు ఖండాల్లో ఏడు ఎత్తైన శిఖరాల్ని అధిరోహించి.. పర్వతారోహణలోనే ప్రతిష్టాత్మకంగా చెప్పుకొనే 7 సమిట్ ఛాలెంజ్ ఇటీవలే పూర్తి చేసింది. ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా చరిత్రకెక్కింది. మరి, ఇంత చిన్న వయసులో కామ్యకు ఇంతటి సాహసం ఎలా సాధ్యమైంది? తెలుసుకుందాం..

'మా నాన్నకు సాహసాలంటే ప్రాణం. ఈ ఇష్టంతోనే నాకు మూడేళ్ల వయసున్నప్పుడు తన నేవీ బృందంతో కలిసి తరచూ పర్వతారోహణకు వెళ్లేవారు. ఈ వంటివే నెలల తరబడి ఇంటికి దూరంగా ఉండేవారు. 'అమ్మా. నాన్న ఎందుకు మనల్ని వదిలి పర్వతారోహణకు వెళ్తున్నారు? అంతగా ఆ పర్వతాల్లో ఏం మహత్తు దాగుంది' అని ఓ రోజు అమ్మనడిగా. 'అదేంటో నీ ప్రయత్నంతో నువ్వే తెలుసుకో... అంది అమ్మ. దాంతో నాకూ పర్వతాలెక్కాలన్న మక్కువ కలిగింది. ఏడేళ్లొచ్చాక అమ్మానాన్నలతో కలిసి ఉత్తరాఖండ్లోని చంద్రశిల పర్వతం పైకి ట్రెక్కింగ్‌కు వెళ్లే ఈ సాహసం, అక్కడి అహ్లాదకరమైన వాతావరణం నాకెంతో నచ్చింది. ఇక అప్పట్నుంచి ఏటా పర్వతారోహణే నా వెకేషన్‌గా మారిపోయింది. అలా క్రమక్రమంగా నా ట్రెక్కింగ్ నైపుణ్యాలు. పెంచుకుంటూ ముందుకు సాగా.. అంటోంది. కామ్య. ఇలా చిన్న వయసులోనే పర్వతారోహణను తన ప్రవృత్తిగా చేసుకున్న కామ్య. మొదట తన తండ్రితో కలిసి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పైకి చేరుకుంది. ఆపై ఉత్తరాఖండ్లోని కేదార్కాంతా, రూపుండ్ సరస్సు ఇతర ఎత్తైన శిఖరాలను అధిరోహించి తన నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచుకుంది. ఈ కోరికనే 7. సమిత్ ఛాలెంజ్ పై కన్నేసింది కామ్య ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఏడు ఎత్తైన శిఖరాల్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆమె.. తన 13 ఏళ్ల వయసులో ఆఫ్రికాలోని 'మోంట్ కిలిమంజారో పర్వతారోహణతో ఈ ఛాలెంజ్ పూర్తి చేసే దిశగా తొలి అడుగు వేసింది. 'సాహస్'గా తన యాత్రకు పేరు పెట్టుకున్న కామ్య. ఆపై వరుసగా యూరప్‌ని 'మోంట్ ఎక్స్‌ట్రాస్', ఆస్ట్రేలియాలోని 'మోంట్ కంచుసుకో', దక్షిణ అమెరికాలోని 'మోంట్ ఆకొన్ కాగ్వా, ఉత్తర అమెరికాలోని 'మోంట్ డెనాలీ, ఆసియాలోని 'మోంట్ ఎవరెస్ట్' శిఖరాల్ని అధిరోహిం చింది. ఇక ఇటీవలే అంటార్కిటికాలోనే ఎత్తైన శిఖరమైన 'మోంట్ విన్సన్' శిఖరాగ్రానికి చేరుకుంది. ఇలా నాలుగేళ్లలో సమిత్ ఛాలెంజ్ పూర్తి చేసింది 17 ఏళ్ల వయసు ప్రపంచంలోనే అతి పిన్న వయసులో ఈ ఛాలెంజ్ పూర్తి చేసిన మహిళగా చరిత్ర కెక్కింది.



'ప్రతి పర్వతారోహణ నాకెన్నో పాఠాలు నేర్పింది. వైద్యం, ఓర్పు, సహనం.. వంటి జీవితానికి ఉపయోగపడే విషయాలెన్నో నేర్చుకున్నా ఈ భూమి పై ఉన్న అందమంతా పర్వతాల పైనే దాగుందేమో అనిపించింది. అంటూ తన అనుభవాల్ని పంచుకుం టోందీ యంగ్ మోంటానీర్. అంటే కాస్త ఏటవాలుగా ఉన్న రోడ్డు ఎక్కా లంటేనే ఆయాసం వస్తుంది. అలాంటిది గమ్యమే కానరాని కల్పిం పర్వతాలు ఎక్కాలంటే, గుట్టలుగా పేరున్న మంచులో ట్రెక్కింగ్ చేయాలంటే చాలా కష్టం. అందుకు శారీరకంగా, మానసికంగా సిద్ధం కావాల్సి ఉంటుంది. అందుకే తాను రోజూ కఠిన మైన వ్యాయామాలు సాధన చేస్తానంటోంది కామ్య. పర్వతారోహణ మనం ఊహించుకున్నంత సులభం కాదు. పట్టుదలను పెంచుకుంటూ మాన సికంగా సంసిద్ధం కావాల్సి ఉంటుంది. అలాగే శారీరకంగా కఠినమైన వ్యాయామాలు చేయాలి. నేనైతే రోజూ ఎక్కువ దూరం పరిగెడతా.. సైక్లింగ్ చేస్తా, ప్రస్తుతం మేము ముంబయిలో 21వ ఫ్లోర్‌లో ఉంటున్నాం. అలాగని రోజూ ఎక్కి దిగడానికి లిఫ్ట్ వాడను. మెట్లే ఉపయోగిస్తా ఒక్కసారి కాదు.. కనీసం 1015 సార్లు ఎక్కి దిగుతా. అది కూడా బ్యాక్‌ప్యాక్‌తో" అంటోన్న ఈ చిన్నది.. తన మోంటె నీరింగ్ ప్రయాణం కోసం కావాల్సిన ప్యాకింగ్, ప్లానింగ్ అంతా తన తండ్రిని చూసి నేర్చుకున్నట్లు చెబుతోంది.







# మగువ పచ్చటి గుత్తుల హారం

నగలపై మక్కువ లేని మగువలుండరంటే అతిశయోక్తి కాదేమో! అందుకే వారి మనసుని పసిగట్టి.. పసిడి మెరుపులకు ముత్యాలు, పచ్చలు, పగడాలు..వంటి నవరత్నాలెన్నో చేర్చి చమక్కుమనిపిస్తుంటారు డిజైనర్లు. అంతేనా, అమ్మ, అమ్మమ్మల తరం నాటి ఆభరణాలకు, అందమైన నగిషీలెన్నో అద్ది ఈతరం వారిని ఆకట్టుకుంటున్నారు. అలా వచ్చినవే గుత్తపూసల హారాలు. ఇవి నిన్నటి వరకూ ముత్యాలతో మురిపించాయి. ఇప్పుడు పచ్చలు సెమీ ప్రెషయస్ ఆనిక్స్ స్టోన్‌తో.. సందడి చేస్తున్నాయి. రాణీహారాలు, చోకర్లు, టెంపుల్ డిజైన్ నగల హారాలు.. ఒకటేమిటి అన్నింటి మీదకూ చేరి ధరించినవారికో ప్రత్యేకతనూ తెచ్చిపెడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రాచరికానికి గుర్తుగా రాజ్యమేలే పచ్చలు.. ఇప్పుడు రకరకాల ఆకృతుల్లో ఒదిగిపోతున్నాయి. ముఖ్యంగా ముత్యాలను పోలి ఉండేలా చేసిన ఇవి చిన్నచిన్న గుత్తుల్లో ఒదిగిపోయి హుందాగా మెప్పిస్తున్నాయి. పుత్తడి నగిషీల మధ్య కొత్తదనాన్ని చుట్టుకుని అదరహో అనిపిస్తున్నాయి. ముత్యాలతోనూ జతకట్టి సొగసులీనుతున్నాయి. మరింకెందుకాలస్యం రానున్న వేడుకలూ, పండగల్లో చీరకు జతగా ధరించేయండి.





ఫ్యాషన్ ఫ్యాషన్





# సహజంగా మెరిసిపోదాం !



అందంగా కనిపించాలనే ప్రయత్నంలో మేకప్ తప్పనిసరి అని భావించేవారి సంఖ్యలో రోజుకి పెరుగుతోంది. అయతే, కరణ ఎబ్బెట్టుగా కాకుండా సహజంగా

- ఫౌండేషన్ వేస్తే తెల్లగా, అందంగా కనిపిస్తామనేది చాలామంది అపోహ. అయితే, అ శరీరంలో కలవకపోయినా, మీ చర్మ ఛాయకు, తత్వానికి పరిపడకపోయినా... ముఖ వర్చస్సుని చెడగొడుతుంది. ఇలాంటప్పుడు ఒక రంగుని ఎంచుకునే కంటే మీ ఛాయకు దగ్గరగా వచ్చేలా చిత్రాలను కలిపి చూడండి. దాన్ని లైటింగ్ కింద కాకుండా ఆరుబయట వెలుతురులో చెక్ చేసుకోండి, ఇక, ఫౌండేషన్ ప్యాచుల్లా కనిపించకూడదంటే ఆయిల్ ఫ్రీ ధకాలను ఎంచుకోవాలి.
- లైట్ ఫౌండేషన్ లేదా టింటెడ్ మాయిశ్చరైజర్ని ఎంచుకుంటే చర్మం మేకప్కి అనువుగా మారుతుంది. అయితే, అలంక రణకు ముందు తప్పనిసరిగా ముఖాన్ని శుభ్రంగా, తేమగా ఉంచుకోవడం తప్పనిసరి. చివరిగా నుదురు, ముక్కు కణతల దగ్గర బ్రాంజ్ పౌడర్ తో టచప్ చేయాలి... చర్మం ఎక్కువగా మెరుస్తున్నా. జిడ్డుగా కనిపిస్తున్నా కాంపాక్ట్ పౌడర్ని పూర్తిగా అద్దేయండి. అప్పుడు సహజంగా కనిపించొచ్చు.
- పెదాలకు లేత గులాబీ న్యూ, పీచ్ షేడ్స్ లిప్ స్టిక్ ను ఏంచుకుంటే బాగుంటుంది. అయితే, ముందుగా బామ్ రాసి పెదవులను తేమగా ఉంచడం మరిచిపోవద్దు. తక్కువ కళ్ల మేకుతో చాలా సహజంగా కనిపించొచ్చు. ఇతర బ్లాక్ ఐలైనర్ వాడండి. కనురెప్పలపై బ్రాంజ్ షేడ్ని ఎంచుకుని లైట్ గా అద్దండి.

## చెలి చిట్కా


- ప్రతి కుంటే బలుసాకు తినొచ్చు.
- బావ మరుదల బ్రతుకకోరును, దాయాదుల చావు కోరును.
- బిడ్డ వచ్చిన వేళ, గొడ్డు వచ్చినవేళ.
- . బాలహక్కు, బ్రహ్మ వాక్కు లు
- బూడిదలో పోసిన పన్నీరు.

# అది నిర్లక్ష్యం కాదు రుగ్మత



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: మా అమ్మాయి రాను రాను కొరకరాని కొయ్యలాగ తయారు అయ్యింది. అహంకారం, నిర్లక్ష్యం, అశ్రద్ధ, బద్ధకం నరనరాన జీర్ణించుకుని పోయింది. 13 ఏళ్ళ వయస్సులో ఉండాల్సి చలాకీతనం, చైతన్యం ఏ మాత్రం కనిపించడం లేదు. పేరున్న పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదవుతున్నది. ఉదయం త్వరగా నిద్రలేవదు. అరచి కోప్పడి కసురుకుని లేపాల్సి వస్తుంది. తీరా బాత్ రూమ్‌లోకి వెళితే కనీసం రెండు గంటలు గడిపేస్తుంది. 32 ఏళ్ళకు బ్రష్ త్రోమడల చేయదానికే అర్థగంట పడుతుంది. అన్ని పనులు ముగించుకుని స్నానం చేసి రావడానికి రెండు గంటలు పడుతుంది తరువాటిఫిన్ చేయడానికి అర్థగంటపైగా సమయం వెచ్చిస్తుంది. వెంటపడి అరవక పోతే గంటకూడ అక్కడే కూర్చుంటుంది. ఇక బట్టలు వేసుకుని రెడీ అవడానికి మరో అర్థగంట పడుతుంది. వారంలో మూడు, నాలుగు రోజులైనా స్కూల్ బస్సు తప్పించేస్తుంది. దీనితో బస్సు వద్దని చెప్పి మా వారే ఆమెను స్కూల్లో దిగబెట్టి ఆఫీసుకు వెళతారు. ఆఫీసునుంచి వస్తూ ఆమెను ఇంటికి తీసుకుని వస్తారు. స్కూల్లో కూడ సరిగా చదవడం లేదని టీచర్లు చెపుతున్నారు. పరీక్షల్లో బాగా వెనుకబడిపోతోంది. సాధారణ విషయాలలో చాలా తెలివిగా ఉంటుంది సాధారణ విషయాలలో చాలా తెలివిగా ఉంటుంది. సినిమాలు, ఇతరుల విషయాలు పూసగుచ్చినట్టు చెపుతుంది. చదివింది మాత్రం ఏదీ గుర్తుపెట్టుకోదు. మా అన్నయ్య కూడా ఇలాగే ఉండేవారు. ఇప్పుడు అందరూ మేనమామ పోలిక అంటూ హేళన చేస్తున్నారు. ఉన్నది ఒకే బిడ్డ కాబట్టి ఏమి చేయలేక కుమిలిపోతున్నాము. ఈ వయస్సులో ఆమె ఎందుకు అలాప్రవర్తిస్తున్నదో అర్థం నఆవడం లేదు.గత కొద్ది రోజులుగా తిరగబడి మాట్లాడుతోంది. ఎక్కువ వేధిస్తే ఇల్లు వదిలి ఎక్కడికైనా వెళ్లిపోతానని బెదిరిస్తోంది. చిన్న తనం నుంచి కొద్ది నెమ్మదిగా ఉండేది. గత ఏడాది నుంచి సమస్యగా తయారయ్యింది. ఈ పరిస్థితులలో ఆమెలో నిర్లక్ష్యం పోగొట్టి చైతన్యం కలిగించే మార్గం చెప్పండి. **- ఒక సోదరి, హైదరాబాద్**



**జవాబు :** అమ్మా, అమ్మాయి సమస్య నిర్లక్ష్యం, బద్ధకం కాదు. ఆమె అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (ఓసిడి)తో బాధ పడుతున్నదని భావించాలి. నెమ్మదిగా ఉండటం, నిదానంగా పని చేయడం కొందరి స్వభావంగా చెప్పవచ్చు కొందరు నెమ్మదిగా నెమ్మదిగా నేర్చుకుంటుంటారు. ఇలాంటి వారిని 'స్లోవెర్నర్స్' అంటుంటారు. అయితే మీ అమ్మాయి ఇతర విషయాలలో తెలివిగా ఉంటూ రెండు గంటలు స్నానం అర్థగంట భోజనం చేయడం బట్టి ఆమె ఓసిడితో బాధపడుతున్నదని భావించాలి. అలాగే చదువులో వెనకబడటానికి ఓసిడితో పాటు ఇతర అంశాలు కారణంకావచ్చు. చదువు అర్థంకాక పోవడం, ప్రాథమిక సూత్రాలు తెలియక పోవడం, భయం, ఆందోళన, నిద్రలేమి లాంటి అంశాలు కారణం కావచ్చు. కాబట్టి త్వరపడి ఆమెను సైకాలజిస్టు వద్దకు తీసుకుని వెళ్ళండి. కొన్ని సాంకేతిక పద్ధతుల ద్వారా ఆమెల్లో రుగ్మత లక్షణాలు తొలగిస్తారు. అవసరం అయితే సైకియాట్రిస్టును కలసి మందులు వాడండి. దీనితో పాటు ఆమెను నిత్యం విమర్శించడం మాని అనునయంతో ప్రోత్సహించడానికి ప్రయత్నం చేయండి. లోపాలను గుర్తించి సరిదిద్దేందుకు కృషి చేయండి. వీలైతే నెమ్మదిగా యోగ, ధ్యానం. వ్యాయామాలు, ఆటలు అలవాటు చేయండి. క్రమంగా ఆమెలో మార్పు వస్తుంది.

వ్యథ

# ఇంట్లోనే వెన్న చేద్దామిలా !



పెరుగు, మజ్జిగ వినియోగం పెరుగుతుంది. పాత రోజుల్లో అయితే... మజ్జిగని ఇంట్లో చిలికేవారు. దీనికోసం కవ్వాలుండేవి. ఇప్పుడైతే మజ్జిగ, వెన్న, పెరుగు అన్నీ రెడీమేడ్గానే తెచ్చుకుంటున్నాం. కానీ పిల్లలకి అన్నీ తెలియాలన్నా, ఇంట్లోనే కమ్మని వెన్నని తయారు చేసుకోవాలన్నా ఈ పరికరం మీకు సహకరిస్తుంది. ఇది బటర్ చర్నర్. కిందున్న గాజు సీసాలో పెరుగు వేసి మూత బిగించి ఆ పిడిని తిప్పితే చాలు. నాలుగైదు నిమిషాలకు పాల నుంచి తాజా వెన్న వెరవుతుంది. వంటల్లోకి, పిల్లలకు పెట్టడానికి బాగుంటుంది. పైగా ఇలా చిలకడాన్ని పిల్లలు ఆస్వాదిస్తారు కూడా.

# పాన్ బనారస్ వాలా..

ఆధ్యాత్మిక కేంద్రం బెనారస్ అదేనండీ వారణాసి వివిధ రకాల వంటకాలకీ ప్రసిద్ధి. ముఖ్యంగా పాన్లకి పెట్టింది పేరు. అమితాబ్ నటించిన కైకే పాన్ బెనారస్ వాలా.. ఎంత పెద్ద హిట్టో తెలుసా! పాన్తో పాటు అక్కడ దొరికే ఆ వంటకాలేంటో తెలుసుకుందాం రండి...



**సబ్జి కచోరీ** వేడివేడి కచోరీలు వాటితో పాటే వేడి అలూకూర వారణాసి ప్రత్యేకం. ఒక్క కచోరీ తిన్నా చాలు కడుపు నిండిపోతుంది. అంత రుచిగా, పెద్దగా ఉంటాయి.

**చెనాదహీవడా,** తీయని పెరుగులో ముంచిన వడలు.. జీలకర్రపొడి, నల్లుప్పు రుచితో భలే ఉంటాయి.

**బట్టిచోక** గోధుమ పిండితో చేసిన చిన్నచిన్న ముద్దలని బొగ్గులమీద కాల్చి, వంకాయ కూరతో పెడుతుంటారు. వారణాసిలో ఏ మూలకెళ్లినా వేడివేడి బట్టీ చోకాలు దొరుకుతాయి. **బనారసీ తండాయి;** చిక్కని పాలతో చేసిన లస్సీలు వివిధ రకాల పండ్ల ఫ్లేవర్లతో దొరకడం ఈ లస్సీల ప్రత్యేకం. **చూడా మేటర్:** అటుకులని వేయించి, పచ్చి బఠాణీలతో చేసే వంటకం ఇది. ఇంగువ, మిరియాలపొడి వేసి చేస్తే ఈ వంటకాన్ని పర్యటకులు చాలా ఇష్టంగా తింటారు.

శ్రీ ప్రహ్లాద్ హుల్యాల్‌కర్ గా3రి తాత గారు, తంరడి గారు కూడా సాయి భక్తులే. ఒకనాడు వారింటికి షిరిడీ యాత్రచేసి ప్రసాదమును ఇచ్చుటకు ఒక స్నేహితుడు వచ్చినాడు. ప్రహ్లాద్ గారి భార్య అతనితో 'షిరిడీ నుండి సాయిబాబాను మా ఇంటికి ఎందుకు తీసుకురాలేదు? అని నవ్వుతూ అడిగింది. ఆ స్నేహితుడు

# గృహామే సాయి మందిరం !

కూడా నవ్వుతూ 'మార్గ మధ్యములో ఉన్నారు' అని చెప్పాడు. ఇది జరిగిన ఒకటి రెండు రోజులయినది. ఒకనాటి రాత్రి ప్రహ్లాద్ గారి భార్యకు స్వప్నంలో 'నీ భర్త సోదరుడు వచ్చుచున్నాడు, నీవు వెంటనే ఒక రొట్టె పెట్టి దృష్టి దోషము తొలగించు అను స్వరము వినబడినది. ఆమె అట్టే చేసినది. ఇంకా కాషాయ వస్త్రములు ధరించిన సాయిబాబా వారి గృహములో ప్రవేశించాడు. స్వప్నము ముగిసినది. అది జూన్ 22వ తారీకు (1977). మధ్యాహ్నం అందరూ నిద్రిస్తున్నారు. ఇంతలో ఎవరో తలుపు తట్టినట్టయినది. అందరూ నిద్ర లేలచినారు. తలుపు తెరవగా ఇంటి ముదు



ఆధ్యాత్మికం



రెండు కార్లు ఆగి ఉన్నాయి. సుమారు 25 మంది వచ్చారు. వారిలో ఒకరు మిమ్మలను చూచుటకు వచ్చా ము. అన్నాడు. వారినందరిని గృహములోపలకు ఆహ్వానించి కూరునచండబెట్టారు. ఆబాజీ పన్సీకర్ అనే వ్యక్తి ప్రహ్లాడ్‌తో 'మాస్టరనఈట! ఈ సాయిబాబా విగ్రహమును మందిరములో ప్రతిష్టించవలెనని తెచ్చితిమి. ఇంకను మందిరములో ఏర్పాట్లు పూర్తి కాలేదు. నేటి నుండి రెండవ రోజున మంచి మూహూర్తమున్నది. కనుక ఈ ఒక్క రాత్రికి ఈ విగ్రహమును మీ ఇంట్లో ఉంచాలనే తలంపుతో తెచ్చినాము అన్నాడు. అందుకు ప్రహ్లాద్ సంతోషముతో అంగీకరించాడు. సాయినాథుని విగ్రహాన్ని అక్కడ ఉంచి వెళ్లిపోయారు వచ్చినవారు. ఆ కుటుంబంలోని పిల్లలు ఆ విగ్రహాన్ని అక్కడ ఉంచి వెళ్లి పోయారు వచ్చినవారు. ఆ కుటుం బంలోని పిల్లలు ఆ విగ్రహాన్ని చూస్తూ 'బాబా నీవు మావాడివైతే మా ఇల్లు విడిచిపెట్టి వెళ్ళవు అన్నారు. మందిరములో అనేక అడ్డంకులు కలుగుతున్నాయి. ఈలోగా ఎందరో ప్రహ్లాద్ గారి ఇంటికి వచ్చి సాయిని దర్శించసాగారు. అందరూ కలిసి అబాపాన్సీకర్‌ను కోరగా సాయి విగ్రమను ప్రహ్లాద గారి ఇంట్లోనే ఉంచుటకు అంగీకరించెను. ప్రహ్లాద్‌గారి భార్య, పిల్లలు కోరినట్టు సాయి బాబా, ప్రహ్లాద్ గారింటికి వచ్చాడు.

**- యం.పి.సాయినాథ్**

# ఛాంపియన్స్ ట్రోఫీలో చెత్త రికార్డ్

## ఎక్కువ సార్లు ఓడిన జట్టుగా పాకిస్థాన్

### అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టుగా భారత్

**ఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు రంగం సిద్ధమైంది. ఈ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టోర్నీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. మినీ వరల్డ్ కప్‌గా పిలిచే ఈ టోర్నీలో ఈసారి ప్రపంచం నుంచి 8 జట్లు పాల్గొంటున్నాయి. ఆతిథ్య పాకిస్థాన్‌తో పాటు భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, అఫ్ఘానిస్థాన్‌ల పేర్లు ఇందులో ఉన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ఈ 8 జట్లలో, ఏ జట్టు ఇప్పటి వరకూ నిర్వహించిన ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యుత్తమ ప్రదర్శన చేసింది? ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టు ఏది? మరి, గెలిచిన దానికంటే ఎక్కువ మ్యాచ్‌లు ఓడిన ఏకైక జట్టు ఏది అన్న వివరాలు చూస్తే ఆసక్తికరంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు 29 మ్యాచ్‌లు ఆడగా, ఇందులో 18 గెలిచి, 8 మ్యాచ్‌ల్లో భారత జట్టు ఓడిపోయింది. మరో 3 మ్యాచ్‌లంలో ఫలితం తేలలేదు. అంటే, కొన్ని కారణాల వల్ల పాయింట్లను పంచుకోవలసి వచ్చింది. దీంతో మ్యాచ్‌ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, ఇతర 7 జట్ల కంటే భారత్ విక్టరీ జాబితా ఎక్కువగా కనిపిస్తుంది. ఇక ఆస్ట్రేలియా గురించి చెప్పాలంటే, ఛాంపియన్స్ ట్రోఫీలో 24 మ్యాచ్‌లు ఆడింది. అందులో 12 గెలిచి, 8 మ్యాచ్‌ల్లో ఓటమిని ఎదుర్కొంది. ఈ ఎల్లో జెర్సీ జట్టుకు 4 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. ఆస్ట్రేలియాలాగే





దక్షిణాఫ్రికా కూడా ఛాంపియన్స్ ట్రోఫీలో 24 మ్యాచ్‌లు ఆడి 12 విజయాలు సాధించింది. కానీ, ఓటమి ఆస్ట్రేలియా కంటే ఎక్కువగా ఉంది. దక్షిణాఫ్రికా 11 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. కేవలం ఒక మ్యాచ్ టై అయింది. ఆతిథ్య పాకిస్థాన్ గురించి చెప్పాలంటే గెలిచిన మ్యాచ్‌లకంటే ఓడినవే ఎక్కువ. ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ 23 మ్యాచ్‌లు ఆడగా, అందులో 11 గెలిచింది. మరో 12 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఈ విధంగా, ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడుతున్న 8 జట్లలో గెలిచిన దానికంటే ఎక్కువ మ్యాచ్‌లను కోల్పోయిన ఏకైక జట్టుగా నిలిచింది. కాగా ఇంగ్లండ్ జట్టు గురించి చెప్పాలంటే, ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటివరకు 25 మ్యాచ్‌లు ఆడింది. అందులో 14 గెలిచి, 11 ఓడింది. వెస్టిండీస్ 24 మ్యాచ్‌లు ఆడగా, అందులో 13 గెలిచి 10 ఓడింది. ఒక మ్యాచ్ టై అయింది. వెస్టిండీస్ లాగా, న్యూజిలాండ్ కూడా 24 మ్యాచ్‌లు ఆడింది. అయితే 12 గెలిచింది. 10 ఓడిపోయింది. అయితే, కివీ జట్టు 2 మ్యాచ్‌లు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక 2025లో ఛాంపియన్స్ ట్రోఫీలోకి కొత్త జట్టు ఎంట్రీ ఇచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీలో అఫ్ఘానిస్థాన్ సరికొత్త జట్టుగా చేరింది. సరళంగా చెప్పాలంటే, ఈ జట్టు మొదటిసారిగా ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో ఆడటం కనిపిస్తుంది.

# టీమిండియాలో విభేదాలు తీవ్రతరం

## గంభీర్, సీనియర్ల మధ్య మనస్పర్థలు

**ఢిల్లీ:** భారత క్రికెట్ జట్టులో విభేదాలు తీవ్రతరం అయ్యాయి. ప్రధానంగా గౌతమ్ గంభీర్, సీనియర్ ఆటగాళ్ల మధ్య రచ్చ రచ్చ జరుగుతోంది. భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఇప్పటికే జట్టు ప్రదర్శనపై సమీక్ష చేపట్టింది. గంభీర్, కొంత మంది స్టార్ ఆటగాళ్ల ప్రత్యేక డిమాండ్లపై అభ్యంతరం వ్యక్తం చేయగా, సీనియర్లు అతని కమ్యూనికేషన్ పద్ధతిపై అసంతృప్తి తెలిపారు. గంభీర్, సీనియర్ ఆటగాళ్ల మధ్య జట్టు కల్చర్, పద్ధతుల విషయంలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. గంభీర్ ధోరణిని గ్రేగ్ ఛాపెల్‌తో పోలుస్తూ, దానిని భారత్‌కు



అనుకూలం కాదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ వివాదాలు టీమ్ డ్రెస్సింగ్ రూమ్ వాతావరణాన్ని అసహజంగా మార్చాయి. అటువైపు సీనియర్ ఆటగాళ్లు కోచ్ నుంచి సరైన కమ్యూనికేషన్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వివాదం కొనసాగుతుండగా, జాతీయ సెలక్షన్ కమిటీ గంభీర్‌కు సెలక్షన్‌పై అధికహస్తం ఉండకూడదని అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. గంభీర్ ధోరణి ప్రముఖ ఆస్ట్రేలియన్ కోచ్ ఛాపెల్‌ను గుర్తు చేస్తోందని మాజీ సెలెక్టర్ ఒకరు వ్యాఖ్యానించారు. గ్రేగ్ ఛాపెల్ భారత జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు తాను తీసుకున్న కొన్ని నిర్ణయాలు పెద్ద వివాదాలకే దారితీశాయి. మరోవైపు 'గంభీర్ ఒక రవిశాస్త్రిలా మీడియా ఫ్రెండ్లీగా ఉంటే బాగుంటుంది. లేదంటే రాహుల్ ద్రావిడ్, గ్యారీ కిర్‌స్టెన్ లేదా జాన్ రైట్‌లా కూల్‌గా, దూరంగా ఉండి ఆటగాళ్లకు వేదిక ఇవ్వాలి. కానీ చాపెల్ విధానం భారత్‌లో పనిచేయదని' ఆ సెలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వివాదంలో మరింత చర్చకు దారితీసిన విషయం గంభీర్ వ్యక్తిగత సహాయకుడు. అతను ఆస్ట్రేలియాలో జట్టును ప్రతిచోటా అనుసరించాడని సమాచారం. ఆ వ్యక్తి సెలెక్టర్ల కోసం ప్రత్యేకంగా కేటాయించిన కారులో ఎందుకు కూర్చున్నాడు? వారికి ప్రైవేటుగా చర్చలు జరపడానికి వీలులేకుండా చేశాడు. అతనికి అడిలైడ్‌లో బీసీసీఐ హాస్పిటాలిటీ బాక్స్‌లో స్థానం ఎలా దక్కింది?" అని బీసీసీఐ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, టీమ్ సభ్యులకు ప్రత్యేకంగా కేటాయించిన ఫైవ్ స్టార్ హోటల్ ప్రాంతంలో అతను బ్రేక్‌ఫాస్ట్ ఎలా చేశాడు? అని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో, ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్ పరిస్థితి అసహజంగా ఉందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.



# ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా బుమ్రా

**ఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతమైన ప్రదర్శనకు ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికయ్యాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించిన ఫలితాల్లో పురుషుల విభాగంలో బుమ్రా ఈ అవార్డ్‌ను గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను వెనక్కి నెట్టి మరీ బెస్ట్ ప్లేయర్ అవార్డ్‌ను అందుకున్నాడు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన మూడు టెస్ట్‌ల్లో బుమ్రా 14.22 సగటు రేటులో 22 వికెట్లు సాధించాడు. తరువాత జరిగిన నాలుగు, 5 మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తీశాడు. అదే సమయంలో అత్యధిక రేటింగ్ పాయింట్స్ సాధించిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అద్భుతంగా రాణించాడు. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌ను దక్కించుకున్నాడు. ఈ అద్భుతమై ప్రదర్శనతో బుమ్రా ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా నిలిచాడు. ఇదే సమయంలో బుమ్రా అత్యధిక రేటింగ్ పాయింట్స్ సాధించిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో 200 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో రెండో ఇన్నింగ్స్ 33.2 వద్ద ట్రావిస్ హెడ్ వికెట్ పడగొట్టిన బుమ్రా 200 మార్క్ దాటాడు. అలాగే అత్యంత వేగంగా 200 వికెట్ల మైలురాయిని చేరుకున్న భారత బౌలర్‌గా నిలిచాడు. ఇక టెస్టుల్లో భారత్ తరఫున 200+ వికెట్లు పడగొట్టిన 12వ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. కాగా, ఓవరాల్‌గా ఈ ఘనత అందుకున్న నాలుగో పేసర్ బుమ్రా కావడం విశేషం.

# వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం

**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల అండర్-19 టి20 ప్రపంచ కప్ ముందు డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వార్మప్ మ్యాచ్‌లో భారీ విజయంతో శుభారంభం చేసింది. ఈ సన్నాహక పోరులో భారత్ ఏకంగా 119 పరుగుల భారీ తేడాతో స్కాట్లాండ్‌పై జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. కమలిని (23 బంతు ల్లో 32) టాప్ స్కోరర్ కాగా, గొంగడి త్రిష (26), కెప్టెన్ నికీ ప్రసాద్ (25) సనిక చల్కే (17) సహచరులకూ బ్యాటింగ్ ప్రాక్టీస్ అవకాశమిచ్చేందుకు రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగారు. ప్రత్యర్థి బౌలర్లలో అమీ బల్డీ (2/13) కాస్త ప్రభా



వం చూపింది. 3 ఓవర్లు వేసిన ఆమె13 పరుగులే ఇచ్చింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన స్కాట్లాండ్‌ను భారత బౌలర్లు 18.5 ఓవర్లలో 45 పరుగులకే ఆలౌట్ చేశారు. షబ్నమ్ షకీల్, వైష్ణవి శర్మ, సోనమ్ యాదవ్ తలా 2 వికెట్లు తీశారు. ఇర మిగతా వార్మప్ మ్యాచ్లో ఆస్ట్రేలియా 140 పరుగుల తేడాతో ఆతిథ్య మలేసియాను ఓడించగా, వెస్టిండీస్ 9 పరుగుల తేడాతో నేపాల్‌పై గట్టెక్కింది. అమెరికా 13 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ 4 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందగా, ఇంగ్లండ్ 9 వికెట్ల తేడాతో సమోవాపై ఘన విజయం సాధించగా, పాకిస్థాన్ 11 పరుగులతో నైజీరియాను ఓడించింది. ప్రధాన టోర్నీ ఈనెల 18 నుంచి జరుగుతుంది.



# మహిళల టి20లో.. భారత్ రికార్డ్ విక్టరీ

**ఢిల్లీ:** ఐర్లాండ్ మహిళా క్రికెట్ జట్టుతో మూడో వన్డేలో స్మృతి సేన ఘన విజయం సాధించింది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో పర్యాటక జట్టును ఏకంగా 304 పరుగుల తేడాతో మట్టికరిపించింది. తద్వారా భారత మహిళా క్రికెట్ వన్డేచరిత్రలో త్ర అతి భారీ గెలుపును నమోదు చేసింది. అంతేకాదు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. కాగా ఐసీసీ చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత్, ఐర్లాండ్ మధ్య మూడు వన్డేలు జరిగాయి. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఈ సిరీకు దూరం కాగా, ఆమె స్థానంలో స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. ఇక ఈ నెల 10న జరిగిన తొలి వన్డేలో ఐర్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచిన భారత్, 12 నాటి మ్యాచ్‌లో 116 పరుగుల తేడాతో ఐరిష్ జట్టును చిత్తు చేసింది. ఈ క్రమంలో ఇరు జట్ల మధ్య బుధవారం మూడో వన్డే జరిగింది. టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ చేసి రికార్డు స్కోరును సాధించింది. ఓపెనర్లు ప్రతికా రావల్ 129 బంతుల్లో 20 ఫోర్లు, 1 సిక్స్ 154 పరుగులు చేయగా, స్మృతి మంధాన 80 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లు, 135 పరుగుల భారీ శతకాలతో చెలరేగగా, వికెట్ కీపర్ రిచా ఘోష్ అర్ధ శతకం 42 బంతుల్లో 59 పరుగులతో రాణించింది. మిగిలిన వాళ్లలో తేజల్ హెసాబ్నిస్ 28 పరుగులు చేసి ఫర్వాలేదనిపించగా, హర్లీన్ డియోల్ 15 పరుగులు, జెమీమా రోడ్రిగ్స్ 4 పరుగులు, దీప్తిశర్మ 11 పరుగులు చేసి ఆఖర్లో మెరుపులు మెరిపించారు. ఈ నేపథ్యంలో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 435 పరుగులు చేసింది. మెన్స్, వుమెన్స వన్డే క్రికెట్‌లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఇక లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ ఆది నుంచే తడబడింది. ఓపెనర్లలో కెప్టెన్ గాబీ లూయిస్ 1 పరుగుతో పూర్తిగా విఫలం కాగా, వన్‌డౌన్ బ్యాటర్ కౌల్టర్ రెలీ ఒక్క పరుగు కూడా చేయకుండానే డకౌట్‌గా వెనుదిరిగింది. ఈ క్రమంలో మరో ఓపెనర్ సారా ఫోర్బ్స్ 41 రన్స్‌తో కలిసి ఓర్లా ప్రెరెండెర్‌గాస్ట్ 36 పరుగులు చేసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, భారత బౌలర్ల ధాటికి ఈ ఇద్దరు కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయారు. సారా, ఓర్లా ఔటైన తర్వాత ఐర్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ పేక మేడలా కుప్పకూలింది. లారా డెలానీ 10 పరుగులు, లీ పాల్(15), అర్లెన కెలీ 2 పరుగులు, అవా కానింగ్ 2 పరుగులు, జార్జియానా డెంపీ 0, అలనా డాల్జెల్ 5 పరుగులు, ఫ్రేయా సార్జెంట్ 1 రన్ చేసి త్వరత్వరగా పెవిలియన్ చేరారు. ఫలితంగా ఐర్లాండ్ 31.4 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో భారత్ 304 పరుగుల తేడాతో జయభేరిమోగించింది.

## వాణిజ్యం


# దిగుమతులపై బడ్జెట్‌లో సుంకాల పెంపు!

**ముంబై, జనవరి 15:** గత కొన్ని నెలలుగా రూపాయి విలువ గణనీయంగా క్షీణిస్తోంది. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో దిగుమతులపై అధిక సుంకాలను విధించే అవకాశాన్ని పరిశీలించవచ్చని యర్నెస్ట్ అండ్ యంగ్ చీఫ్ పాలసీ అడ్వైజర్ డికె శ్రీవాస్తవ తెలిపారు. దిగుమతిపై అధిక సుంకాలతో డాలర్ల డిమాండ్‌ను అరికట్టగలదని ఆయన అన్నారు. తాజాగా ఓ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈయన 15వ ఆర్థిక సంఘం సలహా మండలి సభ్యుడిగా ఉన్నారు. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ అకస్మాత్తుగా క్షీణించడంతో బడ్జెట్ రూపొందించే వారికి, ద్రవ్య విధానపరంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియాకి సవాలుగా మారుతుందని శ్రీవాస్తవ అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని అంచనాలు పెరగడంతో, ప్రపంచంలోని ఆర్థిక వనరులు అక్కడికే తరలిపోతున్నాయని తెలిపారు. రూపాయి మాత్రమే కాదు, ఇతర యూరోపియన్ కరెన్సీలు కూడా ఇలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రానున్న బడ్జెట్‌లో సుంకం రేట్లను పరిశీలించే అవకాశం ఉంది. దిగుమతులపై సుంకాలు విధించడం భారత్ ఆర్థికవ్యవస్థకు ఊతం అందిస్తుంది. ఫలితంగా దిగుమతి సుంకం ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుంది. డాలర్‌కు డిమాండ్ తగ్గుతుంది అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, జనవరి 13న అమెరికా డాలరు తో రూపాయి మారకం విలువ ఒక్క రోజులోనే 66 పాయింట్లు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 86.70 కనిష్టస్థాయికి చేరింది. గత రెండు వారాల్లో దీని విలువ ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పతనమైంది. దీంతో మన కరెన్సీ పతనాన్ని అదుపు చేయడంలో ఈ సుంకాల పెంపు చర్య సాయపడుతుందని శ్రీవాస్తవ అన్నారు. ఈ సారి బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌తో పాటు దిగుమతి సుంకాలపై కొన్ని సవరణలు ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



## హాల్దీరామ్ వాటా కొనుగోలు రేసులో పెప్సికో!

**న్యూఢిల్లీ, జనవరి 15:** దేశీయ చిరుతిళ్ల ఉత్పత్తి సంస్థ హాల్దీరామ్‌లో వాటా కొనుగోలు రేసులో ప్రముఖ శీతల పానీయాల సంస్థ పెప్సీకో వచ్చి చేరింది. అగర్వాల్ కుటుంబం నిర్వహిస్తున్న హాల్దీరామ్‌లో మైనారిటీ వాటా కోసం పెప్సికో చర్చలు ప్రారంభించిందని తెలుస్తోంది. ఇప్పటికే ప్రపంచ పెట్టుబడి సంస్థలైన టెమాసెక్, ఆల్ఫావేస్ గ్లోబల్ ఈ రేసులో ఉన్నాయి. తాజాగా పెప్సికో ఇందులోకి ఎంట్రీ ఇచ్చింది. హాల్దీరామ్ కంపెనీలో 10-15 శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి చూపుతూ టమాసెక్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ గత నెలలోనే బైండింగ్ ఆఫర్లు సమర్పించాయి. తాజాగా పెప్సికో హాల్దీరామ్‌లో పెద్దఎత్తున వాటా కొనుగోలుకు ఆసక్తి చూపుతుందని తెలుస్తోంది. దీనికోసం చర్చల్ని ప్రారంభించింది. కానీ అవి ఇంకా ప్రారంభదశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే





అగర్వాల్ కుటుంబం హాల్దీరామ్ విలువను రూ.85,000-90,000 కోట్లు లెక్కగట్టినట్లు తెలుస్తోంది. చర్చల అనంతరం తుది ఆఫర్ వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి. హాల్దీరామ్ స్నాక్స్‌లో మార్కెట్ లీడర్‌గా ఉంది. నమ్కీన్, స్వీట్లు, రెడీ టు ఈట్ ఫుడ్‌ఐటమ్స్, ప్రీ- మిక్స్ ఫుడ్ ఐటమ్స్‌తో సహా 500 రకాల ఉత్పత్తులను అందిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.12,800 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇక లేస్, కుర్కురే వంటి బ్రాండ్‌లతో పాశ్చాత్య దేశాల స్నాక్స్ మార్కెట్లో 24శాతం మార్కెట్ వాటాతో పెప్సికో ఆధిపత్యం చెలాయిస్తోంది. అయితే నమ్కీన్, భుజియా వంటి సంప్రదాయ భారతీయ స్నాక్స్‌లో ఉనికి అంతంతమాత్రమే ఉంది. దీంతో భారత్‌లో తన స్నాక్స్ మార్కెట్‌ని విస్తరించే పనిలో పడింది. ఇక హాల్దీరామ్ కొనుగోలు జరిగితే దేశీయ స్నాక్స్ విభాగంలో రాణించాలని చూస్తోంది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 15:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసాయి. ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే బాటలో పయనించాయి. రిలయన్స్, జొమాటో, ఎన్‌టిపిసి షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చాయి. ఇంట్రాడేలో 76,991.05 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరి, చివరికి 224 పాయింట్లు లాభపడి 76,724.08 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 23,293.65 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరి, చివరికి 37 పాయింట్లు లాభపడి 23,213 పాయింట్ల వద్ద నిలిచింది. జొమాటో, ఎన్‌టిపిసి, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, ఎల్అండ్‌టి, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీపోర్ట్స్ వంటి షేర్లు లాభపడ్డాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంకు, టాటా మోటార్స్, నెస్లే ఇండియా



వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌ధర 80.12 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,707.70 డాలర్ల వద్ద కొనసాగింది.

## మస్క్‌పై అమెరికా ఎస్ఇసి దావా

**వాషింగ్టన్, జనవరి 15:** దాదాపు రెండున్నరేళ్ల క్రితం ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌ను కొనుగోలు చేసి అందర్నీ ఆశ్చర్యపరచారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆ తర్వాత దాని పేరును ఎక్స్‌గా మార్చేశారు. అయితే ట్విటర్‌లో ఈ వాటాల కొనుగోలు కోసం అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమీషన్ (ఎస్ఈసీ)కు మల్క్ బెరాస్ గడువులోగా తెలియజేయలేదు. దీంతో ఆయనపై యుఎస్ ఎస్ఇసి తాజాగా దావా వేసింది. 2022 ఆరంభం నుంచి ట్విట్టర్‌లో మస్క్ వాటాలను కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. ఈ యేడాది మార్చి నాటికి ఆయన కంపెనీలో 5శాతం వాటాను దక్కించుకున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ నిబంధనల ప్రకారం, ఏదైనా కంపెనీ యాజమాన్యంలో 5 శాతం వాటా దాటితే ఆ విషయాన్ని 10 రోజుల్లోగా ఎక్స్ఛేంజ్‌కు వెల్లడించాలి. కానీ మస్క్ మాత్రం ఉన్న గడువు దాటి 11 రోజులు ఆలస్యంగా అంటే ఏప్రిల్ 4వ తేదీన ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. అప్పటికీ ఆయన వాటా విలువ 9.2శాతానికి చేరింది. దీంతో ఈ వ్యవహారంపై ఎస్ఇసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా ఎలాన్ మస్క్‌పై వాషింగ్టన్ డిసి ఫెడరల్ కోర్టులో దావా వేసింది. గడువులోగా వాటాల విషయం వెల్లడించనందుకుగానూ ఆయనకు జరిమానా విధించాలని అందులో కోరింది. అంతేకాకఉండా ఆ వాటాల నుంచి అందుకున్న లాభాలను కూడా ఆయన వదులుకునేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించింది. ఈ పిటిషన్‌పై మస్క్ గానీ, ఎక్స్ నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు. తొలుత ట్విట్టర్‌లో 9.2శాతం వాటాను కొనుగోలు చేసిన మస్క్, ఆ తర్వాత కంపెనీని పూర్తిగా కొనుగోలు చేస్తామని ఆఫర్ ఇచ్చారు. ఇందుకోసం 2022 ఏప్రిల్‌లో ఒప్పందం ఖరారు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత డబ్బుల విషయంలో ఇరువర్గాల మధ్య విభేదాలు రావడంతో ఈ యేడాది జులైలో ఒప్పందాన్ని



రద్దు చేసుకున్నట్లు మస్క్ ప్రకటించారు. అనంతరం ఇది కోర్టు పరిధికి వెళ్లింది. ఎట్టకేలకు అదే యేడాది ఏప్రిల్‌లో 44 బిలియన్ డాలర్లకు మస్క్ ట్విట్టర్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం దాని ఎక్స్‌గా పేరు మార్చి కొనసాగిస్తున్నారు.

## బఫెట్ వారసుడిగా హువర్డ్

**ముంబై, జనవరి 15:** ప్రపంచంలో దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ ఎట్టకేలకు తన బెర్క్‌షైర్ హాత్వే కంపెనీకి వారసుడిని ప్రకటించారు. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ ఛైర్మన్ బాధ్యతలు చేపడతారని తెలిపారు. ప్రస్తుతం బెర్క్ షైర్ వ్యాపార సామ్రాజ్యం విలువ సుమారు రూ.86లక్షల కోట్లు.ప్రస్తుతం వారెన్ బఫెట్‌కు 94 ఏళ్లు. తాజాగా ఆయన వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇస్తూ తన సంపదలో అత్యధిక మొత్తం కొత్తగా ఏర్పాటు చేసిన ఛారిటబుల్‌ట్రస్ట్‌కు ఇంటర్వ్యూ దక్కుతుందని పేర్కొన్నారు. తనముగ్గురు పిల్లలకు అతితక్కువ సంపద మాత్రమే ఇస్తున్నట్లు వెల్లడించారు. కాకపోతే వారే 140 బిలియన్ డాలర్ల ట్రస్ట్ దాతృత్వ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇక కుమారుడు హువర్డ్‌ను వారసుడిగా ఎంపిక చేయడంపై మాట్లాడుతూ, తన ముగ్గురు బిడ్డలను బలంగా విశ్వసిస్తానని చెప్పారు. హువర్డ్ కూడా నాబిడ్డే కాబట్టి అవకాశం లభించింది. గతంలో హువర్డ్ బెర్క్ షైర్ బోర్డులో దాదాపు 30ఏళ్ల పనిచేశారు. తాజాగా వారెన్‌పై ఆయన స్పందిస్తూ, నేను బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు భావిస్తున్నాను. ఎందుకంటే, నాన్న నన్ను ఇన్నేళ్లపాటు సిద్ధం చేశారు. చాలా యేళ్లుగా ఆయన నేర్పించిన పాఠాలు, ప్రభావం నాపై ఉన్నాయి అని పేర్కొన్నారు. హువర్డ్ బఫెట్‌ను హువీ అని కూడా పిలుస్తారు. కాలేజీ విద్య ముగిసిన వెంటనే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వ్యాపారరంగంలోకి వచ్చాడు. బెర్క్‌షైర్‌కు ఉన్న క్యాండీ తయారీ కంపెనీలను ఆయన చూసుకున్నారు. అక్కడే కీలకమైన వ్యాపార మెలకువలు నేర్చుకొన్నారు. హువర్డ్‌కోసం వారెన్ బఫెట్ ఓ పొలాన్ని కొనుగోలు చేసి ఇచ్చాడు. దానిని వాడుకొన్నందుకు తండ్రికి అద్దె చెల్లించాలన్నది కండిషన్. కాల క్రమంలో భూమిని దున్నకుండాసాగుచేయడాన్ని హువర్డ్ బలంగా నమ్మేవారు. దీంతోపాటు భూమి వినియోగం, సుస్థిర వ్యవసాయ విధానాలపై దృష్టి పెట్టారు.1989లో హువీ కౌంటీ బోర్డు కమిషనర్లలో ఒకరిగా చేరారు. తర్వాత దానిలోసభ్యుడిగా,



ఆపై చైర్మన్‌గా పని చేశారు. 2017-18లో ఆయన ఇల్లినాయ్ మాకాన్ కౌంటీ షరీఫ్‌గా విధులు నిర్వహించారు. 1993 నుంచి ఆయన చాలా ప్రముఖ కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్‌గా విధులునిర్వహించారు. వీటిలో బెర్క్ షైర్, కోకకోలా ఎంటర్‌ప్రైజెస్, లిండ్సే కార్పొరేషన్, స్లోన్‌ఇంప్లిమెంట్, కోన్ ఆగ్రో ఫుడ్స్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి.

## ఐపిఒకు శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్

**ముంబై, జనవరి 15:** జనవరి రెండవ వారంలో కొద్దిగా నెమ్మదించిన ఐపీవోల జోరు తిరిగి పెద్దగా స్టార్ట్ కావటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బెట్టింగ్ వేసేందుకు డబ్బు సిద్ధంగా పెట్టుకుంటున్న వారికోసం గోల్డెన్ ఛాన్సులు తిరిగి స్టార్ట్ అవుతున్నాయి. ఈక్విటీలకు దూరంగా ఐపీవోలపై బెట్ వేస్తున్న వారికి ఇదొక సదవకాశంగా చెప్పుకోవచ్చు. శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ కంపెనీ ఐపీవో తాజాగా మార్కెట్ రెగ్యులేటర్ సెబి వద్ద ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. దీంతో గోల్డ్ కంపెనీ నుంచి ఈ ఏడాది మెదటిగా వస్తున్న ఐపీవోకావటంతో పెట్టుబడిదారుల్లో హర్షం కొనసాగుతోంది. కంపెనీ తన వ్యాపారానికి వర్కింగ్ కేపిటల్ అవసరాలు, ఉత్పత్తి కేంద్రం విస్తరణ కోసం వినియోగించాలని నిర్ణయించినట్లు సెబీకి వెల్లడించింది. ఈక్రమంలో జనవరి13న సెబి వద్ద డీఆర్హెచ్పీ దాఖలు చేసింది. ప్రస్తుతం





తీసుకొస్తున్న ఐపీవో పూర్తిగా తాజా ఈక్విటీ షేర్లను కలిగి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. దీనిద్వారా 1.8కోట్ల ఫ్రెష్ ఈక్విటీలను విక్రయించాలని నిర్ణయించింది. ప్రస్తుతం కంపెనీ దేశంలోని ప్రముఖ 22 క్యారెట్ల ఆభరణాల తయారీదారుల్లో ఒకటిగా కొనసాగుతోంది. కంపెనీ ప్రస్తుతం స్కై గోల్డ్, ఆర్బీజెడ్ జ్యుయెలర్స్, ఉత్సవ్ సీజెడ్ గోల్డ్ వంటి కంపెనీలతో పోటీ పడుతోంది. వాస్తవానికి కంపెనీ 2003లో స్థాపించబడి దేశ ఆర్థిక రాజధాని ముంబై కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలను కొనసాగితోంది. ఐపీవో నుంచి సేకరించే మెత్తంలో రూ.45.8కోట్లను జైపూరులో కొత్తగా ఏర్పాటు చేయాలనుకుంటున్న ఉత్పత్తిసామర్థ్యం కోసం వినియోగించాలని ప్లాన్ చేస్తోంది. దీంతో 1200 కేజీల బంగారు ఉత్పత్తికి అవసరమైన ఏర్పాట్లను అక్కడ నెలకొల్పనుంది. దీంతో మెత్తం కంపెనీ వద్ద బంగారం ఉత్పత్తి సామర్థ్యం 3,900 కేజీలకు పెరుగుతుందని తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.